Dwaraka



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

సంపుటి11 | సంచిక 82
బుధవారం | 17 జనవరి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్య మాసం, బహుళ పక్ష తిథి : అమావాస్య ఉ.7.04, ఉత్తరాషాఢ రా.9.52, వర్జ్యం రా.2.16 నుంచి 4.00 వరకు, రాహుకాలం: మ.12.00 నుంచి 1.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.11.36 నుంచి 12.24 వరకు, సూర్యోదయం : ఉ.6.52 గం; సూర్యాస్తమయం: సా. 5.57 గం.

నా హత్యకు బీజేపీ కుట్ర

ప్రవీణ్ తొగాడియా సంచలన విమర్శ



- అదృశ్యమై ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో కనిపించిన ప్రవీణ్ తొగాడియా
- మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై సంచలన వ్యాఖ్యలు
- అరెస్ట్ చేసి ఎన్‌కౌంటర్ చేసేందుకు రాజస్థాన్ పోలీసులు చూశారు
- మాట్లాడకుండా ఉంచేందుకు స్వర పేటికను దెబ్బతీయబోయారు
- అతి కష్టం మీద తప్పించుకుని వెళ్లాను
- చావుకు భయపడే సమస్యే లేదన్న తొగాడియా

న్యూఢిల్లీ: ఒకరోజంతా ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయి, ఆపై అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో కనిపించిన విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తొగాడియా, సంచలన ఆరోపణలు చేశారు. మంగళవారం ఉదయం మీడియా ముందుకు వచ్చిన ఆయన కన్నీరు పెట్టుకుంటూ, తనను

మిగతా 6లో

ఇక హజ్ రాయితీ కట్

సంచలన ప్రకటన చేసిన కేంద్రం



- మీడియాకు వివరించిన కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ
- మైనార్టీలను మరింత అభివృద్ధి చేస్తాం
- ఇకపై హజ్ సబ్సిడీ నిధులను దేశంలో ముస్లిం బాలికల విద్య కోసం వినియోగిస్తాం
- ప్రతి బాలికకూ లబ్ధి చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- ఈ ఏడాది హజ్‌యాత్రకు 1.75 లక్షల మంది ముస్లింలు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది సౌదీలోని మక్కా, మదీనా నగరాల్లో జరిగే పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లే భారత ముస్లిం యాత్రికులకు ఇచ్చే సబ్సిడీను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. మంగళవారం కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మీడియాతో మాట్లాడారు.

6లో

ఫిబ్రవరిలో పంచాయితీ నగారా

- వచ్చే బడ్జెట్‌లో పంచాయితీలకు రూ.2వేల కోట్లు
- ఎన్నికల విధివిధానాలు బిల్లులో పొందుపరుస్తాం
- పంచాయితీ పరోక్షమా? ప్రత్యక్షమా? ఆలోచిస్తున్నాం
- మార్చి 12న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- చిన్న పంచాయితీ స్థాయిని బట్టి రూ.5 నుంచి 25లక్షలు
- మార్చి11న ఒకే రోజు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ
- గ్రామానికి ఓ నోడల్ అధికారి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రశేఖర్‌రావు

పంచాయితీ ఎన్నికలను వచ్చే నెలలోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుతం గ్రామ పంచాయితీల పదవీకాలం జూన్ వరకు ఉంది. అయితే నాలుగు నెలల ముందే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. గ్రామ పంచాయితీలకు వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు సైతం కేటాయించబోతున్నారు. గ్రామాల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా భావిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పంచాయితీచట్టాన్ని పకడ్బందీగా తీసుకొచ్చి నిధులు, విధుల్లో సైతం పంచాయితీ కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. మంగళవారంనాడు ప్రగతిభవన్‌లో జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పంచాయితీరాజ్ విషయంలో మరింత స్పష్టత నిచ్చారు.



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: సీఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఆర్థిక కమిషన్ ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర బడ్జెట్ లో రూ. 2000 కోట్ల నిధులు కేటాయిస్తామని, ఫిబ్రవరి నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం పరిశీలుస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధివిధానాలను శాసనసభలో ప్రవేశ పెట్టనున్న బిల్లులో పొందుపరుస్తామన్నారు. 12 మార్చి నుండి శాసన సభ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. చిన్న గ్రామ పంచాయితీకి (500 వరకు జనాభా) రూ. 5 లక్షల, తర్వాతస్థాయి పంచాయితీకి రూ. 10 లక్షలు అలా స్థాయినిబట్టి రూ. 15 లక్షల, రూ. 20 లక్షలు, రూ. 25 లక్షలు ప్రభుత్వం సమకూరుస్తుంది. వంద శాతం పన్నుల వసూలు చేయిస్తుంది. జాతీయ స్థాయి ఆర్థిక సంఘం నిధులు ఉపయోగించుకుంటాం. ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో ఆస్తులను సమకూర్చుకుంటాం. గ్రామా నికి ఇలా ఇంతపెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకుంటాం. దీనికి తోడు ఎమ్మెల్యే, ఎంపి, నిధులు కూడా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకుంటాం. మనం పట్టుబడితే పరిశుభ్ర, అభివృద్ధ కరమైన గ్రామీణ తెలంగాణను సాధించుకోగలమని సీఎం దశ, దిశానిర్దేశనం చేశారు.

ప్రతి గ్రామానికి ఓ నోడల్ అధికారి: మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకే సారి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ జరగాలని, దీని కొరకు ప్రతీ గ్రామంలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అందరు ప్రజాప్రతినిధులను, జిల్లా పరిషత్ అధ్యక్షులను, జడ్పీటీసీ సభ్యులను, మండలాధ్యక్షులను, కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్లను భాగస్వాములను చేయాలని సిఎం అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని కూడా ఆయన చెప్పారు. ప్రతీగ్రామానికి ఆ గ్రామ రైతుల పాస్ పుస్తకాలు ఒక రోజు ముందర కానీ, అదేరోజు ఉదయాన కాని చేర్చాలని, దీని కొరకు ప్రతీ గ్రామానికి ప్రత్యేకంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేయాలని సిఎం చెప్పారు. మంగళవారం ఉదయం ప్రగతి భవన్ లో ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలు పరుస్తున్న

మిగతా 6లో

రాజోలి బండకు సహకరించండి



- ఆర్డీఎస్ ఆధునికీకరణకు సహకరిస్తే మేలు
- ఏపీ కలసి వస్తే రైతులకు మంచి జరుగుతుంది
- ఏపీ మంత్రి దేవినేనికి హరీశ్ రావు లేఖ
- ఆయకట్టుదారుల ప్రయోజనాలను కాపాడుదాం
- రెండు రోజుల్లో ఏ విషయమూ తెలపాలన్న హరీశ్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుకు తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనుల్లో ఏపీ సహకారం కోరుతూ మంత్రి లేఖను రాశారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు జులైలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 4న కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్ రాష్ట్ర పర్యటన సందర్భంగా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ, కర్ణాటక, ఏపీ ఆయకట్టుదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులకు ఏపీ చొరవ చూపాలన్నారు. ఇప్పటికే కర్ణాటక అంగీకరించినందున హైదరాబాద్‌లో సమావేశానికి రెండు రోజుల్లో ఏపీ ఆమోదయోగ్యమైన తేదీలు చెప్పాలన్నారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

పెట్టుబడులే లక్ష్యం

- దక్షిణ కొరియాలో మంత్రి బృందం పర్యటన
- పెట్టుబడులు రాబట్టేందుకు సమావేశాలు
- టెక్స్‌టైల్ పరిశ్రమల సిఇవోలు, ఛైర్మన్లతో సియోల్‌లో భేటీ
- కాకతీయ పార్కులో పెట్టబడులు పెట్టాని కోరిన మంత్రి బృందం
- హ్యుందయ్ సంస్థతో సమావేశం, ఆటోమొబైల్ పెట్టుబడులకు అహ్వానం
- కొరియా మొబైల్ ఇంటర్నెట్ బిజినెస్ అసోషియేషన్ తో ఎంఓయూ
- కొరియా టెక్స్‌టైల్ సిటీ పేరుగాంచిన డైగు మెట్రోపాలిటన్ నగరాన్ని సందర్శించిన మంత్రి ప్రతినిధి బృందం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రెండు రోజుల పాటు దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న తెలంగాణ పరిశ్రమలు, ఐటి, మున్సిపల్, మైనింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి కెటి రామారావు బృందం పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పర్యటన కొనసాగుతున్నది. ఇందులో భాగంగా పలు కంపెనీల సియివోలు, కంపెనీల ప్రతినిధుల సమావేశాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన



మిగతా 6లో

ప్రజల జేబుకు చిల్లు

నిప్పులు చెరిగిన వైసిపి నేత జగన్

- ప్రజా సంకల్పయాత్రలో వై.ఎస్.జగన్ ధ్వజం
- ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు
- వైఎస్సార్ హయాంలో గాలేరునగరి ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశారు
- నాలుగేళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు కనీసం కాల్వలు తవ్వలేకపోయారు
- చేనేత, పవర్‌లూమ్ కార్మికుల పరిస్థితి అధ్వానం
- ఎన్ని లక్షలు ఖర్చైనా మీ పిల్లలను నేను చదివిస్తా
- అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు ఇస్తాం

(నగరి నుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతుందని, ఏ ఒక్క సామాజిక వర్గం కూడా సంతోషంగా లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మండిపడ్డారు. మనందరి ప్రభుత్వం రాగానే ప్రతి పేదవాడు విద్యా, వైద్యం కోసం అప్పుల పాలు కాకుండా చూస్తానని భరోసా ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలోనే పెట్రోలు, డీజిల్ ధరలు మండిపోతున్నాయని, ప్రజల జేబులను నాలుగేళ్లుగా చంద్రబాబు

మిగతా 6లో



అంతే ఇంతే!



దండిగా డబ్బుండి, వార్డు మెండర్లను కొనేస్తే నేనే సర్పంచ్‌గా గెలుస్తా



రూ.1000 కోట్ల పందెం కోడి

ఓడిన కోడి - మరుక్షణం చికెన్ పకోడి

- జోరుగా సాగిన కోడిపందాలు
- కోర్టు ఆదేశాలు బేఖాతర్
- దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన బెట్టింగ్‌రాయుళ్లు
- ఉభయగోదావరి జిల్లాల్లో చెలరేగిన కోడి
- కత్తులు కట్టించి రంగంలోకి దిగిన పందెం రాయుళ్లు
- దగ్గరుండి ప్రోత్సహించిన ప్రజా ప్రతినిధులు
- ఒత్తిడితో ఖాకీచొక్కా మౌనం!

సంక్రాంతి పందెం కోళ్ల కళ్లకు కోర్టులు కూడా బందాలు వేయలేకపోయాయి. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురష్కరించుకొని రూ.1000 కోట్లకుపైబడి కోడి పందాల బెట్టింగ్ కొనసాగింది. కోడి పందాల మొదలు కొన్ని గంటల వరకు మాత్రమే పోలీసుల హడావుడి కొనసాగినా తరువాత వారు కూడా ప్రేక్షకులుగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ కోడి పందాలకు బెట్టింగ్ పెట్టేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాలలోని భారతీయులు సైతం తరలివచ్చారు. ఉభయగోదావరి, నెల్లూరు, ప్రకాశం తదితర జిల్లాలు ఈ కోడిపందాలకు వేదికయ్యాయి. కోడి పందాలు జరిగిన చోట్ల షూగింగ్‌లు జరుగుతున్నాయా అన్న రీతిలో హంగామా సాగింది. డ్రౌన్ కెమెరాలు ఏర్పాటుచేసి మరీ ఈ పందాలను చిత్రీకరించారు. ఈ కోడి పందాల విషయంలో పోలీసులపై ఖాకీచొక్కాయే పై చెయ్యి సాధించింది. ఒకటి, రెండు చోట్ల మినహా రాష్ట్రంలోని పలుజిల్లాలో కోడి పందాలు హోరెత్తించాయి.

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రజల వద్దకే పాలన అన్నట్లుగా ఈ కోడిపందాలు జరిగిన చోటికే మద్యం చక్రాలు కట్టుకొని వచ్చి వాలింది. మద్దులోకి సోడా, మంచింగ్‌కు ఏ లోటు లేకుండా ప్రత్యేక స్టాల్స్ వెలిశాయి. ఇలా సంక్రాంతి సందర్భంగా మూడు రోజులుగా కోడిపందాల పేరుతో ఉభయ గోదావరి జిల్లాలో ప్రతి చోట పండగ వాతావరణం నెలకొంది. హైకోర్టు ఆదేశాలు, పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని పందెంరాయుళ్లు సంప్రదాయమంటూ కోళ్లకు కత్తులు గట్టి నోట్ల కట్టలతో పందేలకు దిగారు. ఈ పందేల ముసుగులో పేకాట, గుండాట, కోసు లాంటి జూద క్రీడలు విచ్చలవిడిగా సాగాయి. ఉభయగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా జిల్లాలోని పలుచోట్ల భోగి పండగ రోజైన ఆదివారం ఉదయం నుంచే బరుల చెంతకు పందెంరాయుళ్లు చంకన పుంజులతో వరుస కట్టారు. దాదాపు ప్రతిచోటా బహిరంగంగా కోళ్ల కాళ్లకు కత్తులు కట్టే పందేలు నిర్వహించారు. అప్పటివరకు హడావుడి చేసిన పోలీసులు అసలు సమయానికి పత్తా లేకుండా పోయారు. భోగి పండగ రోజునే తూర్పుగోదావరి జిల్లాలో రూ.10 కోట్లు చేతులు మారినట్లు అంచనా. జిల్లాలో పెద్ద బరి అయిన ఐ.పోలవరం మండలం మురమళ్లలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పర్యవేక్షణలో పందేలు జరిగాయి. విద్యుత్తు దీపాలు,



మిగతా 6లో

సూర్య
హైదరాబాద్
బుధవారం 17
జనవరి 2018
2

ఖైదీలకు క్షమాబిక్ష ప్రసాదించండి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే రేవంత్ లేఖ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏళ్లకు ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాంగ్రెస్‌నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. రిపబ్లిక్‌డే సందర్భంగా ఖైదీలను విడుదల చేయడానికి అవసరమైన జీవోను విడుదల చేయాలని కోరారు. గతంలో పెట్టిన షరతులు కాలపరిమితులతో లేకుండా ఉద్యమ సమయంలో ఖైదీలకు ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లు శిక్ష పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు, ఏడేళ్లు వాస్తవ శిక్షను మూడేళ్ల రిమిషన్ శిక్షతో కలిపి పదేళ్ల శిక్షను పూర్తిచేసిన పురుష ఖైదీలందరినీ విడుదల చేయాలన్నారు. ప్రాయశ్చిత్తానికి మించిన శిక్షలేదని మన వేదాలు, ధర్మశాస్త్రాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. అందుకే యావజ్జీవ కారాగారశిక్ష పడిన ఖైదీకైనా ఐదేళ్లు శిక్ష విధిస్తే సరిపోతుతుందని మహాత్మగాంధీ కూడా చెప్పారన్నారు. తెలంగాణ ఉద్యమసమయంలోను, గత ఎన్నికల సందర్భంగా ఐదేళ్లు శిక్ష పూర్తి చేసుకున్న వారిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన నాలుగేళ్లవుతున్నా ఖైదీలకు ఇచ్చిన హామీని అమలు కాలేదన్నారు. దీంతో ఖైదీలు, వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులు మానసికక్షోభను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు.



నేడు ఢిల్లీకి మంత్రి హరీశ్

- కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలంటూ కేంద్ర మంత్రికి వినతి
- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండ్స్ ను గమనించాలి
- ట్రేడింగ్ ఇతర కార్యకలాపాలను అధ్యయనం చేయాలి
- పాత పద్ధతిలో పనితీరుకు స్వస్తి చెప్పాలి
- కొనుగోలు చేసిన పంటకు వేగంగా చెల్లింపులు చేయాలి
- పెండింగులో ఉన్న చెల్లింపులు వారంలో క్లియర్ చేయాలి
- మంత్రి హరీశ్ రావు.

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రికి విజ్ఞప్తి చేయాలని టి.ఎస్.మార్కెటింగ్ మంత్రి హరీశ్ రావు నిర్ణయించారు. ఈ సీజన్ లో కందులు లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల కు పైగా దిగుబడి రానుందని అంచనా. అయితే 33 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం సుముఖత చూపింది. ఇప్పటివరకు 26,200 మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్ కు వచ్చినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో వస్తున్న కొత్త పరిణామాలను నిరంతరం పరిశీలించాలని, రైతులకు మేలు చేకూర్చే కొత్త పద్ధతులను ప్రవేశపెట్టాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మార్కెటింగ్ కార్యక్రమాలను సమీక్షించారు. వివిధ వ్యవసాయఉత్పత్తులు, రైతులకు లభిస్తున్న కనీస మద్ధతు ధరలు, చెల్లింపులను సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త విధానాలను ప్రవేశ పెట్టాలని మంత్రి కోరారు. గతంలో లాగా పాత పద్ధతులలో పని చేయొద్దని సిబ్బందిని కోరారు. రైతులకు జవాబుదారీగా పని చేయాలని



కోరారు. వివిధ జిల్లాల్లో పెండింగులో ఉన్న చెల్లింపులను వారంలో పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. కందుల కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపుల పెండింగ్ పై హరీశ్ రావు అసంతృాప్తి వ్యక్తం చేశారు. రూ.145 కోట్లు కందుల రైతులకు, 21 కోట్లు మొక్క జొన్న రైతులకు చెల్లించవలసి ఉందని మంత్రి అన్నారు. వీటిని వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఇకపై తాను జిల్లాలు పర్యటించినపుడు తప్పనిసరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను సందర్శిస్తానని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు తర్వాత రైతులకు చెల్లింపులో జాప్యం జరిగితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని అన్నారు.

గడ్డిఅన్నారం మార్కెట్‌ను కోహెడ కు తరలించనున్నందున అత్యాధునిక హంగులూ, సాంకేతిక పరిజ్ఞానంతో దాని ఏర్పాటు కోసం మూడు ప్రవేటు సంస్థలు ప్రజెంటేషన్ ఇచ్చాయి. 15 రోజుల్లో కోహెడ మార్కెట్ ఏర్పాటు, ఆధునీకరణ, వ్యయం, ఇతర వివరాలతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ ను సమర్పించాలని ఆయా సంస్థల ప్రతినిధులను మంత్రి కోరారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ డాక్టర్ జగన్మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, డిప్యూటీ డైరెక్టర్ లు లక్ష్మణుడు, రవికుమార్, మార్క్ఫెడ్, హాకా, మార్కెట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణకు ఒక్క ఉన్నత విద్యాసంస్థా కేటాయించలేదు

ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: తెలంగాణకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఒక్క ఉన్నత విద్యాసంస్థను కూడా కేటాయించలేదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యపై రెండు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడియం శ్రీహరి మాట్లాడుతూ తూతూ మంత్రంగా సమావేశాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమావేశాల వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాలకు ట్రిపుల్ ఐటీలను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం ట్రిపుల్ ఐటీ ఇవ్వలేదని కడియం శ్రీహరి అన్నారు. కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు కావాలని అడిగినా స్పందించలేదన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు కేజీబీవీ స్కూళ్లను 12వ తరగతి వరకు కొనసాగించాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం స్థలం కేటాయించినా ట్రైబల్ యూనివర్సిటీ మంజూరు చేయడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 296 గురుకుల పాఠశాలలు ఉంటే, వాటిని తమ ప్రభుత్వం 470కి పెంచిందని తెలిపారు. కొత్తగా 53 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు కూడా ప్రారంభించామని, రెసిడెన్షియల్ విద్యా విధానం ద్వారా డ్రాపవుట్లు తగ్గాయని కేంద్రానికి వివరించినట్టు కడియం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలను కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ కొనియాడారని పేర్కొన్నారు. బయోమెట్రిక్ విధానంతో హాజరు శాతం పెరిగిందన్న ఆయన, తద్వారా విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయన్నారు. ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

వైఎస్ జగన్ ప్రతి అడుగు నారా వారిలో వణుకు పుట్టిస్తోంది

వైసీపీ ఎమ్మెల్యే రోజా

నగరి, మేజర్‌న్యూస్: ఇడుపులపాయలో మొదలుపెట్టిన ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్ వేసే ప్రతి అడుగు నారా వారి నరాల్లో వణుకు పుట్టిస్తోందని వైసీపీ ఎమ్మెల్యే ఆర్‌కే రోజా అన్నారు. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం వడమాల పేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. "అడుగడుగునా పేద ప్రజల కన్నీళ్లు తుడుస్తూ ప్రజాసంకల్ప యాత్ర ద్వారా వస్తున్న మన అన్న రాజన్న ముద్దు బిడ్డ జగనన్నకి నగరి నియోజక వర్గం లోకి స్వాగతం సుస్వాగతం. ఇడుపులపాయలో మొదలుపెట్టిన ప్రజాసంకల్ప యాత్రలో జగనన్న వేసే ప్రతి అడుగు టీడీపీ గుండెల్లో గునపమై దిగుతోంది. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో రాబోయే ఎన్నికల్లో జగనన్న గెలవడం అంతే నిజం. పాదయాత్రలో జగనన్నతో కలసి అడుగులు వేయడం మనం చేసుకున్న అదృష్టం. అప్పట్లో వైఎస్ పాదయాత్ర ఓ చరిత్ర. నేడు జగనన్న పాదయాత్ర ఆధునిక చరిత్ర. జగనన్న ఎప్పుడు ముఖ్యమంత్రి అవుతాడో అప్పుడే మా ప్రాంతం అంతా అభివృద్ధి అవుతుందని అందరూ ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంతో పాటు నగరి నియోజ కవర్గం కూడా అభివృద్ధి చెందుతుంది. వైఎస్ రైతు బాంధవుడిగా పేరొందారు. ప్రతిపక్షం అధికారంలో ఉన్న జిల్లా అయిన కూడా పెద్ద మనసుతో గాలేరు నగరి ప్రాజెక్టును ప్రారంభించారు. ఆ రోజు చిత్తూరు జిల్లా ప్రజలు అందరూ సంతోషించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంతో ఖర్చు చేశారు. మధ్యలోనే మనల్ని వదలి వైఎస్ వెళ్లి పోయారు. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు ప్రాజెక్టుకు ఏదో అలా విదిలించారు. 65 శాతం పూర్తైన ప్రాజెక్టులో మిగిలిన 35 శాతాన్ని నాలుగేళ్లో పూర్తి చేయలేక పోయిన చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలి. చంద్రబాబు నాయుడు గాలేరు నగరి ప్రాజెక్టును సమాధి రాయిగా మార్చారు. మొన్ననే గాలేరు నగరి ప్రాజెక్టు సాధన కోసం నాలుగు రోజుల పాటు 88 కిలోమీటర్ల పాదయాత్ర చేశాం. వైఎస్ ప్రారంభించిన ప్రాజెక్టు జగనన్న చేతుల మీదుగానే ప్రారంభం కావాలి. సీఎం కాగానే చంద్రబాబు చిత్తూరు ప్రజల నోట్లోని తీపిని చేదుగా(చక్కెర పరిశ్రమల మూతను ఉద్దేశించి) మార్చారు. రేణిగుంట షుగర్ ఫ్యాక్టరీల వద్ద ప్రతిపక్ష పార్టీ ధర్నా చేస్తే రెండు సార్లు బకాయిలు ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రోడ్డుమీదకు తెచ్చాడు చంద్రబాబు." అని ఆమె ధ్వజమెత్తారు.



ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు,సూర్యబ్యూరో: జిల్లా ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలని, జిల్లా మరింత పురోభివృద్ధి సాధించాలని కోరుకుంటూ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలోని రైతులు పాడిపంటలు, సిరిసంపదలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఉత్తర్వులు భేఖాతరు

- 30-40 శాతం ఫీజులు పెంచిన ప్రవేటు స్కూలు, డొనేషన్లు అదనం
- పెంచక తప్పదని అధికారులకే చెప్పిన వైనం
- ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొన్న అధికారులు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికపై తుది నిర్ణయం తీసుకునే ఫీజులు పెంచవద్దన్న ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్ స్కూళ్లు భేఖాతరు చేస్తున్నాయి. 2017-18, 2018-19 విద్యా సంవత్సరంలో ఫీజులు పెంచవద్దని ఇటీవల ప్రైవేటు పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వ ఆదేశాల్ని ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యం ఏమాత్రం పరిగణలోకి తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. 2018- 19 విద్యా సంవత్సరానికి గానూ ఫీజుల పెంపుకు నిర్ణయాన్ని తీసుకున్నారు. తిరుపతిరావు కమిటీ సిఫార్సులను కూడా గాలికి వదిలి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచాలని నిర్ణయించారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంబ్రిడ్జి సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకుగానూ ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 12వ తేదీలోపు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. అదే సమయంలో ఫీజులను అసలే పెంచొద్దని ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను బుట్టదాఖలు చేసిన కొన్ని పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరానికి ఫీజులను భారీగా పెంచేశాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంబ్రిడ్జి సిలబస్ పాఠశాలు సమారు 150 వరకు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పాఠశాలలు కూడా ప్రభుత్వాన్ని ధిక్కరించి ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచేస్తున్నాయి. పాఠశాల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ తన నివేదికలో ప్రతియేటా 10 శాతం ఫీజులు పెంచుకోవచ్చని ప్రతిపాదించింది. దీనిపై ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయం తీసుకోలేదు. దీంతో నిర్ణయం తీసుకునేంత వరకు ప్రైవేటు పాఠశాలలు ఫీజులు పెంచొద్దని 2017-18 విద్యా సంవత్సరం ఫీజులనే ఈ ఏడాది కూడా కొనసాగించాలని ఆదేశించింది. అటు తిరుపతిరావు కమిటీ నిర్ణయాన్ని, ఇటు ప్రభుత్వ ఆదేశాన్నీ బుట్టదాఖలు చేసిన ప్రైవేటు పాఠశాలలు 2017-18 ఫీజులపై 30-40 శాతం పెంచడం గమనార్హం. ఓ పాఠశాలలో యూకేజీకి 2017-18లో రూ.60 వేలుగా ట్యూషన్ ఫీజు ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ. 75వేలు చేయడం గమనార్హం. దీనికి అదనంగా రవాణా ఇతర చార్జీలు ఉండనే ఉంటాయి. ఫీజులు పెంచొద్దని యాజమాన్యాలకు పాఠశాల విద్యా శాఖ నేరుగా మెమోలు కూడా జారీ చేసింది. ఫీజుల పెంపుతో ఊరుకోకుండా రూ.లక్షల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం డొనేషన్లు వసూలు చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీన్ని కూడా కొన్ని స్కూళ్ల యాజమన్యాలు పట్టించుకోవడంలేదు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, కేంబ్రిడ్జి సిలబస్ పాఠశాలల్లో ఫీజులు దోపిడి మరీ మితిమీరిపోయిందనే వాదనలు వినిపి స్తున్నాయి. తల్లిదండ్రులను ఆశలను ఆసరా చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఓ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్నాక్స్ కోసం రూ. 30వేలు వసూలు చేయడం గమనార్హం. అంటే స్నాక్స్ ఫీజే ఇంత భారీగా ఉంటే ఇంకా వార్షిక ఫీజు ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనవసరం లేదు. ఒక సంవత్సరానికి ప్రైమరీ విద్యార్థుల నుంచి రూ. 1.80 లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అడ్మిషన్లు, ఫీజుల దందాపై దృష్టి సారించాలని డీఈవోలను ఆదేశం చింది. ఫీజుల నియంత్రణపై ఉన్నతాధికారులకే లేని శ్రద్ధ తమకెందుకు అనుకున్నారో ఏమో గానీ డీఈవోలు, క్షేత్ర స్థాయి అధికారులు అసలు ఆ విషయాన్ని మర్చిపోయారు. ఒక్కరంటే ఒక్క అధికారికి కూడా ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ల తీరు, ఫీజులు వసూళ్లపై నేరుగా వెళ్లి పరిశీలించిన దాఖ లాలు ఎక్కడా లేవు.

'పవర్ హబ్ 'గా వికారాబాద్

- భారీగా సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు
- అత్యాధునిక సాంకేతికతో తొలి విండ్‌పవర్ ప్రాజెక్టు ఏర్పాటు
- పవర్, విండ్ ప్రాజెక్టుల ద్వారా 250 మెగావాట్ల ఉత్పత్తి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజధానికి చేరువలో ఉన్న వికారాబాద్ జిల్లా పవర్ హబ్‌గా మారుతోంది. విద్యుత్ ఉత్పత్తికి నిలయంగా పేరొందుతోంది. పరిగిలో ఏర్పాటు చేసిన పవర్ ప్రాజెక్టే కకాకుండా, జిల్లాలో సోలార్ ప్రాజెక్టులూ భారీగా ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. స్థానిక అవసరాలకు మించి ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. జిల్లాలోని 18 మండలాలకు సీజన్‌లో 230 మెగావాట్లు, అన్‌సీజన్‌లో 200 మెగాట్ల విద్యుత్ అవసరముండగా, ప్రస్తుతం జిల్లాలో విండ్, సోలార్ ప్రాజెక్టులతో 250 మెగవాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా అవసరాలకు పోను 20 మెగావాట్లు అదనంగానే ఉత్పత్తి అవుతోందన్నారు. ఇంకా జిల్లాలో పలు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయంటున్నారు. దేశంలోనే అధునాతన టెక్నాలజీతో వచ్చిన విండ్‌పవర్ ప్రాజెక్టు పరిగిలోనే ఏర్పాటు కావడంతో, భవిష్యత్తులో మరిన్ని విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యే అవకాశాలున్నాయంటున్నారు. పరిగి ప్రాంతంలో ఎత్తైన ప్రాంతాల్లో విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు అనుకూల వాతావరణమున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పరిగి శివారులో రూ.600 కోట్లతో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో విండ్‌ప్రాజెక్టును ఇప్పటికే ఏర్పాటు చేశారు. పరిగిలో ఏర్పాటైన విండ్‌పవర్ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిగా పేర్కొన్నారు. దేశంలోనే అత్యుత్తమ టెక్నాలజీతో ఈవిండ్ పవర్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు విండ్ పవర్ ఉత్పత్తికి వాడిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా టర్బర్స్ (టవర్స్) ఎత్తు 80 నుంచి 90 మీటర్లే ఉండగా, ప్రస్తుతం పరిగి ప్రాంతంలో 125 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేశారని తెలిపారు. ఇటువంటి పోల్స్ ఏర్పాటుకు ఖర్చు తక్కువని, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఒక్కో టవర్‌కు రూ.10 కోట్ల ఖర్చుతో 50 వరకు (టవర్స్) టర్బన్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ టెక్నాలజీ మొదటిసారి తెలంగాణలోని పరిగిలోనే వినియోగించారన్నారు. ఆ తర్వాత రాజస్థాన్‌లో ఒకటి, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మరొకటి ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో భారీగా సోలార్ ప్రాజెక్టులు

వికారాబాద్ జిల్లాలో భారీగా సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. విండ్ పవర్ ద్వారా 100 మెగావాట్లు ఉత్పత్తి అవుతుండగా, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా మరో 150 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో తాండూరు, వికారాబాద్, పరిగి, బంట్వారం, మోమిన్‌పేట్, కాళ్ళాపూర్, నస్కల్, బర్కత్‌పల్లి, పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్, ఎన్కెపల్లి, రావులపల్లిలోని సోలార్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా 150 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని విద్యుత్‌శాఖ వర్గాలు తెలిపాయి. తాండూరు, బంట్వారం ప్రాంతాల్లో కొత్తగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు.

సూర్య
హైదరాబాద్
బుధవారం 17
జనవరి 2018
3

ఏపీలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం : అంబటి

విజయవాడ, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో కోడిపందేలను సంప్రదాయం ప్రకారం కాకుండా జూదంగా మార్చేశారని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. మంగళవారం ఆయన విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కోట్ల రూపాయల మేర కోడి పందేల రూపంలో చేతులు మారాయి. పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయింది. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంఎమ్మెల్సీలే స్వయంగా ఈ జూదంను ప్రోత్సహించడం దారుణం. ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా పోలీసులను చూసిచూడనట్లు వ్యవహరించాలని సూచించడం వల్లే ఈ జూదం నడిచింది. పేకాట, గుండాట, బెల్ట్ షాపులు, కత్తులు కట్టి కోడిపందేలు జరుగుతూ ఉంటే పోలీసులు ఎందుకు స్పందించడం లేదు. అధికార పార్టీ నేతలు సంప్రదాయం ముసుగులో వేలకోట్లు చేతులు మారేలా చేస్తున్నారు. చాటుమాటుగా జరిగే జూదం నేడు కార్పొరేట్ స్థాయికి అధికార పార్టీ నేతలు తీసుకువెళ్లారు. ఎంపీ మాగంటి బాబు ఏర్పాటు చేసుకున్న టీడీపీ కార్యాలయాన్ని పేకాట కేంద్రంగా మార్చేశారు. ప్రజల బలహీనతను సొమ్ము చేసుకునేందుకు అధికార పార్టీ నేతలు సిద్ధపడటం దారుణం. కోడిపందేల శిబిరాల్లో అశ్లీల నృత్యాలు, బెల్ట్ షాపులు, పలావు సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటిని పెట్టుకున్నందుకు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటు. కొన్నిచోట్ల అశ్లీల నృత్యాలు చేయించారు. న్యాయస్థానాలు అంటే తెలుగుదేశం పార్టీ నేతలకు గౌరవం లేదా, ఇక హోంమంత్రి సొంత నియోజకవర్గంలోనే కత్తులతో కోడి పందేలు, జూదం జరుగుతోంది. ఇక పోలీసులు ఏం చేయగలరు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకే ఈ అరాచకం జరుగుతోంది. ఇక రాష్ట్రంలో చట్టాలు, సంప్రదాయాలు ఎందుకు. ఇది సమాజానికి ప్రమాదకరం. క్రికెట్‌పిచ్‌ల మాదిరిగా కోడి పందేల బరులు సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో పం దేలు నిర్వహించారు. ప్రజల బలహీనతలను పెంచేలా సాక్షాత్తూ ప్రజా ప్రతినిధులే ప్రవర్తిస్తే ఎలా, కోడి పందేల పేరుతో సామాన్యుడి జీవితాలతో ఆటాడుకుంటారా, జూదాన్ని ప్రోత్సహించేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. అమాయకుల జీవితాలతో ఆడుకోవద్దు అని అంబటి సూచించారు.

ఇంతకీ చంద్రబాబు సాధించిందేంటి?

వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో సాధించింది ఏమీ లేదని వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. సంకీర్ణ ప్రభుత్వంలో కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు కూడా చంద్రబాబుకు దొరకడం లేదని విమర్శించారు. ప్రధాన మంత్రి మోదీని కలిసేందుకు చంద్రబాబుకు ఏడాదిన్నర సమయం పట్టిందని అన్నారు. ప్రజలను నాలుగేళ్లుగా మభ్యపెడుతూ నాలుగేళ్లలో నాలుగు తాత్కాలిక భవనాలు కట్టడం తప్ప సాధించింది ఏమీ లేదని విమర్శించారు. టీడీపీ నేతలు చంద్రబాబుకు మోదీ అపాయింట్‌మెంట్ దొరికిందని ఊదరగొడుతున్నారని, ఒక సీఎంకు ఏడాది పాటు ఎందుకు అపాయింట్‌మెంట్ దొర కలేదని బుగ్గన ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడు మాట్లాడినా తాను రాష్ట్రం కోసం 30 సార్లు ఢిల్లీ వెళ్లానని చెబుతుంటారని, నాలుగేళ్లలో ఈ సంకీర్ణ ప్రభుత్వంలో రాష్ట్రాని కి ఏ మేలు జరిగిందని నిలదీశారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని నిర్మాణం అని ఊదరగొడుతూ చివరకు నాలుగు భవనాలు నిర్మించారని, అది కూడా నాలుగు చినుకులు పడితే కారిపోతుందని ఎద్దేవా చేశారు. విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్, వైజాగ్ చెన్నై కారిడార్ అన్నారు. ప్రత్యేక హోదా, దుగరాజు పట్నం పోర్టు, అమరావతి నిర్మాణం, పోలవరం ఇలా ఏది కూడా సాధించలేకపోయారన్నారు. దుగరాజు పట్నం పోర్టు అన్నది 13వ షెడ్యూల్‌లో పేర్కొన్నారన్నారు. నాలుగేళ్ల తరు వాత సీఎం ఢిల్లీకి వెళ్లి ప్రధానికి వినతి పత్రం ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. సామాన్య ప్రజలు కలెక్టర్ వద్దకు వెళ్లి అర్జీ ఇచ్చినట్లుగా చంద్రబాబు తీరు ఉందన్నారు.



సంపాదకీయం

editpage@suryaa.com

"భారతీయ జనతా పార్టీకి ఇన్నాళ్లు అండదండగా ఉన్న విశ్వ హిందు పరిషత్‌తో బాగా చెడినట్టే కనిపిస్తోంది. ఇప్పటికే హిందుత్వ ముద్రతో ముందుకు వెళ్తున్న శివసేన బిజెపి ప్రభుత్వాన్ని గత కొంత కాలంగా విమర్శలు చేస్తునే ఉంది. వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసింది కూడా. ఓ వైపు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములమంటునే బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై ప్రశంసలు కురిపిస్తుండటం కమలనాధులకు కాసింత ఇబ్బందే అయినా కొంత వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతోంది, మోడీ, షాల ద్వయం. తాజాగా విశ్వ హిందూ పరిషత్ అధినేతే కేంద్ర ప్రభుత్వం తనని చంపాలనుకుంటోందంటూ మీడియాకెక్కడంతో బిజెపికి చెందిన హిందూ మిత్రులంతా ఒక్కరొక్కరిగా దూరం అవుతున్నట్లే కనిపిస్తోంది. నిజానికి అశోక్ సింఘాల్ తరువాత ఆ స్థాయి నేత తొగాడియా ఏమో నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని మీడియా ముందు విలపించారంటే తెరవెనుక జరుగుతున్న పరిణామాలపై ఆతని ఆందోళన ఏపాటిదో అర్ధమవుతోందని, అయితే బిజెపి ముందస్తు ప్రణాళికలతోనే విపక్షాలను వేధించినట్టే విహేచ్‌పి నేతలపై ఉన్న పాత కేసులను తిరిగి తోడుతున్నట్లు వాదనలలో నిజమెంతో చూడాలి."

మిత్రులే బిజెపికి శత్రువులా?

భారతీయ జనతా పార్టీకి ఇన్నాళ్లు అండదండగా ఉన్న విశ్వ హిందు పరిషత్‌తో బాగా చెడినట్టే కనిపిస్తోంది. ఇప్పటికే హిందుత్వ ముద్రతో ముందుకు వెళ్తున్న శివసేన బిజెపి ప్రభుత్వాన్ని గత కొంత కాలంగా విమర్శలు చేస్తునే ఉంది. వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసింది కూడా. ఓ వైపు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములమంటునే బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై ప్రశంసలు కురిపిస్తుండటం కమలనాధులకు కాసింత ఇబ్బందే అయినా కొంత వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతోంది, మోడీ, షాల ద్వయం. తాజాగా విశ్వ హిందూ పరిషత్ అధినేతే కేంద్ర ప్రభుత్వం తనని చంపాలనుకుంటోందంటూ మీడియాకెక్కడంతో బిజెపికి చెందిన హిందూ మిత్రులంతా ఒక్కరొక్కరిగా దూరం అవుతున్నట్లే కనిపిస్తోంది.

నిజానికి విశ్వ హిందూ పరిషత్, భారతీయ జనత పార్టీల నడుమ ఆగాధం ఈ నాటిది కాదు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా మిత్ర పక్షాల సహకారంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడే నాడు విశ్వ హిందూ పరిషత్ నేత అశోక్ సింఘాల్ పలు మార్లు వాజ్‌పాయిని కలిసి కమలానికి జనం ఓటేసింది, మీరు రామ మందిరం కడతారని, ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పదే పదే డిమాండ్ చేసారు. అయితే ఇది సంకీర్ణ ప్రభుత్వం, రామ మందిర నిర్మాణం ప్రారంభిస్తే, ప్రజలకు ఇచ్చిన మరెన్నో వాగ్దానాలకు భగం వాటిల్లితుందని, ససేమిరా కుదరదని ప్రధాని వాజ్‌పాయి తేల్చి చెప్పిన నేపధ్యంలోనే అశోక్ శింఘాల్ నిరాహారదీక్ష చేసారు. కొన్నాళ్లు ప్రభుత్వం పట్టించుకోకున్నా ఆయన ఆరోగ్యం క్షీణిస్తే రాబోయే పరిణామాలను ఊహించి, బలవంతంగా ఫ్లూయిడ్స్ ఎక్కించి, దీక్ష విరమించేలా చేసింది అప్పటి ప్రభుత్వం. ఆ ఘటన తదుపరి వాజ్‌పేయి, సింఘాల్ మధ్య మాటలు లేవు. సందర్భం వచ్చినా ఎడముఖం పెడముఖంగానే వ్యవహరించారిద్దరూ. ప్రస్తుతం బిజెపి కి పూర్తి మెజారిటీ వచ్చి మోడీ ప్రధాని అయిన ఒకటిన్నర సంవత్సరం తరువాత, అశోక్ సింఘాల్ మరణించారు.

ఇక ఒకప్పుడు రామ జన్మభూమి కోసం మొదలెట్టిన బిజెపి తరపున అద్వానీ చేసిన రథయాత్ర ఫలితం ఇప్పుడు ఎందుకు కదలలేకపోతోందన్నదే విహెచ్‌పికి సంశయం. ఇప్పుడు ఎవరు నిలవరిస్తున్నారు. మందిరం జోలికి వెళితే, మరో సారి అధికారం లోకి రాలేమని బిజెపి అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు విహెచ్‌పిలోని పలువురు ఆందోళన వ్యక్తం చేసారు. రాముని భక్తుల భయమా? విశ్వ హిందువులంటే ఈ ప్రబుత్వం భయం ఎందుకు పడుతోందని పలు పర్యాయాలు పత్రికలకు ఎక్కిన సందర్భం కూడా అనేకం.ఒకప్పుడు గడ్కరి బిజెపి అధ్యక్షులుగా వుంటే, జెత్మలానీ ఆయన రాజీనామా అడుగుతూ మోడీని మోసారు. గడ్కరీకి మద్దతు ఇచ్చిన సంఘ్ పెద్ద ఎం జి వైద్య కు విరుద్ధంగా రాం మాధవ్‌తో మాట్లాడించారు. బీహార్ నితీష్ విషయంలో ఎం జి వైద్య కు విరుద్ధంగా ఆయన కొడుకు చేతే మాట్లాడించారు.

ప్రధాని మోడీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగో సంవత్సరం పూర్తి కావస్తోంది. అయినా, రామ మందిరం గురించి, ఇంతవరకు బిజెపి ఏమీ తలచు కోలేదన్నది మళ్లీ బిజెపి, తనకు తానుగా మెజారిటీ సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ప్రస్తుతానికి రామమందిర నిర్మాణం కోర్టు పరిధిలో ఉన్నందున, మధ్యవర్తిత్వ కమిటీ, ముస్లిం వర్గాలతో సమావేశాలు ఇతరత్రా చర్యలతో ఎన్నికల వరకు సాగదీయాలన్నది కమల నాధుల వ్యూహం.

ఈ క్రమంలోనే అయోధ్యపై, జమ్మూ కాశ్మీర్ విభజనపై విశ్వహిందూ పరిషత్ తీసుకున్న నిర్ణయాలను భారతీయ జనతా పార్టీ వ్యతిరేకించింది. ఈ రెండు విషయాల్లో విహెచ్‌పికి దూరంగా వుండాలని కూడా నిర్ణయించుకుంది. అయోధ్య వివాదం విషయంలో కోర్టు తీర్పునకు కట్టుబడి వుండాలని లేదా ఈ వివాదాన్ని సంప్రదింపుల ద్వారా పరిష్క రించుకోవటం ద్వారానే రామాలయాన్ని ప్రారంభించాలని తాము కోరుకుంటున్నామన్నది కమలనాధుల వాదన. అయోధ్య విషయంలో విశ్వ హిందూ పరిషత్ తీసుకునే చర్యలను గమనిస్తున్నాయని, ఆందోళనకు దిగినప్పుడు అప్పుడు చూద్దామని బిజెపి అధికార ప్రతినిధి సునీల్ శాస్త్రి చెప్పడం చూస్తే రామాలయంపై ఆ పార్టీ పంధా సుస్పష్టంగా ఉంది.

ఇక జమ్మూ కాశ్మీర్‌ను విభజించే ప్రసక్తే లేదని, కాశ్మీర్ రాష్ట్ర విభజన పార్టీ నిర్ణయానికి వ్యతిరేకమని, జమ్మూ కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని బిజెపి స్పష్టంగా విహెచ్‌పి నేతలకు సుస్పష్టంగా తేల్చి చెప్పింది. కాశ్మీర్‌ని విభజించేలా వివిధ వేర్పాటు వర్గాల నుంచి వస్తున్న ప్రకటనలను విహెచ్‌పి ప్రోత్సహించడం సరైనది కాదంటూ బిజెపి వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేయటం కూడా విహెచ్‌పి నేతలకు మింగుడు పడలేదు. ఈ క్రమంలోనే మోడీ, షా ద్వయం రానున్న ఎన్నికలలో విజయం కోసం రామాలయాన్ని ప్రక్కకు పెడుతున్న వ్యూహాన్ని కనిపెట్టని విహెచ్‌పి అధినేత ప్రవీణ్ తొగాడియా ఇటీవల కాలంలో మోడీపై పలు పర్యాయాలు కలిసి స్పష్టమైన ప్రకటన కోసం డిమాండ్ చేసారు.

ఈ క్రమంలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా ఆచూకీ తెలియలేదంటూ సోమవారం నాడు వీహెచ్‌పీ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2001లో ఓ ఉద్యమకేసుకు సంబంధించి రాజస్థాన్ పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడానికి వీహెచ్‌పీ కార్యాలయానికి వెళ్లగా తొగాడియా అప్పటికే కనిపించకుండాపోయారు. అయితే ఆయనపై అరెస్ట్ వారెంట్ ఉండటంతో అజ్ఞాతంలోకి వెళ్లి ఉంటారని అందరూ భావించారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి ఓ పార్కులో అపస్మార కస్థితిలో షుగర్‌లెవెల్స్ పడిపోయిన తొగాడియాను ఆస్పత్రిలో కొందరు చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం కొలుకున్న తొగాడియా మీడియా ముందుకు వచ్చి కేంద్రంపై ఆరోపణలు చేశారు. గుజరాత్, రాజస్థాన్ పోలీసులు తనను వెంటాడుతున్నారని, తనను అంతమొందించేందుకు కుట్ర పన్నుతున్నారని ఏకంగా మోడీ సర్కారుపైనే ఆరోపణలు చేశారు.

నిజానికి అశోక్ సింఘాల్ తరువాత ఆ స్థాయి నేత తొగాడియా ఏమో నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని మీడియా ముందు విలపించారంటే తెరవెనుక జరుగుతున్న పరిణామాలపై ఆతని ఆందోళన ఏపాటిదో అర్ధమవుతోందని, అయితే బిజెపి ముందస్తు ప్రణాళికలతోనే విపక్షాలను వేధించినట్టే విహేచ్‌పి నేతలపై ఉన్న పాత కేసులను తిరిగి తోడుతున్నట్లు వాదనలలో నిజమెంతో చూడాలి. ఈ విషయంపై బిజెపి ఏ తరహా వాదనతో ముందుకొస్తుందో మరి.

ఇద్దరు చంద్రులకు 'సెగలు' తప్పవా?

సత్య ఎం.వి.ఎస్.ఎస్.
హైదరాబాద్– 833011972

- తమకు తగిన ప్రాధాన్యం దక్కలేదంటున్న సీనియర్లు
- విపక్ష పార్టీలను తుంచేయటమే లక్ష్యంగా పదవుల ఎర
- తెలుగుదేశం మంత్రులపై నాయిని పరోక్ష వ్యాఖ్యలు
- కన్నీళ్లొస్తున్నాయంటూ శ్రీనివాస్ గౌడ్ ఆవేదన
- అటు ఆంధ్రా కేబినెట్‌లోనూ పంకా స్పీడుపై ఆందోళనలు



ఇటీవల కాలంలో చట్టాలెన్ని ఉన్నా, అమాత్యులే వాటిని తుంగలోకి తొక్కడం సాధారనమైపోయింది. ఈ క్రమంలో దేశంలో జరుగుతున్న ఫిరాయింపులకు ఏ రాజకీయ పార్టీ, రాజకీయ నాయకుడు అతీతం కాదు. అందునా ఇలాంటి పరిస్థితిని సాక్షాత్తు ముఖ్యమంత్రులే ప్రోత్సహిస్తుండటం. ప్రతిపక్షం లేకుండా చూడాలని పన్నాగాలు పన్నటం సాధారణంగా మారిపోయింది. విపక్షంలో గెలిచినా, అధికార పార్టీ అధినేతల వద్ద కాసింత పలుకుబడి ఉంటె చాలు ప్రజామోదం లేకున్నా ఏకంగా కేబినెట్ మంత్రులుగా పదవులు అలంకరించ వచ్చు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల కేబినెట్ లో ఇదే పరిస్థితి.

ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అని తెలుగులో ఓ సామెత ఉంది. దశాబ్దాలుగా పార్టీలని అంటిపెట్టుకుని ఉన్నా నేతల కంటే ఇద్దరి చంద్రులకు దోడ దూకి మరి వచ్చిన ఫిరాయింపు నేతలు ఎక్కువైపోయారు. అందులోనూ ఉప్పుకారం తిన్న తెలుగు నేతలాయో... చూస్తూ, చూస్తూ ఇలాంటి పరిస్థితిని ఎంతకాలం భరిస్తారు. తమకు దక్కాల్సిన అందలం వేరొకరు ఎగరేసుకుపోతుంటే ఊరుకుంటారా.. దీనిపై రాక తప్పదు. ఇప్పటికే మొదలైపోయింది కూడా..

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని అధికార తెలుగుదేశం పార్టీలో పదవులు దక్కని శాసనసభ్యుల లుకలుకలు , అసంతృప్తులు అడపా దడపా వినిపిస్తుంటే ఇప్పుడు తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై టిఆర్ ఎస్ నేతలు వరుసగా దీనిపై అసంతృపి వ్యక్తం చేస్తుండడం ముఖ్యమంత్రి కేసీఆర్ కు తలనొప్పి వ్యవహారంలా మారిందనటంలో సందేహమే లేదు.

ఓ ఇద్దరు టిఆర్ఎస్ కీలక నేతలు చేసిన సంచలన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని వారుకూడా కేబినెట్‌లో దర్జాగా కూర్చుంటున్నారని నాయని నరసింహారావు డైరెక్ట్ గా అనేశారు. దీనితో కేసీఆర్ లో అంతర్మధనం మొదలైనట్లు తెలుస్తోంది. నాయని వ్యాఖ్యలు సైకిల్ దిగి కారు ఎక్కినా వారిపైనే అని స్పష్టంగా అర్థం అవుతోంది.

ఇక తెలంగాణ సాధన ఉద్యమంతో సంభంధం లేని వారు, తెలంగాణ ఉద్యమాన్ని అపహాస్యం చేసిన వారు ఇప్పుడు మంత్రివర్గంలో ఉన్నారని,. అది తలచుకుంటే కళ్ల నుండి నీళ్లు వస్తున్నాయని కానీ వారిని క్యాబినెట్లోకి తీసుకోవాలన్న కెసిఆర్ నిర్ణయం వెనక బలమైన కారణం ఉంటుందని నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేయని వారు ఇప్పుడు మాటలు చెప్తున్నారని మరో శాసనసభ్యుడు శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. నిజానికి ఉద్యోగులు లేనిదే సకలజనుల సమ్మె లేదని వారి పట్టుదల వలనే తెలంగాణ సాధ్యమైందని , మంత్రి వర్గంలో తెలంగాణ వ్యతిరేకులు ఉన్నారని హోం మంత్రి నాయని నర్సింహా రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవమని శ్రీనివాస్ గౌడ్ తేల్చి చెప్పడం చూస్తుంటే తెలంగాణ రాష్ట్ర సమితిలో తొలి నుంచి ఉద్యమంలో పాల్గొన్న నేతలలో నెలకొన్న అసంతృప్తులు రాను రానూ పెరిగే అవకాశాలున్నాయ నిపిస్తోంది. అయితే ఇలాంటి నిరసన స్వరాలు మరో మారు వినిపించకుండా త్వరలో చేయబోతున్న కేబినెట్ విస్తరణలో సైకిల్ నేతలని తప్పించి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన టిఆర్ ఎస్ నేతలకు పెద్ద పిట వేయాలని కేసీఆర్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెపుతున్నప్పటికీ ఎవరిపై వేటు పడుతుందన్న దానిపైనా చర్చ జరుగుతోంది.

నాయని, శ్రీనివాస్‌గౌడ్ నోటవెంట అలవోకగా జారవిడిచిన మాటలు.. ఇప్పుడు తెలంగాణ ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారటంతో అధికార పక్షం సైతం సహజంగానే డిఫెన్స్ పడిందంటూ తెలంగాణ భవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజానికి తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెరాసకు తెలుగు దేశం పార్టీయే టార్గెట్. క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీని చిత్తు చే సి, కార్యకర్తలను సొంత చేసుకోవటం ద్వారా గులాబి దండును మరింత విస్తృతం చేసుకోవాలన్నది కేసిఆర్ వ్యూహం. ఇప్పటికే ఆ వ్యూహాన్ని కట్టుదిట్టంగా అమలు చేసారు. ఆ క్రమంలోనే అనేక మంది దేశం నేతలు రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులయ్యారు. ఈ మంత్రులపైనే నాయని వ్యాఖ్యలకు టార్గెట్ అయ్యారనడంలో సందేహమే లేదు. ఒకరు రాజీనామా చేసి మళ్లీ గెలిచి చట్టసభకు ఎంపికై రాజమార్గంలో ఉంటే.. మరొక మంత్రి ఇప్పటికీ ప్రతిపక్ష ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారు. తెలిసో తెలీకో నాయని నరసింహారెడ్డి చెప్పిన ఈ నగ్న సత్యాన్ని రూలింగ్ పార్టీ ఆమోదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. త్వరలో క్యాబినెట్ విస్తరణ అంటూ ముహూర్తం కోసం వెతుకుతున్న సీఎం కేసీఆర్.. నాయని ఎపిసోడ్ మీద కూడా దృష్టి పెట్టినట్లు సమాచారం. అయితే కీలక పోర్ట్ ఫోలియోల్లో ఉంటూ, పార్టీలోనూ ప్రభుత్వంలోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఈ మంత్రుల మీద కేసీఆర్ ఎంతవరకు చర్య తీసుకుం టారన్నది చూడాలి.

ఈ దశలోనే పార్టీలోని అసంతృప్తిని అధిగమించేందుకు వీలుగా రాష్ట్ర ప్రజలకు పార్టీని మరింత చేరువయ్యేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ పలు ప్రణాళికలను రచిస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ వర్గాల నుండి అందుతున్న సమాచారం . ఇప్పటివరకు అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయటంలో పార్టీలోని శ్రేణులతో పాటు పదవులు ఆశిస్తున్న నేతలు కొంత వెనుక బడ్డారని, ఈ క్రమంలోనే ఆయన సొంత సర్వేలతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోందని తెలుస్తోంది. ఇందులో భాగం గానే ఒక సరికొత్త రీతిలో ప్రచారం చేయనున్నారు. రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలు, పథకాలను వీడియోల ద్వారా డాక్యుమెంటరీలు రూపంలో మరింత మందికి చేరువయ్యేలా చేయనున్నారు.

ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారే కాకుండా అన్ని వర్గాల వారు ప్రజలు చూసేలా పకడ్బందీగా ఒక పక్క ప్రణాళిక ప్రకారం ఈ డాక్యూమెంటరీలు రూపొందిస్తున్నారని అంటు న్నారు.ఈ విధానం ద్వారా ముందుకు వెళితే తమ పరిపాలన పై ప్రజల్లో వున్న అభిప్రాయం పై ఒక స్పష్టత వస్తుందని, తద్వారా తెలుసుకున్న లోటుపాట్లను సరిచేసుకుని మరింత మెరుగైన పాలన అందించే దిశగా ముందుకు వెళ్లేలా వ్యూహరచన చేస్తున్నారు. అంతే కాక రానున్న రోజుల్లో మరిన్ని నూతన కార్యక్రామాల రూపకల్పనతో వచ్చే ఎన్నికలపై దృష్టిపెట్టనున్నారట.

ప్రజాధరణ పొందుతున్న పథకాలను విస్తృతపరచి తద్వారా వాటిని మరింత మందికి చేరువ చేయటమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని అన్నారు. తెలంగాణ వెనుకబాటు తనాన్ని తరిమికొట్టే విధంగా తాను తీసుకున్న కీలక నిర్ణయాలు తదనంతర క్రమంలో అమలైన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను హైలైట్ చేయనున్నారు. ఈవిధమైన విధానం ప్రజలకు తమను మరింత చేరువ చేస్తుందని పార్టీ వర్గాలు గట్టిగా నమ్ముతున్నట్లు సమాచారం

ఇక ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు కేబినెట్ లో ఈ తరహా వ్యవహారం ఏం తక్కువ కాదు. సైకిల్ పార్టీ కేబినెట్ లో వైసిపి ఫ్యాను బాగానే తిరుగుతోంది. ఆదినారాయణరెడ్డి, అఖిల ప్రియ వంటి ఫిరాయింపు మంత్రులు చంద్రబాబు కేబినెట్ లో ఉన్నారు. బుచ్చయ్య చౌదరి వంటి సీనియర్లు ఏంటి బాబు ఇది అని ఇదివరకే గగ్గోలు పెట్టారు. ఆ సమయానికి చంద్రబాబు ఎలాగో మేనేజ్ చేశారు. ఎంతకాలం ఇలా నెట్టుకు రాగలరు. కేసీఆర్‌కు ఎదురైన సమస్యే చంద్రబాబుకు సైతం ఎదురుకావడం ఖాయం అని అంటున్నాయి రాజకీయ వర్గాలు. మరి చంద్రబాబు ఎన్నికల నాటికి ఏం చేస్తారో చూడాలి. ●

చరిత్రలో ఈరోజు


జనవరి 17

జననాలు
1706: బెంజమిన్ ఫ్రాంక్లిన్ అమెరికా రాజ్యాంగ సభ్యుల్లో ఒకరు
1911: జార్జ్ స్టిగ్లర్, ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత.
1917: ఎం.జి.రామచంద్రన్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి.
1908: ఎల్.వి.ప్రసాద్, తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు
1942: ముహమ్మద్ అలీ, విశ్వవిఖ్యాత బాక్సింగ్ క్రీడాకారుడు.
1945: మడిపల్లి భద్రయ్య, తెలంగాణ కవి, రచయిత
మరణాలు
2006: శాంతకుమారి నటి ఉన్న సినిమాలలోనే నటించారు
2010: జ్యోతిబసు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి.

జ్యోతిబసు


పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు పనిచేసి దేశంలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు స్వంతం చేసుకున్న జ్యోతి బసు జూలై 8, 1914న కోల్‌కతాలో జన్మించారు. కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీకి చెందిన జ్యోతిబసు 1977 నుండి 2000 వరకు వరుసగా 5 సార్లు ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టినారు. అంతకు ముందు 1967-69 కాలంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశాడు. సి.పి.ఐ (యం) పోలిట్ బ్యూరో నిర్ణయంవల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. 2000లో ముఖ్యమంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతిబసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించాడు.

మహ్మద్ ఆలీ




మహమ్మద్ అలీ విశ్వ విఖ్యాత బాక్సర్. మూడు సార్లు హెవీవెయిట్ బాక్సింగ్ ప్రపంచ విజేతగా నిలిచిన శక్తిశాలి. ఇతని అసలు పేరు క్లాషియస్ క్లే. తరువాత ఇస్లాం మతాన్ని స్వీకరించి తనపేరును మార్చుకున్నాడు. ఇతని కూతురు లైలా అలీ కూడా మహిళా విభాగంలో ప్రపంచ విజేత. ఇతను కొన్ని చిత్రాలలో కూడా నటించాడు. 12వ ఏట బాక్సింగ్ లో శిక్షణ ప్రారంభించిన అలీ, 22 ఏళ్లకే ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్ గా ఎదిగారు. 1964లో దిగ్గజ బాక్సర్ సోనీలిస్టన్ పై గెలువుతో ప్రపంచ ఛాంపియన్ గా మహ్మద్ అలీ నిలిచారు. 1967లోనూ హెవీవెయిట్ టైటిల్ సొంతం చేసుకున్నారు. 1964, 1974, 1978ల్లో ప్రపంచ హెవీవెయిట్ ఛాంపియన్ గా నిలిచారు. గొప్ప ఛాంపియన్‌గా, మానవతావాదిగా పేరొందినప్పటికీ ఆయన కెరీర్ వివాదాస్పదంగా కొనసాగింది.

ఎంజీఆర్



ఎంజీఆర్ లేదా పురచ్చి తలైవర్ (క్రాంతియుత నాయకుడు)గా ప్రసిద్ధి చెందిన మరుదూరు గోపాల రామచంద్రన్ (జనవరి 17, 1917 డిసెంబర్ 24, 1987) తమిళ సినిమా రంగములో ప్రముఖ నటుడు. 1977 నుండి ఆయన మరణించేంతవరకు తమిళనాడుకు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. రామచంద్రన్ శ్రీలంకలోని కాండీ సమీపములోని నవలపితియాలో మరదూరు గోపాల మీనన్, సత్యభామ దంపతులకు జన్మించాడు. ఈయన కేరళ రాష్ట్రములోని పాలక్కడ్ జిల్లా, వడవన్నూరులోని మీనన్ కుటుంబానికి చెందినవాడు. ఈయన తాత కుటుంబముతో సహా శ్రీలంకకు తరలి వెళ్ళాడు. తండ్రి మరణము తర్వాత, పేదరికము వలన ప్రాథమిక స్థాయిని దాటి విద్యాభ్యాసము కొనసాగించలేక రామచంద్రన్ ఒరిజినల్ బాయ్స్ అనే ఒక నాటకబృందములో చేరాడు. ఇక్కడ రంగస్థలంపై తగినంత అనుభవము గడించి, సినిమా రంగములో అడుగుపెట్టి అవిరాళ కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి ఎదిగాడు. అత్యంత ప్రజాదరణ కలిగిన నటునిగా ఎదిగాడు. ఈయన మంచి దర్శకుడు, నిర్మాత మరియు నైపుణ్యమున్న సినిమా ఎడిటరు కూడా. ఆల్ ఇండియా అన్నా డిఎంకె పార్టీ స్థాపకుడు.

కఠిన రోగం సులభ వైద్యం



డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ పార్లమెంటు సభ్యుడు, పార్వతీపురం
విజయనగరం జిల్లా

విదేశీ పెట్టుబడుల విషయమై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆలోచింపదగ్గది. సాధారణంగా తెలిసీ తెలియని వైద్యులు ఏరోగానికైనా స్టెరాయిడ్ లని ఎడాపెడా వాడేస్తారు.జ్వరమో,దగ్గో వచ్చిందనుకోండి.దాని కారకం బట్టీ వైద్యం చెయ్యడం ద్వారా తగ్గుతుంది.అలా కాకుండా స్టెరాయిడ్స్ వాడేస్తే లక్షణాలు తగ్గినట్టు కనబడినా, లోపల రోగం ముదురుతూ పోతుంది.తాత్కాలిక ఉపశమనం కోసం,పరిధి మించి ప్రమాదకరంగా వాడబడుతున్న మందులేవైనా ఉన్నాయంటే అవి స్టెరాయిడ్లే. ఇప్పుడు విదేశీ పెట్టుబడుల వ్యవహారం కూడా స్టెరాయిడ్లనే తలపిస్తుంది. పరిమితిలో ఉపయోగించుకొంటే ప్రాణాలు కాపాడాల్సినవి,పరిధికి మించి వాడడం వల్ల ముప్పు తెచ్చేవిగా తయారౌతాయి. ఎయిర్ ఇండియా లో 49 శాతం విదేశీ పెట్టుబడుల్ని అనుమతించడం తప్పనిసరి వ్యవహారం కావొచ్చు.ఎందుకంటే 50వేల కోట్ల రూపాయల అప్పుని మోస్తూ ఎగరడం కాదుకదా నడవడమే కష్టం గా మారిన ఆ సంస్థ కి పైనుండి చేయూత అవసరమే. ప్రభుత్వ ఖజానా కి భారమైన ఆ సంస్థలో మదువు పెట్టడానికి దేశీయ సంస్థలేవీ ఎటూ ముందుకు రావడం లేదు. పైగా ఇతర దేశీయ ఆకాశ యాన సంస్థల్లో విదేశీ సంస్థలు 49 శాతం వాటాలు కలిగివుండడానికి ఎలాంటి అభ్యంతరాలూ లేనప్పుడు ఎయిర్ ఇండియా కి మాత్రం ఆ వెసులుబాటు ఎందుకు?అయితే ఆ సంస్థ ఆస్థుల్ని కాపాడడంలో మాత్రం ప్రభుత్వం అప్రమత్తత చూపాలి.

రిటైల్ వర్తకం లో 100 శాతం విదేశీ పెట్టుబడులకు ఎన్నడో దేశాన్ని సంసిద్ధం చేశారు.సరే. కానీ అందులో స్థానికులకు ఎంతోకొంత మేలు చెయ్యగల- ఆయా సంస్థలు తాము చేసే '30శాతం కొనుగోళ్లు స్థానికంగానే జరపాలి' -అన్న నిబంధన ఎందుకు తొలగించాలి?దాన్ని అమలుపర్చడానికి ఐదు సంవత్సరాల గడువెందుకు?తద్వారా కుదేలైన దేశీయ చిల్లర వర్తకానికి కల్పించే రక్షణ చర్యలేమిటి? నిర్మాణ రంగంలో,పవర్ ఎక్స్చేంజి ల్లో కూడా విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచారు.నోట్ల రద్దు,ఏకీకృత పన్నుల వ్యవస్థ ద్వారా కుదేలైన నిర్మాణ రంగానికి ఈ రకంగా ఊతమిద్దామని ప్రభుత్వం భావిస్తున్నట్లుంది.ఆర్ధిక వ్యవస్థ బలహీనంగా ఉన్న నేపథ్యంలో ఈ' విదేశీ చికిత్స' బాగానే కనపడొచ్చు.కొంత నిధుల ప్రవాహం జరిగి ఉపశమనం కనబడొచ్చు.ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్‌లో మన దేశం మరింత మంచి రేంకు పొందవచ్చు. అయితే దేశీయ ఆర్ధికం స్వయంగా ఆరోగ్యకరం కావడం, ముందు దేశీయంగా సంస్థలు బలోపేతం కావడం,దెబ్బ తిన్న,తినబోతున్న చిల్లర వ్యాపారులు రక్షణ పొందడం తదితర అంశాల్ని గమనంలోకి తీసుకోవాలి.అది మాత్రమే ముఖ్యం కావాలి.

అన్నదాతల్ని కాపాడండి

- మిర్చి రైతులకు అందని కేంద్ర మద్దతు ధరలు
- క్వింటా ఐదు వేలు కాగా ముట్టేది మూడు వేలు
- పెట్టుబడులు కూడా రాని దుస్థితిలో మిర్చి రైతాంగం
- దిగుమతుల పీడ వదిలితేనే స్వదేశీ పంటలకు ముక్తి
- విత్తనాల సరఫరాలోనూ అరకొర చర్యలే శాపం





శ్రీనివాస్ చిరిపోతుల – 96034 71199

భారతదేశంలో వ్యవసాయం వర్షాలతో జూదం ఆడుతుంటుంది.. అంటూ స్వాతంత్ర్యానికి ముందే రాయల్ కమీషన్ చెప్పినటువంటి మాట అక్షరసత్యంగా నేటికీ రుజువవుతూనే ఉంది. ఒకవైవు ప్రకృతి విపత్తులు, ఇంకోవైవు విపణి శక్తులు, మరోవైవు ప్రభుత్వాల ఉదాసీన ధోరణులు ముప్పేట ముట్టడిలో రైతాంగం చితికిపోతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నాయన్న మాటేగానీ ఏ ఆహార పంటల్లో చూసినా దిగుబడులు దిగనాసిగానే ఉన్నాయి. రెండేళ్ళ క్రితం బహిరంగ మార్కెట్లో కందులు క్వింటాకు రూ. 11,500 దాకా పలికింది. ఈ సారి కందుల సాగు పెంచాలని పిలువునిస్తూ కేంద్ర ప్రభుత్వం కనీస మద్ధతు ధరను 5వేలకు పైగా నిర్ధారించడంతో పలు రాష్ట్రాల్లో బంపర్ దిగుమతులు వెల్లువెత్తాయి. తీరా పంట చేతికందాక మార్కెట్ కి వెళ్ళితే రూ. 3,000కు మించని ధర రైతుల్ని నిరాశ పరిచింది. రెండు దశాబ్దాలుగా రైతాంగం పాలిట పద్మ వ్యూహంగా మారిన దేశ వ్యవసాయరంగం మూడు లక్షల మందికి పైగా అన్నదాతలను బలిగొంది. ఇక రెండు తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే మిర్చి రైతుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. కిందటేడాది గుంటూరు మిర్చి యార్డులో క్వింటాకు గరిష్టంగా రూ.15,800 పలికిన ధర ఈ సారి మాత్రం కనీస ఖర్చులైనా తిరిగి రానంతగా మూడో వంతుకన్నా తక్కువగా అమ్ముకున్న పరిస్థితి రెండు తెలుగు రాష్ట్రాల్లోని రైతుల పరిస్థితి. ఏ పంట వేసినా లారీల్లో సరుకును లోలుకొచ్చి ఏదో ఒక ధరకు ఎవరైనా కొనకపోతారా అని దీనంగా కాచుక్కూర్చోవలసిన పరిస్థితి రైతులది. సేద్యరంగ ముఖచిత్రాన్ని తేటపరుస్తామంటూ నీతి ఆయోగ్ వంటి సంస్థలు, శాఖలు సత్వరమే దృష్టి సారించాల్సిన అంశమిది. రైతు జీవన బధ్రత, జాతి ఆహార భద్రత రెండూ పరస్పరం ముడివడిన అంశాలు. సేద్యాన్ని లాభదాయకంగా మలచి, దేశానికి ఆహార దిగుమతుల పీడ విరగడ చేసే మేలిమి సిఫారసులెన్నో పముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాధన్ ఏనాడో చెప్పారు. ప్రభుత్వాలు చొరవ తీసుకొని రైతాంగానికి న్యాయమైన డిమాండ్ అయిన నాణ్యమైన విత్తనాలు, ఆధునిక పరికరాలు, శాస్త్రీయ పరిజ్ఞానం అందించి అండగా నిలిస్తే ఇతోధిక దిగుబడులు ఇవ్వగల కర్షకవీరులు మనదేశంలో చాలా మంది ఉన్నారు.కాగా . బేడగీ సింజెంటా రకానికి చెందిన మిరప విత్తనాల కోసం రైతులు బారులు తీరారు. ఈరకానికి చెందిన మిరప విత్తనాలు అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఈరకానికి చెందిన విత్తనాలు కొన్ని దుకాణాల్లో బ్లాక్ మార్కెట్ లో రూ.800 నుండి రూ.వెయ్యికి అమ్మకాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింజెంటా రకానికి చెందిన మిరప విత్తనాలు పదిగ్రాముల ఫ్యాకెట్ ధర రూ.555రూపాయలు ఎకరానికి 10 ప్యాకెట్లు చొప్పున వందగ్రాముల ధర రూ.5,550 కానీ రైతులు ఒక్కసారిగా మిర్చి విత్తనాల కోసం దుకాణాల వద్ద నిల్చుండడంతో స్టాకు లేదంటూ వందగ్రాముల విత్తనాలు రూ.8వేల నుండి రూ.10వేల వరకు బ్లాక్ మార్కెట్‌ద్వారా అమ్మకాలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. బ్లాక్ మార్కెట్ ద్వారా అధికరేట్లుకు విత్తనాలు అమ్ముతున్నట్లు తమకు ఎవరూ ఫిర్యాదుచేయలేదన్నారు. ఫిర్యాదుచేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, కావలసిన విత్తనాలను త్వరలో తెప్పిస్తామన్నా ఆ పరిస్థితి లేదు.

ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తావిస్తున్న క్రియాశీల రైతు సంఘాలు అనే ప్రయోగం ఏ మేరకు ఫలితమిస్తుందో చూడాలి. దేశం మొత్తానికి బువ్వ పెట్టే అన్నదాతకే అర్ధాంతరంగా నూకలు చెల్లే దురదృష్టకర వాతావరణాన్ని బదాబదలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణబద్ధులై కార్యాచరణను రూపొందించి సత్వరమే వ్యవసాయ రంగాన్ని పట్టాలెక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

సూర్య
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
5



రికార్డు స్థాయికి 'పెట్రో' ధరలు... సామాన్యునిపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ క్రూడాయిల్ మార్కెట్ లో ధరల ర్యాలీ కొనసాగుతూ ఉండటంతో, ఇండియాలో పెట్రోలు, డీజిల్ ధరలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గడచిన నెల రోజుల వ్యవధిలో పెట్రోలు ధర రూ. 2 కు పైగా, డీజిల్ ధర రూ. 3.50 వరకూ పెరిగాయి. మంగళవారం నాడు ఢిల్లీలో పెట్రోలు ధర రూ. 71.27కు చేరగా, హైదరాబాద్ లో ధర రూ. 75.47కు చేరింది. 2014 తరువాత పెట్రోలు ధర ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఇక డీజిల్ విషయానికి వస్తే, ఢిల్లీలో రూ. 61.74గా ఉన్న ధర ముంబైలో ఏకంగా రూ. 65.74కు చేరింది. హైదరాబాద్ లో రూ.67.23కు పెరిగింది. మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు స్థానిక పన్నులను ఎక్కువగా వసూలు చేస్తుండటమే ఇందుకు కారణం. 'పెట్రో' ఉత్పత్తుల ధరలను తగ్గించే దిశగా కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించినా, వ్యాట్ (విలువ ఆధారిత పన్ను)ను తగ్గించడంలో రాష్ట్రాలు ఆసక్తిని చూపడం లేదు. తమకు లభించే ఆదాయానికి గండి పడుతుందన్నది వారి ఉద్దేశం. దీంతోనే వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయని, వెంటనే పన్నుల భారాన్ని తగ్గించి, 'పెట్రో' కష్టమర్లను ఆదుకోవాలన్న డిమాండ్ నానాటికీ పెరుగుతోంది.

ఇన్ఫోసిస్ ఉద్యోగులకు

పండగ కానుక

● 95 శాతం వేరియబుల్ పే ● ఊహించలేదన్న ఉద్యోగులు ● 38 శాతం పెరిగిన సంస్థ నికరలాభం



న్యూఢిల్లీ: భారతీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు ఊహించని సంక్రాంతి కానుకను అందించింది. డిసెంబర్ తో ముగిసిన త్రైమాసికానికి గాను 95 శాతం వేరియబుల్ పే అందించింది. గత తొమ్మిది త్రైమాసికాలతో పోలిస్తే ఇదే అత్యధికమని... దీన్ని తాము ఊహించలేదని ఓ ఉద్యోగి ఆనందం వ్యక్తం చేశాడు. డిసెంబర్ త్రైమాసిక ఫలితాల్లో నికర లాభంలో 38 శాతం వృద్ధిని సాధించింది. అంతేకాదు, అక్టోబర్–డిసెంబర్ నెలల మధ్య కాలంలో 12,622 నియామకాలను చేపట్టింది. ఇటీవలే మరో ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా తమ ఉద్యోగులకు 100 శాతం వేరియబుల్ పే ప్రకటించింది.

మమతా బెనర్జీపై ముఖేష్ అంబానీ పొగడ్తలు

● మమత నేతృత్వంలో బెస్ట్ బెంగాల్
● గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖేష్ ● ఎన్నో కర్మాగారాలు వెలిశాయి
● త్వరలో రూ. 5 వేల కోట్ల పెట్టుబడులు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖమంత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై రిలయెన్స్ అధినేత ముఖేష్ ప్రశంసల జల్లులు కురిపించారు. ఆమె నాయకత్వంలో వెస్ట్ బెంగాల్...బెస్ట్ బెంగాల్‌గా మారుతోందంటూ కితాబిచ్చారు. న్యూ టౌన్‌లోని బిస్వ బెంగ్లా కన్వెన్షన్ హాలులో జరిగిన బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ (బీజీబీఎస్)లో ముఖేష్ అంబానీ మాట్లాడుతూ, రాబోయే మూడేళ్లలో పశ్చిమబెంగాల్‌లో మొబైల్ ఫోన్ల తయారీ, సెట్ టాప్ బాక్సెస్ తయారీ వంటి జియోయేతర (నాన్–జియో) వ్యాపారంలో అదనంగా రూ.5,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. ఇప్పటికే రిలయెన్స్ గత రెండేళ్లలో బెంగాల్‌లో రూ.15,000 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వంలో పశ్చిమబెంగాల్ ఉత్తమ బెంగాల్‌గా మారుతోందంటూ ప్రశంసించారు. '2018 డిసెంబర్ నాటికి 100 శాతం పశ్చిమబెంగాల్ ప్రజలకు జియా చేరుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. బెంగాల్‌ను ఆప్టిక్ ఫైబర్‌తో అనుసంధానించే ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం. ప్రతి ఇంటికి, వ్యాపార సంస్థలకు అత్యంత నాణ్యతాయుతమైన డిజిటల్ సేవలు అందిస్తాం. 2019 కల్లా జియోను అన్ని ఆసుపత్రులు, విద్యాసంస్థలకు అనుసంధానించడం ద్వారా డాటా పవర్, డిజిటల్ సర్వీసు సేవలను రాష్ట్ర ప్రజలందరికీ అందుబాటులోకి తెస్తాం' అని ముఖేష్ పేర్కొన్నారు. జియోయోతర వ్యాపారంలో భాగంగా రిటైల్, పెట్రో–రిటైల్ బిజినెస్‌లో రూ.5,000 కోట్ల పెట్టుబడులకు రిలయెన్స్ కట్టుబడి ఉందని ప్రకటించారు. సులభతర వాణిజ్యం పరంగా దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా పశ్చిమబెంగాల్‌ను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్రంలో పారిశ్రామిక శాంతి, ప్రగతి ఇందుకు కారణమని ముఖేష్ కొనియాడారు.

కొత్త ప్రొడక్టులను ఆవిష్కరించిన కెనాన్



న్యూఢిల్లీ:గడచిన 2017లో రెండింతల అభివృద్ధి సాధించిన అగ్రగామి డిజిటల్ ఇమేజింగ్ కంపెనీ కెనాన్ ఇండియా తాజాగా ఆరు సరికొత్త ఉత్పత్తులతో సంస్థను మరింత విస్తరించింది. పిక్స్‌మా జీ సిరీస్‌లో జి1010, జీ 2010, జీ 2012, జి3010, జీ 3012, జీ 4010 ప్రింటర్లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. పిక్స్‌మా జీ సిరీస్ ప్రింటర్లను ఫ్రంట్ ఫేసింగ్, రిఫిలబుల్ ఇంక్ ట్యాంక్ సిస్టమ్‌తో రూపొందించారు. దీనికితోడు ఈ ప్రింటర్లను మరింత ఆధునీకరించారు. ఈ సందర్భంగా కెనాన్ ఇండియా సీఈఓ, ప్రెసిడెంట్ కజుతోడా కొబాయషి మాట్లాడుతూ సంస్థాగతంగా మేను నిత్యం నూతన ఉత్పత్తులను ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటాం. దీనిలో భాగంగానే ఈ నూతన ప్రింటర్లను విడుదల చేశామన్నారు.

ఇక హజ్ రాయితీ కట్

• సంచలన ప్రకటన చేసిన కేంద్ర మంత్రి • మీడియాకు వివరించిన కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ • మైనార్టీలను మరింత పటిష్ఠం చేస్తాం ఇకపై హజ్ సబ్సిడీ నిధులను దేశంలో ముస్లిం బాలికల విద్య కోసం వినియోగిస్తాం • ఈ ఏడాది హజ్‌యాత్రకు 1.75 లక్షల మంది ముస్లింలు

న్యూఢిల్లీ: మైనార్టీలను మరింత పటిష్ఠం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 1.75 లక్షల మంది ముస్లింలు హజ్‌యాత్రకు వెళ్లనున్నారు. వారంతా సబ్సిడీ లేకుండానే తీర్థయాత్రకు వెళ్లనున్నారు. ఇకపై హజ్ సబ్సిడీ నిధులను దేశంలోని ముస్లిం బాలికల విద్యా, మహిళా సాధికారత కోసం ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. ప్రతి సంవత్సరం భారత్ నుండి హజ్ యాత్రకు లక్షలాది మంది వెళుతుంటారు. గత సంవత్సరం, లక్ష 25వేల మంది వెళ్లగా, ఈ సంవత్సరం లక్షా 75వేల మంది యాత్రకు వెళుతున్నట్లు తెలిసింది. వీరెవరికీ ప్రభుత్వం నుండి ఎటువంటి సబ్సిడీ అందదు. భారతీయ జనతా పార్టీ తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం ముస్లిం వర్గాలలో అసంతృప్తిని కలిగిస్తుంది, ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపసంహరించుకోవడం ఏమిటని దీనిని ఏ కోణంలో చూడాలంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

ఫిబ్రవరిలో పంచాయితీ నగారా



పలు కార్యక్రమాల గురించి, ఇటీవలె పూర్తయిన భూరికార్డుల ప్రక్షాళణ గురించి, పంచాయితీ రాజ్ ఎన్నికల గురించి, పంచాయితీ నిర్వహించాల్సిన విధుల గురించి, మునిసిపల్ చట్టం సవరణ గురించి మాట్లాడారు. సమావేశంలో డిప్యూటి సిఎం మహమూద్ అలి, మంత్రులు ఈటెల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, నాయిని నర్సింహరెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాస యాదవ్, జగదీష్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, పద్మారావు, డిప్యూటి పద్మా దేవేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎంపీ కె.కేశవరావు, అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా పంచాయితీ అధికారులు, పలువురు ఉన్నతాధికారులు, అనధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూరికార్డుల ప్రక్షాళనలో 93 శాతం భూమి, 92 శాతం ఖాతాలు వివాదరహితమైనవని తేలింది. ఇక మిగిలింది చాలా తక్కువ మాత్రమే. ఫిబ్రవరి నెల చివరికల్లా ఆర్డిఓ, జాయింట్ కలెక్టర్లు, కలెక్టర్లు నిర్వహించే రెవిన్యూ కోర్టుల స్థానంలో జిల్లా మొత్తానికి ఒకేఒక రెవిన్యు కోర్టు వుండాలి. రెవిన్యూ రికార్డుల నిర్వహణలో మార్చి 12 నుంచి విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. ఇంతవరకు ఈ దిశగా జరిగినదంతా స్థిర పడాలి. ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ శాఖ ఉండాల్సిన అవసరం లేదు. మొత్తం రాష్ట్రంలో రోజువారిగా జరిగే రిజిస్ట్రేషన్లు రెండున్నర వేల నుండి నాలుగు వేల వరకు వుంటాయి. ఇందులో 60 శాతం పట్టణ ప్రాంతాల్లో, 40 శాతం గ్రామీణ ప్రాంతాల్లో వుంటాయి. ఇక ముందు ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా 443 మండల కార్యాలయాలు కూడా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూస్తుంటాయి. మొత్తం 584 మండలాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలుంటాయి. రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్ కు నెలల కొద్దీ సమయం పట్టాల్సిన అవసరం ఇక ముందు వుండదు. కోర్ బ్యాంకింగ్ నెట్ వర్క్ విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. కొనుగోలు దారు అమ్మకం దారు పాస్ పుస్తకాల్లో తక్షణమే ఎంట్రీలు, మార్పులు, చేర్పులు జరుగుతాయి. దీనికొరకు ఎక్కువ సామర్ధ్యం కల కంప్యూటర్లు, సర్వర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇద్దరికీ పాస్ బుక్కులు కొరియర్ ద్వారా ఇంటికే పంపుతాం. ధరణి వెబ్ సైట్ లో వెంటన్ అప్ డేట్ అవుతుంది.

ధరణి వెబ్ సైట్ ను ప్రపంచంలో ఏ మూల నుండైనా చూడవచ్చు. భూరికార్డుల ప్రక్షాళణ పూర్తయిన నాటి నుండి మార్చ్ 12 వరకు చోటు చేసుకుంటున్న క్రయ విక్రయాల వివరాలు కలెక్టర్లు అప్ డేట్ చేసి ధరణి లో ఎక్కించాలి. మార్చ్ 12 నుండి కోర్ బ్యాంకింగ్ విధానం మొదలవుతుంది. పహాణీ కాలమ్స్ కూడా తగ్గించాం. పహాణీ లో వాడే మరాఠీ పదాలను తీసేసి సరళమైన తెలుగు పదాలను ఉపయోగించుతాం. కలెక్టర్ వ్యవస్థ ఇంకా బలోపేతం కావడానికి చర్యలు తీసుకుంటున్నాం.సమావేశం ప్రారంభంలో, భూరికార్డుల ప్రక్షాళణను విజయవంతంగా పూర్తిచేసినందుకు రెవెన్యూ మంత్రిని, రెవెన్యూ కార్యదర్శిని, ప్రక్షాళణ కార్యక్రమ ప్రత్యేక అధికారిని, కలెక్టర్లందరినీ, జాయింట్ కలెక్టర్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రత్యేకంగా అభినందించారు. వారికి తన హృదయ పూర్వక అభినందనలు తెలియచేస్తూ ముఖ్యమంత్రి... మనం ఎనో పనులు చేస్తుంటాం కానీ, ఇంత గొప్పగా చేయలేం. చాలా పనులు వాయిదా వేస్తాం కానీ ఇది సాహసంతో చేసాం. దేశమంతా మనల్ని అభినందిస్తున్నది. మనం కొత్త రాష్ట్రమయినా దేశానికి ఆదర్శమయ్యాం. చాలా మందికి మన మీద వున్న అనుమానాలు పటాపంచలయ్యాయి. ఈ స్ఫూర్తి ఇలానే కొనసాగాలి. ముమ్ముందు కూడా పూర్తిగా అవినీతిరహితంగా జరగాలి అని అన్నారు.


పంచాయితీరాజ్ గురించి ప్రస్తావించిన సీఎం : పంచాయితీ ఎన్నికలు తప్పకుండా నిర్వహించాలి. గ్రామ పంచాయితీల ఏర్పాటుకు పంచాయితీ జిల్లా అధికారులు పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా భౌగోళిక హద్దులు ఏర్పాటు చేయాలి. రాజ్యాంగం అదే చెప్తున్నది. న్యాయస్థానాల లిటిగేషన్ కు తావు ఇవ్వకుండా గ్రామ పంచాయితీలు ఏర్పాటు కావాలి. దీన్ని శాసన ప్రక్రియ ద్వారా చేయబోతున్నాం. ఇప్పుడు 8684 గ్రామపంచాయితీలున్నాయి. మరో నాలుగు వేలు ఏర్పాటు కావచ్చు.

ప్రత్యక్షమా..పరోక్షమా?: మనం చాలా విషయాల్లో విజయం సాధించాం కానీ గ్రామాలను పరిశుభ్రంగా వుంచుకోలేకపోయాం. దీని మీద ఎన్నోవిమర్శలు కూడా వచ్చాయి. ఇది అవసరమా? పని చేసే పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. దీని కొరకు ఎన్నోరకాల చర్యలు జరిపాం. ఇంకా జరుపుతున్నాం. ప్రత్యక్ష ఎన్నిక? పరోక్ష ఎన్నిక? కూడా చర్చిస్తున్నాం. సర్పంచ్ ను పనిచేసే సర్పంచ్ గా ఎలా చేయగలగాలి? ఒకప్పుడు జిల్లా కలెక్టరుకు ఎన్నో అధికారాలు వుండేవి పంచాయితీల మీద. ఇప్పుడు నియంత్రణ లేకుండా పోయింది. ఈ నిస్సహాయ స్థితి నుండి బయట పడాలి. పంచాయితీరాజ్ ఎంతో గొప్పగా రూపొందించబడిన మహత్తరమైన ఉద్యమం. అది ఇప్పుడు అంతరించి పోయింది. ఏ గ్రామానికి పోయినా పెంటకుప్పలుగా వుంటున్నది. గ్రామపంచాయితీకి, ఈ నేపథ్యంలో ఏమేమి పనులు అప్పచెప్పాలో ఆలోచన చేయాలి. ఈ సందర్భంగా మునిసిపల్ చట్టానికి కూడా సవరణలు చేద్దామన్న ఆలోచన చేస్తున్నాం.అసాధారణమైన పనులు చేసే శక్తి-యుక్తులు, దేన్నైనా సాధించే పట్టుదల రాష్ట్రానికి వుందని అంటూ ముఖ్యమంత్రి ప్రభుత్వం చేపట్టి అమలు పరుస్తున్న అనేక కార్యక్రమాల గురించి సాధించిన విజయాల గురించి కలెక్టర్లకు తెలియచేసారు.

19 నుంచి కృషిక్ అగ్రిఎక్స్‌పో

హైదరాబాద్: అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు చెందిన కృషి విజ్ఞాన కేంద్ర(కేవీకే) తాజాగా కొయిలన్‌మెస్సే వైఎ ట్రేడ్‌ఫెయిర్ సౌజన్యంతో మూడవ దఫా కృషిక్ అగ్రిఎక్స్‌పోను నిర్వహించనుంది. ఈనెల 19 నుంచి 22 వరకూ జరిగే ఈ డెమోస్ అండ్ అగ్రిఎక్స్‌పో-2018ను పూణెలోని కేవీకె ఇండస్ట్రియల్ పార్క్‌లో నిర్వహిస్తున్నట్టు కేవీకే తెలిపింది. వ్యవసాయరంగంలోని వివిధ అంశాలపై దీనిలో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలో మొత్తం 400 కంపెనీలు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 3 కోట్లకు పైగా ప్రజలు వీక్షించనున్నారని సంస్థ భావిస్తోంది. ఈ సందర్భంగా వ్యవసాయంలో అద్భుత ఫలితాలు సాధించిన రైతలు తమ అనుభవాలను ఇతరులతో పంచుకోనున్నారు.

జిఎస్‌కే ఆసియా, పసిఫిక్ హెడ్‌గా ఫ్లిప్పో లెంజీ



ముంబై: ప్రముఖ జీఎస్‌కే కన్స్యూమర్ హెల్త్ కేర్ తాజాగా ఆసియా, పసిఫిక్ రీజనల్ హెడ్‌గా ఫ్లిప్పోలెంజీని నియమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో 23 దేశాల్లోని సంస్థ కార్యాలయాలను ఫ్లిప్పోలెంజీ పర్యవేక్షించనున్నారు. జీఎస్‌కే కన్స్యూమర్ హెల్త్‌కేర్, నోవారిట్స్ ఓటీసీ జాయింట్ వెంచర్‌లో భాగంగా ఆసియా, పసిఫిక్ రీజనల్ హెడ్‌గా ఫ్లిప్పోలెంజీ నియమితులయ్యారు. ఫ్లిప్పోలెంజీకి హెల్త్‌కేర్ రంగంలో 20 సంవత్సరాల అనుభవం ఉంది. ఆయన మల్టిపుల్ మార్కెట్స్‌కు కన్సల్టెంట్‌గా, జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. ఫ్లిప్పోలెంజీ ఐదేళ్లపాటు జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీలోని డయాబెట్స్ డివిజన్‌కు హెడ్‌గా వ్యవహరించారు. అంత ముందుకు నెస్లేలో 10 సంవత్సరాలపాటు పనిచేశారు.

రూ.50 కోట్ల ఆర్డర్లను దక్కించుకున్న బోద్‌ట్రీ

హైదరాబాద్: అగ్రగామి ఐటీ కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ సర్వీస్ ప్రొవైడర్ బోద్ ట్రీ తాజాగా రూ. 50 కోట్ల విలువైన ఆర్డర్లను సంపాదించినట్లు వెల్లడించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్(ఐసీఎఫ్ఆర్ఈ) నుంచి రూ. 8.39 కోట్ల విలువైన పనులను దక్కించుకుంది. దీనిలో భాగంగా బోద్‌ట్రీ ఐదేళ్లపాటు డెహ్రాడూన్‌లోని ఐసీఎఫ్ఆర్ఈ డేటా సెంటర్‌కు సేవలు అందించనుంది. రెండవ ఆర్డర్‌ను మగధ యూనివర్శిటీ నుంచి దక్కించుకోగా, దీని విలువ రూ. 43 కోట్లు. డిజిటల్ యూనివర్శిటీ ప్లాట్‌ఫారం కింద వర్శిటీకి బోద్‌ట్రీ సర్వీస్ మోడల్స్‌ను అందించనుంది. మగధ యూనివర్శిటీ బీహార్‌లో అత్యంత పురాతన యూనివర్శిటీగా పేరొందింది. ఇక్కడి నుంచి ప్రతీయేటా 5 లక్షలమంది విద్యార్థులు వివిధ కోర్సులు పూర్తిచేస్తుంటారు.

సిగరెట్ స్మగ్లింగ్‌ను ప్రభుత్వం అడ్డుకోవాలి

న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని పొగాకు రైతులకు చేయూత నందిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్ అసోసియేషన్(ఎఫ్ఏఐఎఫ్ఎ) దేశంలో అంతకంతకూ పెరిగిపోతున్న పొగాకు స్మగ్లింగ్‌ను ప్రభుత్వం నియంత్రించాలని కోరుతోంది. 2014-15 కన్నా 2016-17లో సిగరెట్ల స్మగ్లింగ్ మరింత పెరిగిందని పేర్కొంది. ఈ వివరాలను పార్లమెంట్‌లో గత డిసెంబరులో ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించిందని పేర్కొంది. ఈ సందర్భంగా ఎఫ్ఏఐఎఫ్ఎ జనరల్ సెక్రటరీ మురళీబాబు మాట్లాడుతూ భారత్‌తో పాటు పలు దేశాల్లో పొగాకు సాగుతో పలువురు రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారిపై కఠినమైన ఆంక్షలు విధించడం సరికాదని సంస్థ పేర్కొంది. అలాగే సిగరెట్ల స్మగ్లింగ్‌ను అడ్డుకోవాలని కోరింది.

ప్రజల జేబుకు చిల్లు



ఖాళీ చేస్తున్నారని వై.ఎస్.జగన్ ధ్వజమెత్తారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 63వ రోజు నగరి నియోజకవర్గంలోని వడమాలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి వైయస్ జగన్ ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే "నడిరోడ్డును లెక్క చేయకుండా చిరునవ్వుతో ఆప్యాయతలు, ప్రేమానురాగాలు పంచుతున్నారు. ఆత్మీయతను చూపుతున్నారు. పాదయాత్రగా ఈ నియోజకవర్గంలో అడుగులు వేస్తుంటే చాలా మంది రైతులు వచ్చి అన్నా ఇదే నియోజకవర్గంలో రేణిగుంట షుగర్ ఫ్యాక్టరీ ఉంది. మా జిల్లాలో ఆరు చక్కెర ఫ్యాక్టరీలు ఉన్నాయి. మా కర్మ ఏంటో తెలియదు కానీ చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా కూడా సహకార ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార ఫ్యాక్టరీలు నడిస్తే రైతులకు మంచి రేట్లు వస్తాయి. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా కూడా ఈ ఫ్యాక్టరీలు మూత పడుతున్నాయి. గతంలో 9 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు నగరి నియోజకవర్గంలోని ఈ రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. రైతులు అవస్థలు పడే పరిస్థితి వచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆ చక్కెర ఫ్యాక్టరీ బకాయిలు చెల్లించి, వాటిని తిరిగి తెరిపించారు. నాన్నగారి పుణ్యమా అంటూ పదేళ్ల పాటు రైతులు సంతోషంగా ఉన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడం, ఆ రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడటం జరిగింది. ఆశ్చర్యం ఏంటో తెలుసా ప్రైవేట్ ఫ్యాక్టరీలు మాత్రం లాభాల మీద లాభాలు వస్తున్నాయి. రైతులు వాళ్లకు ఇష్టం ఉన్నా లేకున్నా ప్రైవేట్ పరిశ్రమలకు సరకును అమ్ముకోవాల్సి వస్తుంది. బెల్లం చేసేందుకు రైతులు ముందుకు వెళ్తే నల్ల బెల్లం అంటూ ఆంక్షలు విధించి ఎగుమతులను అడ్డుకుంటున్నారు. ఇదే జిల్లాలో ఓ మహిళ బెల్లం ముద్ద చూపించింది. ఈ బెల్లం నల్లగా ఉంటే నేనేం చేయాలన్నా నా భూమి నల్లగా ఉందన్నా నేనేం చేయాలన్నా అని అడిగింది. ఇదే చంద్రబాబు నల్ల బెల్లానికి ఆంక్షలు పెట్టి దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు రైతుల జీవితాలను నాశనం చేస్తున్నారు.

పెట్టుబడులే లక్ష్యం



మంత్రి బృందం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వ్యాపార, పెట్టబడులు అవకాశాలను వివరించారు. ముఖ్యంగా అటోమొబైల్, టెక్స్‌టైల్స్, ఫార్మ, ఐటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. అటోమొబైల్ దిగ్గజం హ్యూందయ్ కార్పోరేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు నామ్ గుహ్నోతో సమావేశం అయ్యారు. తెలంగాణలోని అటోమొబైల్ రంగంలో ఉన్న పెట్టబడుల ఆవకాశాలను వివరించారు. ముఖ్యంగా టియస్ ఐపాస్ ద్వారా సింగిల్ విండో అనుమతుల విధానం పైన హ్యూందయ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. హ్యూందయ్ రోటెమ్, గ్లోబల్ రైల్వే విభాగం డైరెక్టర్ కెకె యూన్ తో సమావేశం అయ్యారు. గ్రీన్ ఎనర్జీలో అగ్రగామిగా ఉన్న ఒసిఐ సియివో ఊహయ్యాన్‌లీ తో సమావేశం అయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ముప్పయ్ మూడు ప్రాంతాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ కంపెనీని తెలంగాణకు అహ్వానించారు.

మొబైల్ ఇంటర్నెట్ బిజినెస్ అసోషియేషన్ (మెయిబా)తో మంత్రి ప్రతినిధి బృందం సమావేశం అం య్యింది. మెయిబా సియివో ఛోయ్‌డాంగ్‌జిన్‌తోజరిగిన సమావేశంలో సంస్థ ప్రతినిధులను ఫిబ్రవరిలో తెలంగాణలో జరగనున్న ప్రపంచ ఐటి కాంగ్రెస్ కు అహ్వానించారు. 500లకుపైగా కంపెనీలు సభ్యులుగా ఉన్న ఈ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒక అవగాణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం మేరకు మోయిబా (కోరియా మోబైల్ ఇంటర్‌నెట్ బిజినెస్ అసోసియేషన్) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఇంటర్నెట్ అఫ్ తింగ్స్, వర్చువల్ రియాలిటీ , మరియు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ వంటి అంశాల్లో కలిసి పనిచేస్తాయి.

మంత్రి కెటి రామరావు టెక్స్ టైల్ పరిశ్రమల వర్గాలతో సమావేశం అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, టెక్స్టైల్ రంగంలోని పెట్టుబడులకు అకర్షనీయ ప్రదేశమని, పెట్టబడులతో ముందుకు వచ్చే కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహాకారం అందిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాలసీలు, టియస్ ఐపాస్ వంటి ముఖ్యాంశాలను మంత్రి వారికి వివరించారు. ముఖ్యంగా టెక్స్టైల్ పరిశ్రమల సమాఖ్య కోఫోతి చైర్మన్ కిహూక్ సుంగ్ మరియు ఇతర కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. కిహుక్ చైర్మన్ గా ఉన్న యంగ్వాన్ సంస్థ ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో 300 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నది. యంగ్వాన్ సంస్థ నార్త్ ఫేస్ అనే బ్రాండ్ పేరుతో వస్త్రాలను తయారు చేస్తుంది. ఈ బ్రాండ్ రానున్న ఒలిఫింక్స్ క్రీడలకు అధికారిక భాగస్వామిగా ఉన్నది. మంత్రి మరో ప్రముఖ టెక్స్టైల్ సంస్థ హ్యోసంగ్ సంస్థ ఉపాధ్యక్షులు జె జూంగ్ లీతో సమావేశమయ్యి టెక్స్టైల్ పార్కులో పెట్టుబడి పెట్టాలని కోరారు. ఈ సమావేశానంతరం మంత్రి డైటెక్ (కోరియా డైయింగ్ అండ్ ఫినిషింగ్ టెక్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. డైటెక్ అధ్యక్షులు యూన్‌నాంసిక్ తో సమావేశం అయిన మంత్రి మెగా టెక్స్ టైల్ పార్కులో వాటర్ ట్రీట్ మెంట్, మానవ వనరుల నిర్వహాణ వంటి అంశాల్లో సాంకేతిక సహకారమందించాల్సిందిగా కోరారు. డైటెక్ పరిశ్రమలో మంత్రి బృందం పర్యటించింది. మరోక ప్రముఖ టెక్స్‌టైల్ దిగ్గజ సంస్థ కోలాన్ గ్రూపుతో మంత్రి కేటీఆర్ సమావేశం అయ్యారు.

కొరియా టెక్స్టైల్ సిటీ పేరుగాంచిన డైగు మెట్రోపాలిటన్ (్యా) నగరాన్ని మంత్రి ప్రతినిధి బృాఎందం సందర్శించింది. ఈ నగరంలో కొరియన్ టెక్స్‌టైల్ , ఫ్యాషన్ మరియు హై టెక్నాలజీ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నది. ఈ నగర డిప్యూటీ మేయర్ కిమ్ యాన్ చాంగ్ తో సమావేశం అయిన మంత్రి నగరంలో టెక్స్టైల్ పరిశ్రమల పారిశ్రామిక ప్రగతి పైన చర్చించారు. డైగు నగర ఇన్నోవేషన్ మరియు అర్దిక విభాగ బృాఎందంతో సమావేశం అయిన మంత్రి వారిని ఇమేజీ టవర్ ప్రాజెక్టులో భాగస్వాములు కోరారు. మంత్రి కెటి రామారావు వెంట తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ యంపి జి. వివేక్ తోపాటు పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష రంజన్ ఇతర అధికారులున్నారు.

31 నుంచి ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్



న్యూఢిల్లీ: ఈనెల 31 నుంచి ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌ను దేశరాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు కేంద్ర క్రీడలు, యువజన విభాగం తెలిపింది. ఈ పోటీలకు స్టార్ స్పోర్ట్స్ ప్రసార బాధ్యతను చేపట్టనున్నట్లు పేర్కొంది. ఈ పోటీలకు సంబంధించిన లోగోను కేంద్ర క్రీడలు, యువజన విభాగంశాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఆవిష్కరించారు. ప్రభుత్వం ఈ పోటీలను తొలిసారిగా భారీ ఎత్తున నిర్వహించనుంది. ఈ పోటీలను ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం, ఇందిరాగాంధీ స్టేడియం కాంప్లెక్స్, మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియం, కర్నిసింగ్ షూటింగ్ రేంజ్, డాక్టర్ ఎస్‌పీఎం స్విమ్మింగ్ కాంప్లెక్స్ మొదలైన ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. మత్తం 16 రకాల క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రాజ్యవర్ధన్ సింగ్ మాట్లాడుతూ ఖేలో ఇండియా అనేది చిన్నారుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్నా కార్యక్రమమని పేర్కొన్నారు.

నా హత్యకు బీజేపీ కుట్ర

ఎన్ కౌంటర్ చేసి చంపాలని రాజస్థాన్ పోలీసులు ప్లాన్ వేశారని ఆరోపించారు. దాదాపు పదేళ్ల క్రితం నాటి కేసులో నన్ను టార్గెట్ చేశారు. రాజస్థాన్ పోలీసులు నన్ను అరెస్ట్ చేసేందుకు వచ్చారు. నన్ను చంపాలని ప్రణాళిక వేసినట్టు కొందరు నాకు తెలిపారు. నన్ను మాట్లాడనీయకుండా చేసేందుకు స్వర పేటికను పాడు చేయాలని చూశారు అంటూ సంచలన ఆరోపణలు చేశారు. రామమందిరం, గో సంరక్షణ, రైతులకు సంక్షేమ పథకాలు తదిత రాంశాలపై నేను ప్రశ్నిస్తున్నందునే ఈ పరిస్థితి ఎదురైందని, ఎవరు నాపై దాడికి యత్నించాలని చూశారన్న విషయం మాత్రం తెలియదని చెప్పారు. కాగా, ప్రవీణ్ తొగాడియా ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని వైద్యులు తెలిపారు. జెడ్ క్యాటగిరీ రక్షణలో ఉన్న ఆయన సోమవారం ఉదయం మాయం కావడంతో దేశవ్యాప్తంగా కలకలం రేగిన సంగతి తెలిసిందే. ఆపై చంద్రమణి ఆసుపత్రిలో ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. గుజరాత్, రాజస్థాన్ పోలీసులు తనను అంతం చేయాలని చూస్తున్నారని, తన సన్నిహితుల ద్వారా విషయాన్ని తాను తెలుసుకున్నానని, అదే సమయంలో తన శరీరంలో షుగర్ స్థాయిలు పడిపోవడంతో స్పృహ కోల్పోతున్న పరిస్థితిలో ఆసుపత్రిలో చేరానని చెప్పారు. ఫోన్ స్విచ్చాఫ్ చేసిన కారణం కూడా అదేనని, తనపై అరెస్ట్ వారెంట్ ను జారీ చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, చావుకు భయపడే వ్యక్తిని కాదని చెప్పిన ఆయన, తనను అంతం చేయడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కాగా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా ఆచూకీ తెలియలేదంటూ సోమవారం నాడు వీహెచ్‌పీ ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం నుంచి ఆయన ఏమయ్యారో.. ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. అయితే ఆయనపై అరెస్ట్ వారెంట్ ఉండటంతో అజ్ఞాతంలోకి వెళ్లి ఉంటారని అందరూ భావించారు. ఉన్నట్టుండి ఆయన అహ్మదాబాద్‌లోని ఆస్పత్రిలో ప్రత్యక్షమయ్యారు. తీవ్ర అస్వస్థతతో ఆయన చంద్రామణి ఆస్పత్రిలో చేరినట్లు వైద్యులు స్పష్టం చేశారు. గ్లూకోజ్ లెవల్స్ పడిపోవడంతో స్పృహ కోల్పోవడంతో తొగాడియాను ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, మెల్లగా కోలుకుంటున్నట్లు వెద్యులు తెలిపారు. ప్రస్తుతం ప్రవీణ్ తొగాడియాను డాక్టర్ రూప్ కుమార్ అగర్వాల్ పర్యవేక్షణలో ఉంచారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా (65) ఆచూకీ లభించింది. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆయన అహ్మదాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ప్రత్యక్షమవడంతో వీహెచ్‌పీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. తొగాడియాపై ఉన్న ఓ పాత కేసు విషయంలో రాజస్థాన్ పోలీసులు తమను సంప్రదించారని, అయితే ఆయన నివాసంలో కనిపించకపోవడంతో వారు వెనుదిరిగారని సోల పోలీసులు వివరించారు. దీంతో తొగాడియా ఎక్కడున్నారో తెలియక కార్యకర్తలు ఆందోళన చెందారు. ఆయన ఆచూకీ చెప్పాలంటూ పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు.

రూ.1000 కోట్ల పందెం కోడి

ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి పందేలను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి మరీ ప్రత్యక్ష ప్రసారం చేశారు. బౌన్సర్లతో పాటు వందమందితో భద్రతను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏకంగా పది బరులు ఏర్పాటు చేసి వెయ్యికి పైగా పందేలు నిర్వహించారు. పందేలు జరిగే ప్రాంగణంలో 30 గుండాట బోర్డులు ఏర్పాటు చేసి కాయ్‌రాజా కాయ్ అంటూ జూదరులు చెలరేగిపోయారు. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు 450 బరుల్లో తొలిరోజు పందేలు నిరాటంకంగా సాగాయి. సహ జూదాల ద్వారా రూ.కోటికి పైగా ప్రజల సొమ్ము నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్లు అంచనా. అక్కడక్కడా పందేల మాటున పేకాట శిబిరాలూ నిర్వహించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం వరకు అన్ని బరుల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు కదలకపోవడంతో ఇక పందేలు జరగవేమో అని అంతా నిరుత్సాహానికి గురయ్యారు. మధ్యాహ్నం కోడి పందేలు నిర్వహించుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో బరుల వద్ద నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. ఆ తర్వాత పందెంరాయుళ్లు అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసుకుని పందేలు ప్రారంభించారు. మొత్తానికి సాయంత్రానికికల్లా పందేలు ఊపందుకున్నాయి. అయిభీమవరంలో ఉండి శాసనసభ్యుడు శివరామరాజు, పారిశ్రామికవేత్త రఘురామకృష్ణంరాజు, పాలకొల్లులో ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కోడిపుంజులను వదిలి పందేలు ప్రారంభించారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో 165వ జాతీయరహదారికి ఆనుకుని రెండుచోట్ల బరులు ఏర్పాటు చేయడం విశేషం. యలమంచిలి మండలం కలగంపూడిలో భారీఎత్తున కోడి పందేలు జరిగాయి.

ఆగిన కోడిపందాలు....పోలీసులు, గ్రామస్థుల మధ్య తోపులాట

భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల మధ్య కోడిపందేల విషయమై పోలీసులు, గ్రామస్థుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. నరసాపురం డీఎస్పీ ప్రభాకర్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ మహేశ్‌కుమార్, డీఎస్పీ హుస్సేన్ ఆధ్వర్యంలో 70 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అన్నిచోట్లా కోడి పందేలకు అనుమతులిచ్చి తమకు ఎందుకు ఇవ్వరంటూ గ్రామస్థులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. భారీఎత్తున జనం రావడంతో



తోపులాట జరిగింది. పోలీసులు బరి మధ్యలో కూర్చోవడంతో చివరకు పందేలు జరగలేదు.


ఫైట్ 24 గంటలు...?: కృష్ణా జిల్లాలోనూ కోడి పందేలు రాత్రింబవళ్లు నిర్వహించేలా షామియానాలు, ఫ్లడ్‌లైట్ల వెలుగులతో బరులను ఏర్పాటు చేశారు. కోడి కాళ్లకు కత్తులు కట్టకూడదని ఆంక్షలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అదెక్కడా కనిపించలేదు. చిన్న, పెద్ద బరులను కలుపుకొని జిల్లాలో సుమారు 70కిపైగా బరులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రధానంగా పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, పెదపులిపాక, ఈడుపుగళ్లు, గొడవర్రు, తిరువూరు నియోజకవర్గంలో కాకర్ల, తొాకపల్లి, ముష్టికుంట్ల, జగ్గయ్యపేట నియోజకవర్గంలో చిల్లకళ్లు, బూదవాడ, కైకలూరు నియోజకవర్గంలో కోల్లేటికోట, నందిగామ నియోజకవర్గంలో రాఘవాపురం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున డబ్బులు చేతులుమారాయి.

కోడి పందెం విజేతలకు ఆకర్షణీయ బహుమతులు...?

కోడి పందేల్లో భాగంగా నిర్వాహకులు విలువైన బహుమతులు ప్రకటిస్తున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని గొడవర్రులో నిర్వహిస్తున్న కోడి పందేల్లో వరుసగా మూడు పోటీల్లో విజయం సాధించిన పుంజుల యజమానులు మానికొండ ప్రభాకర్, కొసరాజు చిన్నిలకు ఆదివారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను ఎమ్మెల్సీ యలమంచిలి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.


ఏరులై పారిన డబ్బు...జనం వద్దకే తరలివచ్చిన మద్యం...?: గెలిచినోడు సంపాదించిన డబ్బుతో మజా, విందు, మందుతో సదరాలు...ఓడినోడు బాధలో క్వాటర్ ఇది సంక్రాంతి పందెం కోళ్ల ఆడిన వారి నిర్వాకం. కోడి పందాలు సాగుతున్న చోటికే మద్యం తరలివచ్చింది. మద్యంలో సోడా, స్టఫ్‌ల కోసం ప్రత్యేక స్టాల్స్‌వెలిశాయి. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హడావుడి చేసిన అధికారులు, పోలీసులు పత్తా లేకుండా పోయారు. ఖద్దరు అండతో బరుల నిర్వాహకులు చెలరేగిపోయారు. గ్రామ గ్రామాన కోడిపందేలకు తెరలేపారు. భోగి రోజే భారీ ఎత్తున పందేలు నిర్వహించారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలో పందేల నిర్వహిణను కొత్త వుంతలు తొక్కించారు. ఇక్కడ తొలి రోజే రూ.10 కోట్లకు పైగా చేతులు మారాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పందేపురాయళ్లు ఖరీదైన కార్లలో తరలివచ్చారు. పందేల్లో యువతులు కూడా పాల్గొనడం గమనార్హం. మొత్తం పది బరులు ఏర్పాటు చేశారు.

లెక్సస్ ఫ్లాగ్‌షిప్ ఎల్ఎస్500హెచ్




న్యూఢిల్లీ: లెక్సస్ ఎల్ఎస్ భారతదేశంలోకి ప్రవేశించింది. దీంతో అంతా ఎంతగానో ఎదురుచూస్తున్న ఐదో తరం ఎల్ఎస్ 500హెచ్ త్వరలోనే భారతదేశంలో అందుబాటులోకి రానుంది. ప్రయాణికులకు విలాసవంతమైన ప్రయాణాన్ని ఇది అందించనుంది. డిజైన్ మొదలుకొని పనితీరు, సౌకర్యం వరకూ ఎల్ఎస్500హెచ్ తిరుగులని డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది. ఈ సందర్భంగా లెక్సస్ ఇండియా చైర్మన్ ఎన్.రాజా మాట్లాడుతూ లెక్సస్ ఎల్ఎస్500 హెచ్ ఇప్పుడు భారతదేశంలోకి ప్రవేశించింది. ఎల్ఎస్500హెచ్‌ను ఇక్కడ మా శ్రేణికి జోడించుకోవడం మాకెంతో ఆనందదాయకం. అత్యున్నతస్థాయి ప్రమాణాలను కోరుకునే భారతీయులను ఇది ఆకట్టుకోగలదని మేము విశ్వసిస్తున్నామని అన్నారు.

అమెజాన్‌తో ఓరియంట్ ఎలక్ట్రిక్ భాగస్వామ్యం



న్యూఢిల్లీ: 1.6 బిలియన్ డాలర్ల విలువ కలిగిన సి.కె.బిర్లా గ్రూపులో భాగమైన ఓరియంట్ ఎలక్ట్రిక్ తాజాగా తన ఏరోస్టార్మ్ ప్రీమియం సీలింగ్ ఫ్యాన్‌ను అమెజాన్ భాగస్వామ్యంలో దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఏరోస్టార్మ్ 3000 సిఎంఎం కనిష్ట గాలి ఆవర్తనాన్ని శబ్దాన్ని అందిస్తుంది. ఈ ఉత్పత్తితో ఓరియంట్ ఎలక్ట్రిక్ ఫ్యాన్ల వలయంలో నూతన విభాగానికి సాంకేతికతను సమ్మిళితం చేసి విభిన్న ఉత్పత్తుల శ్రేణిని పరిచయం చేసింది. నూతన శ్రేణి ఫ్యాన్ల గురించి ఓరియంట్ ఎలక్ట్రిక్ ఫ్యాన్ల వ్యాపార విభాగం ఉపాధ్యక్షుడు, వ్యాపారవిభాగాధిపతి అతుల్ జైన్ మాట్లాడుతూ మేము మా మొదటి ఏరో సీరిస్ ఫ్యాన్ ఏరో క్వైట్‌ను గత ఏడాది విడుదల చేశాం అది అందరి మన్ననల్ని అందుకుంది. అది సూపర్ ప్రీమియం ఫ్యాన్లలో నూతన ఫ్యాన్ల ఉత్పాదనకు సహకరించిందన్నారు.

సూర్య
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
7



సాగరతీర పర్యాటకానికి అంతర్జాతీయ అవార్డు దక్కించుకున్న ఎపి

విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 13 జిల్లాల పరిధిలో పర్యటకరంగపరంగా చేపడుతున్న ప్రాజెక్టులు ఇప్పటికే ఫలితాలను ఇస్తూ రాగా, వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు పర్యాటక శాఖకు అవార్డులు అందిస్తున్నాయి. తాజాగా పసిఫిక్ ప్రాంత పర్యాటక రచయితల సంస్థ ఆంధ్రప్రదేశ్ టూరిజంకు అవార్డు ప్రకటించింది. మార్చి 9వ తేదీన బెర్లిన్ వేదికగా జరిగే అవార్డుల ప్రదానో త్సవంలో అతిరథ మహారథుల సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అవార్డును అందుకోనున్నారు. సాగరతీర పర్యాటకంలో ఉత్తమ ఆగమన కేంద్రం విభాగంలో ఈ అవార్డును అందిస్తున్నట్లు, పట్వా ప్రధాన కార్య దర్శి సాగర్ అహ్లువాలియా రాష్ట్ర పర్యాటక శాఖకు సమాచారం అందించారు. అవార్డుల ప్రధానోత్సవం సందరేంగా బెర్లిన్ వేదికగా పసిఫిక్ ఏరియా ట్రావెల్ రైటర్స్ అసోసియేషన్ పలు కార్యక్రమాలను చేపడుతుండగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అయా కార్యక్రమాలలో భాగస్వామ్యం కాబోతుంది.

ఈ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ విభజన అనంతరం ఎదురవుతున్న ఇబ్బందులను సైతం అధికమించి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తుండగా, దీనిని జాతీయ, అంతర్జాతీ య స్థాయి సంస్థలు గుర్తించటం ముదావహ మన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయిడి నుండి తమకు లభిస్తున్న ప్రోతాహంతో ఈ విజయాలను సాధించగలుగుతున్నామని, ఈ క్రమంలో పర్యాటక శాఖ ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయమైనదని మీనా వివరించారు. అథారిటీ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ పక్షాన అభినందనలు తెలువుతున్నావని మీనా అన్నారు.


ఖమ్మం కాంగ్రెస్‌లో రేణుకా కుంపటి

- టిక్కెట్లు పంపిణీ వేళ కొత్తె ఎత్తులు
- ఇప్పటికే కొందరికి అభయం
- హైకమాండ్ తన చేతుల్లో ఉందనే సంకేతాలు
- టాస్కఫోర్సు పేరుతో కాంగ్రెస్ కమిటీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు



ఖమ్మం, సూర్యప్రతినిధి : రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న వేళ ఫైర్ బ్రాండ్ రేణుకాచౌదరి కుంపటి పెడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రేణుకాచౌదరి ఏమిటి ? కుంపటి ఏమిటి? అనుకుంటున్నారా? అసలే గ్రూపు రాజకీయాలకు పెట్టిందిపేరైన కాంగ్రెస్‌లో ఆమె మరింత ఫైర్‌గా వ్యవహరిస్తుంటారు. టిక్కెట్ల పంపిణి వేళ,హైకమాండ్ తనచేతులో ఉందనే సంకేతాలు ఇస్తుంటారనే ప్రచారం ఉంది. పైగా ఎన్నికలకు నెత్తిమీదకు వస్తున్న సమయంలో టాస్కఫోర్సుల పేరుతో నియోజకవర్గాల్లో కొత్తపంచాయతీలు పెట్టి కాంగ్రెస్ కమిటీలను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించటం ద్వారా రానున్న ఎన్నికలను సమర్ధంగా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాల్సిందిపోయి, కొత్తపంచాయతీ లకు తెరలేపటంపై దుమారం రేగుతుంది. ప్రత్యర్థుల మీద ఎక్కుపెట్టాల్సిన బాణాలను ఆమె సొంతపార్టీవారిపైనే పెడుతుంటారనే అభిప్రాయాలు ఉన్నా యి. అప్పుడప్పుడు ఆమె జిల్లాకు వస్తూ హల్‌చల్ చేస్తుంటారు. ఖమ్మం లోక్‌సభ సభ్యురాలుగా ఉన్నప్పుడే అప్పుడప్పుడు వస్తుండటంతో విజిటింగ్ ప్రొఫెసర్‌గా విమర్శలను ఎదుర్కొన్నారు. రాజ్యసభకు వెళ్ళిన తరువాత జిల్లాకు రావటం బాగా తగ్గించారు. స్థానిక సమస్యలు అసలు పట్టించుకున్న దాఖలాలులేవు. స్థానిక ఎన్నికలు , సహకారసంఘాలు ఆమెకు పట్టవు. గెలిస్తే తనగెలుపు లేకపోతే వేరే వారి వల్లనే ఓడిపోయాం అని బాధ్యతలనుంచి తప్పుకోవటం ఆమెకు బాగా తెలుసుననే అభిప్రాయాలు ఉన్నాయి. కేవలం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలప్పుడు మాత్రం తానున్ననని వస్తుంటారు. ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. రాజ్యసభసభ్యురాలుగా ఆమె ఖమ్మంలోనే కాదు దేశమంతా తిరిగే హక్కు అధికారం ఉంది. చిక్కుల్లా ఆమె పార్టీకి ఎంతవరకు ఉపయోగపడుతున్నారనేదే ప్రశ్న? జిల్లాలో ఆమె పాత్ర ఏమిటి? అసలు తెలంగాణ ప్రదేశ్ కమిటీలో ఆమె భాద్యత ఏమిటి? జిల్లాలో భద్యాత ఏమిటి? ఖమ్మం కాంగ్రెస్‌కు ఎంతవరకు ఉపయోగపడుతున్నారు. ఎఐసిసి అధికార ప్రతినిధి పదవి నుంచి ఆమెను హైకమాండ్ ఎందుకు తొలగించింది. లాంటి ప్రశ్నలకు జవాబులు దొరకటం లేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరిన్ని పర్యటనలకు ఆమె రంగం సిద్దంచేసుకుంటున్నట్లు సమాచారం. కాంగ్రెస్ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆమె దృష్టికేంద్రీకరించి పార్టీని గెలిపిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషిస్తారు. ఆమెను నెత్తిన పెట్టుకుని ఊరేగిస్తారు. కాని అలాచేయరని కాంగ్రెస్ కార్యకర్తలే అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. పార్టీకి బలమైన నియోజకవర్గాల్లో వర్గాలను ప్రోత్సహిస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. గతంలో పాలేరులో మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా కొంతమందిని చేరదీయటం ద్వారా ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరించారు దీనిపై పెద్దరాద్ధాంతమే జరిగింది. ప్రస్తుతం మధిరలో కొంత మందితో సంబంధాలు కొనసాగిస్తూ అక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా , పిసిసి వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న మల్లు భట్టివిక్రమార్కకు వ్యతిరేకంగా పావులు కదుపుతు న్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. అసలు ఖమ్మం జిల్లాకు రేణుకా చౌదరికి సంబంధం ఏమిటనే చర్చలు చాలా కాలం నుంచి జరుగుతునే ఉన్నాయి. దివంగత నేత మాజీ మంత్రిరాంరెడ్డి వెంకటరెడ్డి , రేణుకాచౌదరిల మధ్య మాటల యుద్ధం జరిగింది. 1999 ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్‌టిక్కెట్ పొంది పోటిచేసి గెలిచిన రేణుకాచౌదరి తిరిగి 2004లోనూ గెలుపొందారు. 2009లో తెలుగుదేశంకు చెందిన నామా నాగేశ్వరరావు చేతిలో ఆమె ఓడిపోయారు. అంతకు ముందు పివి రంగయ్యానాయుడు, నాదెండ్ల భాష్కర్ రావులు కూడా ఎక్కడ నుంచో వచ్చి ఖమ్మం పార్లమెంట్‌కు పోటిచేసి గెలిచారు. వారి పదవికాలంలో మాత్రమే ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాకలాపాల్లో జోక్యం చేసుకున్నారు తప్ప తరువాత వారు జిల్లాకు సంబంధం లేకుండానే ఉన్నారు. రేణుకా చౌదరి మాత్రం జిల్లాను వదిలి పెట్టడంలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం జరుగుతున్న కాలంలోఇక్కడ కాంగ్రెస్ నేతలంతా ఉద్యమానికి మద్ధతుగా ఉన్నప్పటికి ఆమె తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నారనే విమర్శలను ఎదుర్కొన్నారు. అప్పట్లో తెలంగాణ కోసం ఎంపిలు, ఎమ్మెల్యేతో జరిగిన సమావేశాల్లో పొన్నం ప్రభాకర్‌లాంటి వారు రేణుకాచౌదరిని బహిరంగంగానే వ్యతిరేకించారు. కొన్ని సందర్భాలలో తెలంగాణ ఎంపిల సమావేశానికి కూడా ఆమెను పిలవని పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తరువాత ఆమె ఆంధ్రకువెళ్లాతారని అందరూ భావించారు. హైదరాబాద్‌లోనే ఉంటూ తనూ తెలంగాణనే అని చెప్పేందుకు తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఖమ్మం ఎంపి కానప్పటికి రాజ్యసభసభ్యురాలుగా ఖమ్మంనే ఎంపిక చేసుకుని ఇక్కడ కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఎంపిల్యాడ్స్ నిధులు కూడా అంతంత మాత్రంగానే ఖర్చుచేస్తున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. అంతే కాకుండా ఖమ్మంపై పట్టుకోసం తన ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. అయితే ఎన్నికల్లో ఆమెకు సహకంచిన వారిని, జిల్లాకు తెచ్చిన సంభాని చంద్రశేఖర్ లాంటి సీనియర్ నేతలను సైతం విస్మరించారనే విమర్శలు ఉన్నాయి. రెండు సార్లు పార్లమెంట్‌కు ఎన్నికవటంతో పాటు కేంద్రంలో మంత్రిగా చేసిన ఆమె జిల్లాలో ఒక్క మేజర్ ప్రాజెక్టు తీసుకురాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకమైన అభివృద్ధి కూడా చేయలేకపోయారనే అభిప్రాయంతో జిల్లా ప్రజలు గుర్రుగా ఉన్నారు. గ్రూపులను పోత్సహించటం, తనకు నచ్చని వారికి టిక్కెట్లు రాకుండా చేయటంలో సిద్ద హస్తురాలుగా ఆమె పేరుగడించారు. వైరా ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం టిక్కెట్‌ను ఒక కుటుంబానికి ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూల్ చేశారనే విమర్శలను ఆమె ఎదుర్కొన్నారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం టిక్కెట్ జలగం వెంకట్రావుకు రాకుండా అడ్డం పడ్డారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి, కెవిపి రాంచందర్‌రావు లాంటి వారు చెప్పినా ఆమె వినలేదు. చివరకు యూనిస్ సుల్తాన్‌కు పట్టుపట్టి మరీ ఖమ్మం అసెంబ్లీ టిక్కెట్ ఇప్పించారు. ఖమ్మంలో తెలుగుదేశం నుంచి పోటి చేస్తున్న తుమ్మలను గెలిపించేందుకే ఆమె బలహీనమైన సుల్తాన్‌కు టిక్కెట్ ఇప్పించారని ఇది కచ్చితంగా మ్యాచ్ ఫిక్సింగేననే విమర్శలు వచ్చాయి. హోరాహోరాగా జరిగిన పోటిలో టిక్కెట్‌రాని జలగం వెంకట్రావు ఇండిపెండెంట్‌గా పోటిచేసి కేవలం రెండు వేల ఓట్లతో ఓడిపోయారు. రేణుకాచౌదరి పట్టుబట్టి టిక్కెట్ ఇప్పించిన కాంగ్రెస్ అభ్యర్ది సుల్తాన్‌కు కేవలం 25 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. పార్లమెంట్‌కు పోటిచేసిన రేణుకాచౌదరి కూడా ఓటమి చవిచూశారు. వెంకటావుకు టిక్కెట్ ఇప్పించి ఉంటే ఆమె మంచి మోజార్టీతో గెలిచేవారనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి పోటిచేశాయి. పోత్తులో భాగంగా ఖమ్మంపార్లమెంట్‌తోపాటు, వైరా, కొత్తగూడెం అసెంబ్లీని సిపిఐకి కేటాయించారు. ఖమ్మం లోకసభకు సిపిఐ నుంచి అప్పటి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ పోటిచేశారు. తనకు జిల్లాలో బలం ఉందని చెప్పుకుంటున్న రేణకాచౌదరి నారాయణకు అనుకూలంగా ప్రచారం చేశారు. నారాయణకు కేవలం 80 వేలకు పైచిలుకు ఓట్లు వచ్చి డిపాజిట్ పొగొట్టుకున్నారు. కొత్తూగూడెం నుంచి సిపిఐ సిట్టింగ్ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పోటిచేశారు. మాజీమంత్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న వనమా వెంకటేశ్వరావుకు టిక్కెట దక్కలేదు. ఆయన వైసిపి లోకి వెళ్లి కొత్తగూడెం నుంచి పోటిచేశారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో వనమా తిరిగి కాంగ్రెస్‌లో చేరి కొత్తగూడం టిక్కెట్ ఆశిస్తుండగా ఆయన తోడళ్ళుడు ఎడవల్లి కృష్ణను అక్కడ ప్రోత్సహించటం ద్వారా గ్రూపు రాజకీయాలకు తెరలేపారు. ఎడవల్లి కృష్ణ రేణుకాచౌదరి వర్గంలో ఉండగా వనమా రేణుకాచౌదరి వ్యతిరేకవర్గంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 7 రిజర్వుడ్ స్థానాలు, అందులో 5 ఎస్టీలకు 2 ఎస్సీలకు కేటాయించారు. టిక్కెట్ల కోసం సహజంగానే రాష్ట్రం నాయకత్వం ద్వారా ఢిల్లీ పెద్దలతో చెప్పించి టిక్కెట్లు పొందేలా ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ విధంగా ఎస్టీ నియోజకవర్గాల్లో వారికి టిక్కెట్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూల్ చేస్తున్నారనే విమర్శలను కాంగ్రెస్ ఎదుర్కొంటుంది. రాహుల్ నాయకత్వంలో ప్రత్యేకంగా ఎస్టీ, ఎస్సీ నియోజకవర్గాలపై దృష్టిసారించాలని ఆదేశాలు ఉన్నప్పటికి గెలుపు గుర్రాలను గుర్తించకుండా కేవలం డబ్బులు ఉన్నవారికే టిక్కెట్లు కేటాయించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పై పలువురు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో కాంగ్రెస్‌కు ఉన్న అనుకూలమైన వాతావారణాన్ని గ్రూపుతగాదాలు, టిక్కెట్ల పంపిణిలో జరుగుతున్న పరిణామాలపై ఎఐసిసి దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు.

పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలి



సూర్యాపేటప్రతినిధి, మేజర్‌న్యూస్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు పాత పద్ధతిలోనే నిర్వహించాలని సిపియం రాష్ట్ర కార్యదరిర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సీతారామ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలను పరోక్ష పద్దతులో నిర్వహిం చాలని అనడంలో అర్ధంలేదన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలను పార్టీ గుర్తులతో నిర్వహించాలనే ఆలోచను సరికాదన్నారు. పరోక్ష పద్ధతిలో ఎన్నిక కావడం వల్ల అధికార పార్టీ నాయకులు ఎన్నికైన వారిని ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో ప్రజలకు సేవ చేసేవారు నిజాయితి పరులు ఎక్కువగా పోటి చేస్తారని అలాంటి వారు పార్టీ గుర్తుల వల్ల పోటి చేయడానికి అవకాశం కోల్పోతారని అన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖలపక్ష సమావేశం నిర్వహిచాలని డిమాండ్ చేశారు. ఈసమావేశం సిపియం జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు, ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, ముల్లు నాగార్జున్‌రెడ్డి, పారెపల్లి శేక ర్, రవినాయక్, కోట రమేష్, మట్టిపెల్లి సైదులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే బీసీలకు తాయిలాలు




ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఎన్నికలు సమీపిస్తుండడంతో బీసీలకు సీఎం కేసీఆర్ తాయిలాలు ప్రకటిస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి వీ. హన్మంతరావు అన్నా రు. గత 4 సంవత్సరాలలో ఏ రోజు కేసీఆర్‌కు బీసీలు గుర్తుకు రాలేదని చెప్పారు. ఇప్పుడు బీసీల్లో చీలిక తీసుకు రావడానికి , మోస్ట్ బ్యాక్‌వార్డ్ అని కొత్త నాటకం మొదలుపెట్టారని విమర్శించారు. కేసీఆర్ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ కు నిజంగానే బీసీలపై ప్రేమ ఉంటే క్రిమీలేయర్ రద్దు చేయాలన్నారు. మంగళవారం వీహెచ్ మీడియాతో మాట్లాడుతూ గ్రామాలలో కులం పెరు మీద చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ది పొందాలని కేసీఆర్ ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లును అసెంబ్లీలో అడ్డుకుంటా మని వీహెచ్ తెలిపారు.అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యల్ని లేవనెత్తి ప్రజల పక్షాన పోరాడతామని చెప్పారు. బీసీలపై కేసీఆర్ సర్కార్ ప్రదర్శిస్తోన్న కపట ప్రేమను అర్థం చేసుకోవాలన్నారు. బీసీల అభ్యున్నతి కృషి చేస్తున్నానని చెబుతోన్న కేసీఆర్ ఎందుకు తన క్యాబినెట్ లో తగిన ప్రాధాన్యత కల్పించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజకీయ ప్రయోజనాలకంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

మండలి కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : కేంద్రం నదుల అనుసంధానం చేయాలనీ ప్రతిపాదనలు చేస్తూ బుధవారం రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేయనుందని మండలి కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. నదుల అనుసంధానికి అఖిలపక్షం ఒపీనియన్ తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో నీటి యుద్ధాలు రాకుండా ఉండా లంటే, నీళ్ళను జాగ్రత్తగా వాడుకోవా లన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రహస్య ఎజెండా ముందుకెళ్తున్నారన్న ఆయన, బాబు ఎత్తుగడల్లో తెలంగాణ ప్రభుత్వం పడొద్దని సూచించారు. రాజకీయ ప్రయోజనాలకంటే, తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యమన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు.

మన అవసరాలు తీరిన తర్వాతనే మిగితా నీటిని కిందకు వదలాలని సుధాకర్‌రెడ్డి చెప్పారు. పోలవరం రీ డిజైన్ దిశగా సర్కార్ కృషి చేయాలని కోరారు. చాలా మంది రైతుల పాస్ పుస్తకాలు బ్యాంకుల్లో ఉన్నాయన్న ఆయన, బకాయిలకింద వాటిని బ్యాంకర్లు తీసుకున్నారని చెప్పారు. బ్యాంకుల్లో బకాయిలున్న రైతుల పరిస్థితి ఏంటనీ ? ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, కంది రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

64వ రోజు ప్రజాసంకల్పయాత్ర షెడ్యూల్



తిరుపతి, మేజర్‌న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 64వ రోజు షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గంలోని వేదమాలపేట మండలం పాడిరేడులో ఉదయం ఎనిమిదిన్నర గంటలకు బుధవారం వైఎస్ జగన్ పాదయాత్ర ప్రారంభించనున్నారు. పాడిరేడు నుంచి తాత్నేరి గిరిజన కాలనీ, లక్ష్మమ్మ కండ్రిగ, టీసీ అగ్రహారం మీదుగా కొనసాగి 11 గంటలకు శ్రీకాళహస్తి నియోజకవర్గం యేర్పేడు మండలంలోని ఆర్‌వీ కండ్రిగ చేరుకుంటారు. పెనుమల్లాం, పాపనాయుడు పేట, మర్రిమంద బీసీ కాలనీ మీదుగా విక్రుతమల వరకు యాత్ర కొనసాగుతోంది. సాయంత్ర అక్కడే బుధవారం యాత్ర ముగించి వైఎస్ జగన్ రాత్రికి బస చేస్తారు.

ఎడ్యుకేషన్ హబ్ ప్రారంభించనున్న కేసీఆర్


నేడు మెదక్, గజ్వేల్ జిల్లాలలో పర్యటన
అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బుధవారం నాడు మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పర్యటించ నున్నారు. రెండు జిల్లాల్లో అభిద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించనున్నారు. గజ్వేల్‌లో ఎడ్యుకేషన్ హబ్, 100 పడకల ఆస్పత్రి, గజ్వేల్‌లో ఆడిటోరియం, ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను పరిశీలించనున్నారు. అలాగే రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని సైతం పరిశీలించనున్నారు. తూప్రాన్‌లో 50 పడకల ఆస్పత్రిని, మర్కుక్‌లో వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించనున్నారు.

నవ్యాంధ్రకు కొత్త గవర్నర్‌ను నియమించండి

బీజేపీ ఎంపీ కె.హరిబాబు




విశాఖపట్టణం, మేజర్‌న్యూస్ : కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు పార్లమెంటు సభ్యుడు హరిబాబు లేఖ రాశారు. నవ్యాంధ్రకు కొత్త గవర్నర్‌ను నియమించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే హైకోర్టు కోసం ప్రభుత్వం భవనాలను అన్వేషిస్తోందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను దృష్టిలో ఉంచు కుని హైకోర్టు ఏర్పాటుకు వెంటనే చొరవ తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. ఇదిలా ఉండగా ప్రస్తుత గవర్నర్ నరసింహన్ ఆంధ్రప్రదేశ్‌పై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇప్పటికే పత్రికా ముఖంగా విమర్శలు చేశారు. ఇప్పుడు అదే పార్టీకి చెందిన ఎంపీ హరిబాబు కేంద్ర హోంమంత్రికి లేఖ రాయడంతో ఇప్పుడు ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

26న పంచాయతీరాజ్ అవార్డుల ప్రదానం

అమరావతి,సూర్యబ్యూరో: స్టార్ రేటింగ్ ఆధారంగా జిల్లా, మండల, గ్రామాలకు అవార్డులు ఇవ్వాలని పంచా యతీ రాజ్ శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో వీటిని ఎంపిక చేసేందుకు కమిటీని నియమిస్తూ పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికీ విద్యుత్ గ్యాస్, కుళాయి కనెక్షన్, ఘనవ్యర్థాల నిర్వహణ, రోడ్డు, ఫైబర్‌నెట్ కనెక్టివిటీ, కుటుంబానికి నెలకు రూ.10 వేల ఆదాయం, విద్యకు సంబంధించి జీరో డ్రాపవుట్, పాఠశాలలకు మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, ఆరోగ్యం, పోషకాహారానికి సంబంధించి ఇమ్యునైజెషన్, ఆసుపత్రి కాన్పులు తదితర వసతులు కలిగిన గ్రామాలకు స్టార్ రేటింగ్ ఇస్తారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ జిల్లా, మండలాలు, గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించారు.

కర్రసాముతో జోష్‌నింపిన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్



కృష్ణా, సూర్యబ్యూరో: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సందడి చేశారు. పండుగ వేడుకల్లో కర్ర సాము చేసి అందరిలో జోష్ నింపారు. చాలాసేపు కర్రతిప్పి యువకు లకు తీసిపోనని నిరూపించారు. సంక్రాంతి సంబరాలు యువకులు, మహి ళలు నిర్వహించారు. ఈ సంబరాల్లో మాజీ మంత్రి నెట్టెం తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో హైటెక్ సెక్స్ రాకెట్

హైదరాబాద్, సూర్యప్రతినిధి : నగరపోలీసులు జూబ్లీహిల్స్‌లో హైటెక్ సెక్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు చేశారు. ప్రశాసన్ నగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రధాన సూత్రధారి ఫయాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫయాజ్ రెండేళ్లుగా ప్రశాసన్‌నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ముంబై, రష్యా,గోవాకుచెందిన ముగ్గురు యువతులున్నట్లు పోలీసులు గుర్తించారు.

రైతన్నలకు ఉచితంగా 15 లక్షల పంపుసెట్లు : సీఎం చంద్రబాబు

(అమరావతి సూర్య ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు ఇంధన పొదువు పంపుసెట్లను ఉచితంగా ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల పాత పంపుసెట్ల స్థానంలో దశలవారీగా వీటిని అందజేయనుంది. 2018 -19 ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల 5 స్టార్ పంపుసెట్లు అంద జేసేం దుకు విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

"రైతులకు రూ. 40 వేల విలువైన ఇంధన పొదువు పంపుసెట్‌లను ఉచితంగా అందజేసే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రం, దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే నని ప్రకటించడం నాకు గర్వంగా ఉంది. రైతన్నలకు ఇది సంక్రాంతి కానుక. మొబైల్‌తో పనిచేసే ఈ పంపుసెట్లతో రైతులకు లబ్ధి చేకూరుతుంది.

అర్ధరాత్రులు పొలాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. పాము కాట్లు వంటి ప్రమాదాలు తప్పుతాయి. వీటికి ఐదేళ్ల వరకు ఎలాంటి నిర్వహణ, మరమ్మతుల ఖర్చులుండవు. దాదావు 30 శాతం విద్యుత్ ఆదా అవు తుంది" అని ముఖ్యమంత్రి తెలిపినట్లు ఇంధన శాఖ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

రైతులకు రూ. 55 వేలకే సౌర పంపుసెట్

భూగర్భజలాలు 75 మీటర్ల లోవు ఉన్న ప్రాంతాల్లో రైతులకు సౌర పంపు సెట్లు అందించేందుకు ఇంధన శాఖ చర్యలు చేపట్టింది. ఒక్కో పంపుసెట్ విలువ రూ. 3.12 లక్షలు కాగా, ఇందులో ప్రభుత్వం రూ. 2.57 లక్షలు భరిస్తుంది. రైతులు రూ. 55 వేలు చెల్లిస్తే సరిపోతుంది.



కోట్లకు పడగలెత్తిన కోడి పందాలు

- **పశ్చిమ గోదావరి జిల్లాలో జోరుగా పేకాట, గుండాట ఏరులై పారిన మద్యం**
- **ప్రజాప్రతినిధుల చొరవతో యధేచ్ఛగా 'సాంప్రదాయ' క్రీడలు**

ఏలూరు, సూర్యబ్యూరో : పశ్చిమ గోదావరి జిల్లాలో మంగళవారం కనుమ పండుగ రోజున జిల్లా వ్యాప్తంగా కోడి పందాలు జోరుగా సాగాయి. స్వల్ప ఉద్రిక్తతలు, పోలీసు, రెవెన్యూ బృందాల అటకాయింపులు మధ్య డింకీ పందాలతో ప్రారంభమై చివరకు కోడి పందాలు ముమ్మరంగా సాగాయి. జిల్లా కేంద్రమైన ఏలూరునుండి ప్రారంభమై అన్ని నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా కోడి పందాలు జరిగాయి. దీనితో పాటు పేకాట, గుండాట, ఇతర జూద క్రీడలు యధేచ్ఛగా జరిగాయి. జిల్లాకు చివర ప్రాంతమైన కుక్కునూరు వరకు కోడ పందాలు జరిగాయి. ఏలూరు మండలంలోని కొమడవోలు, హనుమాన్ నగర్, పెదపాడు మండలంలోని అప్పనవీడు గ్రామంలో కోడి పందాలు యదేచ్ఛగా జరిగాయి. గుండుగొలను, దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండ లం లోను, చింతలవూడి నియోజకవర్గంలోని లింగపాలెం, చింతలవూడి, జంగారెడ్డి గూడెం, పోలవరం నియోజవర్గంలోను, తాడేపల్లిగూడెం, నిడదవో లు, కొవ్వూరు, ఉండి, భీమవరం, పాకొల్లు, తణుకు తదితర అన్ని నియోజక వర్గాల్లో కోడి పందాలు ముమ్మరంగా సాగాయి. ఒక్క గుండుగొలను గ్రామం లోనే మంగళవారం రూ.4 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు సమాచారం. గత మూడు రోజులుగా జరుగు తున్న ఈ పందాల వలన జిల్లాలో రూ.100 నుండి రూ. 150 కోట్ల మధ్య లావాదేవీలు జరిగినట్లు భావిస్తున్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ కూడా ఏమ్రాం నిర్వాహకులు లెక్కచేయకుండా బరుల ప్రాంతంలో గుండాట, పేకాట వంటి జూద క్రీడలు నిర్వహించారు. లింగపాలెం మండలంలో కూడా కోడి పందాలు జరిగాయి. విలీన మండలమైన కుక్కునూరు మండలంలో కూడా యధేచ్ఛగా జరిగాయి. జంగారెడ్డిగూడెం మండలంలో కూడా కోడిపందాలు జరిగాయి. ఈ విధంగా పశ్చిమ గోదావరి జిల్లాలో దాదావుగా అన్ని ప్రాంతాలలో కోడి పందాలు జరిగి కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కోడి పందాలు జరుగుతున్న ప్రాంతం లో మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోళ్ళకు కత్తులు కట్టి వాటిని రెచ్చ గొడుతూ పందాలకు కాలు దువ్వే విధంగా ప్రోత్సహించడం, పందాలలో పాల్గొనడం, బెట్టింగులు పాల్పడడం విశేషం. భారీ స్థాయిలో డబ్బు ఖర్చుచేసి పందాలలో పాల్గొన్నారు. ఆకివీడు ప్రాంతంలో భూములు కూడా పందాలలో కాశారంటే పందాలు ఏ స్థాయిలో జరిగాయో ఊహించవచ్చు. ఈ పందాలను సాంప్రదాయ బద్దంగా భావిస్తూ, వాటిని తిలకించడానికి జిల్లాకు చెంది దేశ, విదేశాలలో నివసిస్తున్న పలువురు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని సంక్రాంతికి స్వగ్రామానికి చేరుకున్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాలనుండి పెద్దఎత్తున జనం వారి వారి ప్రాంతాలకు చేరుకుని పండుగను ఆనందంగా ఆస్వాదించారు.



కనిపించని పోలీసులు, మండలస్థాయి కమిటీలు

కోడి పందాలు జిల్లాలో జరగనివ్వమంటూ, సుప్రీం కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఖచ్చితంగా పాటిస్తామంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం కోడ పందాలు బహిరంగంగా జరుగుతున్నా మొదటి రోజున స్పందించినంతగా తరు వాత కన్పించక పోవడం పట్ల ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల జోక్యాన్ని ప్రభుత్వం ఆమోదించినందువల్లే పోలీసులు, మండలస్థాయి ప్రత్యేక కమిటీలు నిస్సహాయ స్థితిలో ఉన్నాయని ప్రజలు



చెపకుంటున్నారు. కోడిపందాల సమాచారాన్ని స్థానిక విఆర్‌ఓలు, పంచాయితీ కార్యదర్శులు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కాటంనేని భాస్కర్ ఇచ్చిన ఆదేశాలుకూడా పందాల నిర్వాహకులు లెక్క చేయలేదు. పోలీసు బలగాలు కేవలం పేకాట శిభిరాలపై దాడులుచేసి నగదు, వాహనాలను స్వాధీనం చేసుకుని కొందరిని అదుపులోకి తీసుకోవడం మినహా గుండాట తదితర జూద క్రీడలను నివారించలేకపోయారు. ఇక మద్యం అమ్మ కాలు జిల్లాలో జోరుగా సాగాయి. గత మూడు రోజులుగా అమ్మకాలు విపరీ తంగా పెరిగాయి. మంగళ, బుధ వారాల్లో కనుమ, ముక్కనుమ పండుగ దినా లు కావడంతో మద్యం షావుల వద్ద రద్దీ పెరిగింది. కొన్ని షావుల వద్ద కొందరు మహిళలు కూడా మద్యం కొను గోలు చేయడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతాల్లో నాటు సారాకూడా జోరుగా విక్రయాలు జరిగాయి, మద్యం బెల్టు షావులు కళకళలాడాయి. మాంసాహార విక్రయాలు పెద్దఎత్తున జరిగాయి. చికెన్, మటన్, బిర్యాని సెంటర్లు పోటీలు పడి మరీ విక్రయాలు చేయడం విశేషం. కోడి పందాల ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో విక్రయాలు, కోడి పందాలు గత రెండు రోజులుగా ఫ్లడ్ లైట్ల వెలుగులో అక్కడక్కడా జరిగాయి. ఈ విధంగా జిల్లాలో కోడి పందాలు ముమ్మరంగా, ప్రతి ఏటా జరిగిన విధంగానే సాంప్ర దాయ బద్దంగా జరిగాయి.

తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు

రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు




అమరావతి, సూర్యబ్యూరో : సంక్రాంతి పండుగను ముగించుకుని సొంత ఊర్ల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం తది తర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యే బస్సులు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కె. అచ్చెన్నా యుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ ను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు. ఆర్టీసీ సంస్థ కూడా ప్రత్యే బస్సులను ఏర్పాటుచేసిందని, ప్రయాణి కులు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి కోరారు.

కృషానదిలో పడవ బోల్తా, తృటిలో తప్పిన ప్రమాదం



విజయవాడ, సూర్య బ్యూరో : కష్ణాజిల్లాలో ఎదురుమొండి దీవుల వద్ద కష్ణానదిలో ప్రమాదం తప్పింది. 20 మందితో ప్రయాణిస్తున్న నాటు పడవ బోల్తా పడింది. అయితే అక్కడ ఉన్న మత్స్యకారులు అప్రమత్తమై అందరినీ కాపా డారు. ఈ దీవుల వద్ద రోజు ప్రయాణికులను దాటించే పంటును పడవ పోటీల కోసం అధికా రులు తరలించారు. దీంతో గత్యంతరం లేక నాటు పడవల్లో కష్ణానదిపై మూడు పంచాయతీల గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సామర్థ్యాన్ని మించి నాటు పడవల్లో ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. 20 మందితోపాటు నాలుగు బైకులు, ఇతర సామాగ్రిని ఎక్కించారు. ఈ ప్రమాదంలో 20 మందిని సురక్షితంగా కాపాడారు. అయితే బైకులు, సామాగ్రి నీట మునిగి పెను ప్రమాదం తప్పింది.

చిత్తూరును కరువు రహితంగా తయారుచేస్తా




(చిత్తూరు సూర్య ప్రతినిధి) : చిత్తూరు జిల్లాను కరువు రహితంగా తయారు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం నారావారిపల్లి లో ఆయా అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదన పల్లెను టమాటా హబ్‌గా రూపొం దిస్తామన్నారు. అలాగే చిత్తూరులో సెరీ కల్చర్, డెయిరీకి ప్రాధా న్యమిస్తామని, అలాగే జిల్లాలో 100 శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రజలను కోరారు. అంతేగాక జిల్లాలో టూరిజాన్ని ప్రోత్సాహిస్తామని, ఫుడ ప్రాసెసింగ్, హార్డ్‌వేర్, ఐటీకి ప్రాధాన్యమిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే సంస్క తి, సంప్రదాయాలు మనకు వరం అని సీఎం అన్నారు.

త్వరలో టీటీడీ పాలకమండలిని నియమిస్తాం...

తిరుమల తిరుపతి దేవస్థానానికి త్వరలో పాలకమండలిని నియమిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ఆదాయం పెంవునకు మార్గదర్శ కాలు రూపొందిస్తామన్నారు టీటీడీ చైర్మన్‌గా వుట్టా సుధాకర్ యాదవ్‌ను నియమిస్తారని వస్తున్న వార్తలను సీఎం చంద్రబాబు తోసివుచ్చారు.

అగ్నిప్రమాదంలో 150 మంది టెన్త్ సర్టిఫికెట్ల దగ్ధం



(అమరావతి సూర్య ప్రతినిధి) : గుంటూరు లోని సుబ్బయ్యతోటలో ఉన్న జీఆర్ జూనియర్ కళాశాలలో అగ్నిప్రమాదం జరిగింది. కళాశాల కార్యాలయం గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఫర్నిచర్, బీరువా, ఆఫీసు రికార్డులతో పాటు 150 మంది విద్యార్థులకు సంబంధించిన పదో తరగతి సర్టిఫికెట్లు కాలిపోయాయి. ఆస్తి నష్టం రూ.70 వేల వరకు ఉంటుందని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు.

26న పంచాయతీరాజ్ అవార్డుల ప్రదానం

విజయవాడ, సూర్యబ్యూరో : స్టార్ రేటింగ్ ఆధారంగా జిల్లా, మండల, గ్రామాలకు అవార్డులు ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో వీటిని ఎంపిక చేసేందుకు కమిటీని నియమిస్తూ పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికీ విద్యుత్, గ్యాస్, కుళాయి కనెక్షన్, ఘనవ్యర్థాల నిర్వహణ, రోడ్డు, ఫైబర్‌నెట్ కనెక్టివిటీ, కుటుంబానికి నెలకు రూ.10 వేల ఆదాయం, విద్యకు సంబంధించి జీరో డ్రాపవుట్, పాఠశా లలకు మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, ఆరోగ్యం, పోష కాహారానికి సంబంధించి ఇమ్యునైజేషన్, ఆసుపత్రి కాన్పులు తదితర వసతు లు కలిగిన గ్రామాలకు స్టార్ రేటింగ్ ఇస్తారు. జనవరి 26న గణతంత్ర దినోత్స వాన్ని పురస్కరించుకుని ఉత్తమ జిల్లా, మండలాలు, గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేయాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ కమిషనరేట్ లో అదనవు కమిషనర్ పోస్టును మంజూరు చేస్తూ ఆ శాఖ ఆదేశాలిచ్చింది.

కామేపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- **రూ. 43.8 కోట్లతో గ్రామంలో మౌలిక వసతులు**
- **పేదల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం**
- **లోటు బడ్జెట్‌లోనూ సంక్షేమ పథకాలు అమలు**
- **పండుగ ఆనందంగా జరుపుకోవాలనే 'చంద్రన్న సంక్రాంతి కానుక'లు**
- **కామేపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ, శిద్ధా రాఘవరావు**
- **కామేపల్లి గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తాం - మంత్రి శిద్ధా**

కొండేపి, మేజర్‌న్యూస్ : ప్రతీ గ్రామంలో కావాల్సిన అన్నీ రకాల మౌళిక వసతులు, సంక్షేమ వసతులు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం తన స్వగ్రామం జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కా మేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తన వంతు పూర్తి సహకారం అంది స్తానని తెలిపారు.

రూ 43.8 కోట్ల నిధులతో కామేపల్లి గ్రామానికి అవసరమైన సిసి రోడ్లు, మురికి కాలువలు, పాఠశాల భవన నిర్మాణాల వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలో ఇంకా రూ 50లక్షల రూపాయల పార్లమెంట్ సభ్యులు సుజనా చౌదరి ద్వారా నిధులు మంజూరు చేసి కామేపల్లి గ్రామంలో వంద శాతం సిసి రోడ్లు పూర్తి చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో గల జిల్లా పరిషత్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని త్వరలోనే మంజూరు చేయించి జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కామేపల్లి గ్రామానికి లైబ్రరీ కావాలని ప్రతిపాదనలు తన దృషికి తీసుకొచ్చారని అదే విధంగా కొండేపి శాసన సభ్యుల అభ్యర్ధన మేరకు ఒక లైబ్రరీ మంజూరుకు విజ ప్తి చేశారని తెలుతూ మొత్తం 2 లైబ్రరీలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్ధుల సంఖ్య ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా హాస్టల్స్‌ను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వం న్యాయం పద్దతి లేకుండా రాష్ట్రాన్ని విడగొట్టారని, 17 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిందని తెలుపుతూ లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పాదయాత్రలో అన్నీ వర్గాల ప్రజలు సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారని తెలుపు తూ ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన అన్నీ అంశాలను ప్రస్తుతం అమలు చేస్తున్నారన్నారు.

ప్రతీ పేదవాడు ఆనందంగా సంతోషంగా పండుగలు నిర్వహించు కోవాలన్న ఉద్ధేశ్యంతో్నే చంద్రన్న సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, చంద్రన్న రంజాన్ తోఫా వంటి కార్యక్రమాలు చపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఏదో ఒక ప్రయోజనం పొందుతన్నదని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ 65 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపడ్తున్నామన్నారు.

కామేపల్లి గ్రామానికి ఆడపల్లిల చదువుకోసం బస్ ఏర్పాటుకు వినతి పత్రం అందజేశారని వారి అభ్యర్ధన మేరకు బస్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కామేపల్లి గ్రామానికి అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి రూ 4కోట్ల 60 లక్షలతో ప్రతిపాదనలు పంచాయితీ రాజ్ శాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

రాష్ట్ర పురపాలన పట్టణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పి నారాయణ సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ అనేక పండుగల్లో తెలుగువారికి అత్యంత ప్రాధ్యనత కల్గినది సంక్రాంతిపండుగ అన్నారు. భోగి రోజు పాత వాటికి చరమ గీతం పాడుతూ కొత్త దానికి నాంది పలకడం చలికాలం పూర్తిగా భోగి రోజుతో ముగుస్తుందని తెలిపారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబు నాయుడు చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ పాత సంప్రదాయ పద్దతులకు శ్రీకారం చుట్టవల్సిన ఉందన్నారు. ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను బాధ్యతగా ముందుకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి పాత సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి సంబరాలు కార్యక్రమం ద్వారా పునర్జన్మ చేసేలా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కామేపల్లి గ్రామంలో సంక్రాంతి శోభ బ్రహ్మండంగా కన్పిస్తుందన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తలో రూ 150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కామేపల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.


కొండేపి శాసన సభ్యులు బాల వీరాంజనేయస్వామి కామేపల్లి గ్రామంలో నిర్వహించి యసంక్రాంతి సంబరాలు కార్యక్రమానికి అధ్యక్షతవహించి మాట్లాడుతూ అంతరించిపోతున్న సాంప్రదాయలను కామేపల్లి గ్రామంలో గుర్తు చేసుకోవడం వాటినన్నింటికి ఒక వేదికపై తిలకించడం జరిగిందన్నారు.



కార్యక్రమంలో కామేపల్లి సర్పంచ్ రాంబాబు పాల్గొని మాట్లాడుతూ రామతీర్థం జలాలు జరుగుమల్లి మండలానికి వచ్చేలా చర్యలు చేపట్టి త్రాగు నీటి కష్టాలు తీర్చాలని మంత్రి దృష్టికి తీసుకొనిచ్చారు.

తొలుత రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖ మంత్రి కామేపల్లి గ్రామంలోని స్వగ్రామంలో హరిదాసులు, గంగిరెద్దులు, పగటివేషగాళ్ళు, జంగమదేవరులు, యక్షగాన కళాకారుతో నిర్వహించిన కార్యక్రమాలను మంత్రి కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రి పి నారాయణ వారి కుటుంబ సభ్యులు, కొండేపి శాసన సభ్యులు తిలకించిన కళాకారులను అభినందించారు. కామేపల్లి గ్రామంలో పోలేరమ్మ దేవాలయంలో గంటా శ్రీనివాసరావు, పి నారాయణ, కందుకూరు, కొండేపి, గిద్దలూరు శాసన సభ్యులు పూజలు నిర్వహించారు. మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదగా కామేపల్లి గ్రామం లోని పోలేరమ్మ దేవస్థానంలో అతిథి గృహ నిర్మాణానికి అలాగే దామచర్ల ఆంజనేయులు, సక్కుబాయమ్మ అతిథి గృహానికి శంఖుస్థాపన చేశారు. సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ చలమలశెట్టి రామానుయ, కందుకూరు శాసన సభ్యులు పోతుల రామారావు, కందుకూరు మాజీ శాసన సభ్యులు దివి శివరాం, గిద్దలూరు శాసన సభ్యులు అశోక్‌రెడ్డి, డీఈవో సుబ్బారావు, ఎస్ఎస్ఓ ప్రాజెక్టు ఆఫీసర్ ఎమ్ వెంకటేశ్వరరావు, ఆర్‌జెడీ కె శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఐ కొమటి జయరాం, బ్రాహ్మణ కార్పొరేషన్ కన్వీనర్ కె కుసుమ కుమారి, డిప్యూటి డీఈవోలు, దామచర్ల సత్య, విద్యార్ధినీ విద్యార్ధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో అనూహ్య రద్దీ



(తిరుమల సూర్య ప్రతినిధి) : తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగు తోంది. సంక్రాంతి సెలవులు కావడంతో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, ప్రసాదం కౌంటర్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. స్వామి వారి ని దర్శించుకునే భక్తులతో కంపార్టుమెంట్లన్నీ నిండి, భక్తులు కంపార్ట్ మెంట్ల వెలుపల వేచి ఉన్నారు. ఉదయం నుంచే భక్తులు రోడ్డుమార్గాలు, నడక దారుల్లో తండోప తండాలుగా తరలివచ్చారు. దీంతో తిరుమల వురవీధులన్నీ భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనానికి కాంప్లెక్స్ నిండి వెలుపల 3 కిలోమీటర్ల వరకు క్యూలైను వ్యాపించింది. నారాయణగిరి ఉద్యానవనం, రోడ్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోనూ సందడి నెలకొంది. దీంతో సర్వదర్శ నానికి దాదావు 20 గంటలు పడుతోందని అధికారులు ప్రకటించారు. శ్రీవారి దర్శనానికి రద్దీ కొనసాగుతుంది. కంపార్టుమెంట్లన్ని నిండి వెలుపలికి క్యూ లైన్లు వచ్చాయి. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడు తుందని, శ్రీవారి హుండీ ఆదాయం రూ. 2.94 కోట్లు టీటీడీ అధికారులు తెలిపారు.


24న లాంఫాంలో కిసాన్ మేళా

(అమరావతి సూర్య ప్రతినిధి) : లాం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈ నెల 24న కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ డాక్టర్ పావులూరి రత్నప్రసాద్ తెలిపారు. కిసాన్‌మేళా సందర్భంగా లాం పరిశోధన కేంద్రంలో ఆధునిక వ్యవ సాయ పరికరాలతో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. కార్యక్రమాన్ని వ్యవ సాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చావేదికను నిర్వహిస్తున్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు, మంత్రులు ప్రత్తిపాటి వుల్లారావు, నక్కా ఆనంద బాబు సదస్సులో పాల్గొంటారని ఏడీఆర్ డాక్టర్ రత్న ప్రసాద్ వివరించారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడటానికి ప్రభుత్మం కృషి

ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి

(వుట్టపర్తి సూర్య ప్రతినిధి) : తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిం చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె ముగ్గుల పోటీలు, సాంస్క తిక ప్రదర్శనల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందరేంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేం దుకు ఆయా ఉత్సవాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. అర్హులందరికి వంద శాతం సంక్షేమ పథకాలు అందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని అతిపెద్దదైన బుక్కపట్నం చెరువు కు నీళ్లు తెచ్చామని, తద్వారా 250 గ్రామాలకు తాగునీటి కొరత తీరందని చెప్పారు. మరోవైవు 10 వేల బోర్లు రీచార్జ్ అయ్యాయన్నారు. అనంతరం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సంబరాలు ఘనంగా నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించారు. వెంగళమ్మచెరువు గ్రామ పరిధిలోని వీరాంజనేయపల్లి వద్ద రూ.8 కోట్లతో డ్యాం నిర్మించడానికి ఛీఫ్‌విప్



పల్లె నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీ-2 ఖాజామొహీద్దీన్, ఆర్డీఓ రామ్మోహన్, ఆదినారాయణరెడ్డి, చెన్నకేశవులు, దామోదర్, రఫీ, సుధాకర్, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



విజయవాడ, సూర్య బ్యూరో : సంక్రాంతిని వురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చే సిన జనసేన పార్టీ రాష్ట్ర కార్యకర్త పోతిన వెంకటమహేష్ రంగవల్లు లన్నింటిని పరిశీలించి మహిళలందరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పోటీలో పాల్గొన్న వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న అందరికీ ప్రత్యేక బహుమతులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదా యాలను కాపాడుతూ పండుగను మంచి వాతావరణంలో జరువుకోవడం చాలా ఆనం దంగా వుందన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ నాయకులు ఆత్మారాం, రజనీకాంత్, హరీష్, మద్దిల రామకృష్ణ, దుర్గాంబ, వడ్డాది రాజు, వడ్డాది రమణ, సోము గోవిందు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సంక్రాంతి సంబరాల్లో హారతి



విజయవాడ, సూర్య బ్యూరో : సంక్రాంతి జీవన వారసత్వ సంబరాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమరే శ్వర స్నానఘాట్ వద్ద కష్ణమ్మ కు హారతు లను సమర్పిం చారు. విద్యుత్ దీపాలు, వూలతో అలంక రించిన ప్రత్యే క స్టేజీ లపై అర్చకులు ధూప, నంది, నాగ, నక్షత్ర, ఏక హారతులను పవిత్ర కృష్ణా నదికి సమర్పించారు. ఐదుగురు అర్చకులు ఏక రూప దుస్తులు ధరించి హారతులను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. తొలుతద కృష్ణమ్మకు పసువు కుంకుమ సమర్పించారు. స్థానికుల అధికసంఖ్యలో పాల్గొని కనులారా వీక్షించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ వారసత్వ సలహాదారు గల్లా అమరేశ్వర్, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలి

కర్నూలు బార్ అసోషియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మీ

ఆదోని, సూర్యబ్యూరో: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలని కర్నూ లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి దేవి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆదోని డివిజన్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లా డుతూ దశాబ్దాలుగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పాలకులు, అధికారులు రాయలసీమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కోస్తా ప్రాంతాలకు వివిధ సంస్థలు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం గళం విప్పకపోతే భావితరాలు మనల్ని నిందించే అవకాశం ఉందన్నారు. అందువల్ల అంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీబాగ్ ఒప్పందం ఒప్పందం ఉల్లంఘించారన్నారు.

సూర్య
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
9




సూర్య




ధీర
VOICE OF WOMEN

కార్ హీటర్‌ను కనుగొన్న మార్గరేట్ ఎ విల్కన్స





"మన నిత్య జీవితంలో డిష్ వాషర్, వాషింగ్ మెషీన్ లాంటివి ఇళ్లలో వాడుతుంటాం, ఇప్పుడంటే టెక్నాలజి అభివృద్ధి చెందింది. ఎన్నో రకాల కార్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, గతంలో ఉపయోగించే కార్లులో హీటర్ అతిముఖ్యమైనదే ఇది లేకుండా కార్లు నడవవు. అయితే, వీటిని కనుగొన్నది ఎవరు అని ఎవరైనా మిమ్మల్ని ప్రశ్నించే సందర్భం ఎదురైతే మాత్రం ఖచ్చితంగా చెప్పలేం. ఎప్పుడు కనుగొన్నారు అంటే ఆ వ్యక్తులు ఎవరో కొంతమందికి మాత్రమే తెలుస్తుంది. రోజు మనం ఉపయోగించే వస్తువులను ఎవరు కనుగొన్నారో.. ఎప్పుడు కనుగొన్నారో తప్పకుండా అందరూ తెలుసుకోవాలి. మనం ఉపయోగించే వస్తువులు ఎవరు ఎప్పుడు కనిపెట్టారో తెలియకుండా వాడటం అంటే అది వారిని అవమానించినట్టే కదా."





మనం నిత్యం జీవితంలో వాడుతున్న డిష్ వాటర్, వాషింగ్ మిషిన్, కార్ హీటర్ ను కనుగొన్నది ఒక మహిళ అంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ ఇది నిజం. 1838 వ సంవత్సరంలో అమెరికాలోని చికాగోలో జన్మించిన మార్గరెట్ ఎ విల్కన్స్ అప్పట్లోనే మెకానికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ చేసింది. అయితే, కొత్త వస్తువులు కనుక్కోవాలి అనే తపనే ఆమె పేరు చరిత్రలో నిలిచిపోయేలా చేసింది.

ఆటోమొబైల్స్ రంగంలో తాపన వ్యవస్థద్వారా నీళ్ళను వేడి చేసే లక్ష్యంతో రూపొందించి కార్ హీటర్‌తో ఉష్ణోగ్రతలు పెంచేలా ఆవిష్కరణ జరిపారామె. ఆ రోజుల్లో కార్లు ఇంజన్లు త్వరగా వేడెక్కి పోతూ ఉంటంతో చాలా సమస్యలు సృష్టించేవి. ఈ తరహా సమస్యలెదుర్కొని రోడ్లపై అనేక కార్లు నిలచిపోయి, వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులను దగ్గర నుంచి గమనించిన మార్గరెట్ దానికి పరిష్కారంగా కారు హీటర్ కనిపెట్టింది. 1893 నవంబర్‌లో ఆమె కనుగొన్న కార్ హీటర్ కు పేటెంట్ లభించింది. అనతి కాలంలోనే ఈ వ్యవస్థని ప్రపంచ ఆటోమొబైల్ రంగం సొంతం చేసుకుంది. నేటికీ పాత కార్లలో ఈమె రూపొందించిన కార్ హీటర్ తరహా హీటర్లనే వాడుతుండటం విశేషం. ఆటోమొబైల్ పరిశ్రమలో మహిళలు ప్రవేశించేందుకు మార్గరెట్ ఎ విల్కన్స్ ప్రేరణగా నిలిచారనటంలో సందేహంలేదు.

జుత్తు రాలుతోందా..?

వెంట్రుకలు, గోళ్ళు, చర్మం అన్ని ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉన్నామని చెప్పవచ్చు. సూటిగా చెప్పాలంటే- వ్యక్తి యొక్క ఆరోగ్యానికి సూచికలుగా వీటిని పేర్కొనవచ్చు. వెంట్రుకల పెరుగుదల ఆరోగ్యంగా ఉంటె, మీరు అందంగా కనపడతారు. ఒకవేళ మీ జుట్టు రాలిపోతుంది అంటే మీరు వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో భాదపడుతున్నారని అర్థం. రోజు రోజుకీ మారుతున్న వాతావరణం, పెరుగుతున్న కాలుష్యం, జన్యు సంక్రమణ, వివిధ రకాల కారణాల వలన జుట్టు రాలటం సాధారణం అని చెప్పవచ్చు. కానీ కొన్ని చిట్కాలను అనుసరించటం వలన జుట్టు రాలటాన్ని తగ్గించవచ్చు



సాధారణంగా కాలుష్య వాతావరణంలో తిరగటం వలన జుట్టుపై దుమ్ము, ధూళి చేరి, జుట్టు వివిధ రకాల ఇన్ఫెక్షన్‌లకు గురవుతుంది అవునా! ఫలితంగా జుట్టు రాలిపోతుంది కావున ఎప్పటికవుడు మీ జుట్టును శుభ్రంగా ఉంచుకోండి.

మీ జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల నియమాలను అనుసరించండి. తాజా పండ్లు మరియు కూరగాయాలను (జుట్టు పెరుగుదల కు అవసరమయ్యే విటమిన్", కాల్షియం, జింక్) తినండి. ఎల్లవుడు ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాలను (వెంట్రుకలు ప్రోటీన్ నిర్మితం) మరియు అధిక మొత్తంలో నీటిని తాగండి.

అంతేకాకుండా, జుట్టు కడగటానికి గోరు వెచ్చని నీటిని మాత్రమె వాడండి, వెంట్రుకలకు వాడే షాంపూ, నాణ్యమైనదిగా ఉండేలా చూసుకోండి. షాంపూ తో కడిగే సమయంలో, వెంట్రుకల మొదల్లపై మరియు ఫాలికిల్‌లపై మీ దృష్టిని కేంద్రీకరించండి. అదేవిధంగా, కండిషనర్ లేదా జుట్టు సంబంధిత లోషన్‌లను వాడే సమయంలో జుట్టు కొనలపై దృష్టి సారించండి.

అంతేకాకుండా, ఎప్పటికవుడు సమయానికి అనుగుణంగా, మీ జుట్టు కోనలను కత్తిరించండి. ఫలితంగా, అవి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, పెరుగుదలలో కూడా మెరుగుపడుతుంది.

జుట్టు స్టయిల్‌గా కనపడేలా చేయటానికి వాడే వివిధ రకాల పరికరాలు, జుట్టును లాగి ఉంచుటకు ఉపయోగించే బాండ్ వంటివి (బాండ్స్, పోనిటైల్) వాడటం వలన వెంట్రుకల మోదళ్ళపై ఒత్తిడి కలిగి, ఫాలికిల్‌లి పాడయ్యే అవకాశం ఉంది. ఫలితంగా జుట్టులో పెరుగదల లోపాలు లేదా రాలిపోవటం జరుగుతుంది.

రసాయనిక ఉత్పత్తుల (హెర్బల్ ఉత్పత్తులు అయినను) వాడకం వలన వాటి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది. వీటిలో రసాయనికాలతో కూడిన స్ట్రెయిట్నర్స్, హాట్-ఆయిల్ ట్రీట్మెంట్, హాట్ ఐరోనింగ్ వంటి వాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండండి.

డ్రయర్‌లను వాడే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోండి. అనగా అధిక వేడి మరియు స్పీడ్‌లతో ఉన్న డ్రయర్‌ను వాడటం వలన జుట్టు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది అందువలన జుట్టు తడిని పోగొట్టటానికి వేరే పద్దతులను అనుసరించండి లేదా డ్రయర్ యొక్క వేడి మరియు వేగాన్ని తగ్గించి జుట్టు యొక్క తడిదానాన్ని పోగొట్టండి.

వెంట్రుకలపై ఒత్తిడితో దువ్వటం వలన జుట్టు ప్రమాదానికి గురయ్యి, తెగిపోయే అవకాశం ఉంది. కావున ఎక్కువ ఖాళీలు ఉన్న దువ్వెనతో, నెమ్మదిగా దువ్వండి.

మీ జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి హెన్న పేస్ట్, పెరుగు, నానబెట్టిన మెంతులను, మందార పువ్వులను లేదా గుడ్డు వంటి ఇంట్లో సాధారణంగా లభించే ఔషదాలలో ఏదోక ఔషదాన్ని ఎంచుకొని షాంపూ వాడటానికి ముందుగా వాడండి. వీటిని క్రమంగా వాడటం వలన మీ జుట్టు బలంగా మరియు చూడటానికి అందంగా కనపడుతుంది. కానీ, హెన్న అనేది నల్ల రంగులో వెంట్రుకలను కలిగి ఉన్న వారికి మాత్రమే సరిపోతుంది కారణం- హెన్నా జుట్టును ఎరువు రంగులోకి మారుస్తుంది.

జుట్టును వారానికి ఒకసారైన టీ పొడితో చేసిన డికాషన్ లేదా స్నానం చేసే నీటిలో కొద్దిపాటి నిమ్మరసంను కలపండి. దీని వలన చుండ్రు తగ్గుతుంది.

కొబ్బరి నూనె లేదా బాదం నూనెలతో రోజు మసాజ్ చేయండి. రాత్రి పడుకునే సమయంలో కొబ్బరి నూనెతో మదాజ్ చేయటం వలన, వెంట్రుకల మొదల్లలో కదలికలు జరిగి, కేశాలు ఆరోగ్యకరంగా ఉంటాయి.

జుట్టుకుదుళ్లకు రోజుమార్చి రోజు ఆలివ్ ఆయిల్ అప్లై చేయడం మరిచిపోకండి. రెండు స్పూన్ల ఆలివ్ ఆయిల్ తీసుకుని పడుకునే ముందు తలకి పట్టించి.. వేళ్ళతో జుట్టులోపల మసాజ్ చేయాలి. మరుసటి రోజు కుంకుడు లేదా షాంపులతో తలస్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా వుంటుంది. హెయిర్ ఫాల్ సమస్య కూడా వుండదు.

అదే విధంగా గ్రీన్ టీ నీటిని తలకి పట్టించి 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడిగేయాలి. ఇలా వారానికి కనీసం మూడుసార్లైనా ఇలా చేస్తే.. గ్రీన్ టీలో వుండే యాంటీ యాక్సిడెంట్ల ద్వారా కుదుళ్లకు బలం చేకూరుతుంది.

ఇక అరటి పండును రోజుకొకటి తీసుకుంటే జుట్టు రాలే సమస్య వుండదు. అరటిలో పొటాషియం, మెగ్నీషియం జుట్టుకు బలాన్నిస్తాయి. అలాగే అరటి గుజ్జును కేశాలను పట్టించి అర గంట తర్వాత కడిగేస్తే జుట్టు మృదువుగా తయారవుతుంది.



పిల్లలతో జాగ్రత్త



ఈ ఆధునిక యుగంలో పిల్లలు టెక్నాలజీ, సోషల్ మీడియా వలన పిల్లలు, యుక్తవయస్కులు భౌతికంగా చురుకుగా ఉండడంలేదు. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ప్రకారం రోజుకు ఏడు గంటలు పిల్లలు టెలివిజన్ చూడటం, కంప్యూటరులో, స్మార్ట్ ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించి చాలా సమయాన్ని వృథా చేస్తున్నారు. అందువల్ల శ్రద్ధ, పాఠశాలలో ఏకాగ్రతగా ఉండడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- పిల్లలు టీవీ, కంప్యూటర్లు వాడే సమయాన్ని పరిమితం చేయండి (ఉదా: రోజుకు 2 గంటల కంటే ఎక్కువ సమయం టీవీ, కంప్యూటర్ల ముందు ఉండకుండా చూడండి)
- పుస్తకాలు, విద్యా లాంటి విషయాలకు బాగా ప్రాధాన్యతను ఇవ్వండి.
- ఇంట్లో స్వచ్ఛందంగా మాట్లాడే అవకాశాన్ని ఇవ్వండి. (ఉదా: ఇంట్లో అందరితోనూ బాగా మాట్లాడటం)
- బయట ఎక్కువగా ఖర్చు పెట్టడం అలవాటు చేయకండి.
- శారీరక ఆరోగ్యం గురించి వ్యాయామాలు చేయడం నేర్పించండి.
- తరచుగా ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో పాల్గొనటం వల్ల చురుకుగా ఉండటం తగ్గి బద్దకం వస్తుంది. ఇది పిల్లల భౌతిక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది.
- జర్నల్ ఆఫ్ సోర్ట్స్ అండ్ హెల్త్ సైన్స్‌లో ఇటీవల ప్రచురించబడిన ప్రచురణ ప్రకారం, పిల్లలు వ్యాయామం చేస్తున్నప్పుడు వారి ఆలోచన మరియు ఏకాగ్రత మెరుగుపడుతుంది.
- పిల్లలకు బొమ్మలు, గాలి పటాలు వంటి కదలికలను ప్రోత్సహించే బొమ్మలు ఇవ్వండి.
- పిల్లలు ఆరుబయట ఆదుకోవడానికి ప్రోత్సాహాన్ని ఇవ్వండి.
- పిల్లల బెడ్ రూమ్ నుండి టీవీని దూరంగా ఉంచండి.
- లిఫ్ట్ బదులుగా మెట్లు ఎక్కమని సూచించండి.
- భోజనం తర్వాత మన ఇంటి పరిసరాల్లో నడవమని ప్రోత్సహించండి.
- పిల్లలు ఆహ్లాదకరంగా గడిపేలా సమయాన్ని కేటాయించండి.

సూర్య
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
10
cinema@suryaa.com
సూర్య సినిమా

నాగశౌర్యకు మెగాశీస్సులు



నాగ శౌర్య హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వం.. శంకర ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ బ్యానర్లో ఉషా ముల్పూరి ప్రొడక్షన్ నెం.1 గా నిర్మిస్తున్న చిత్రం 'చలో'.. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఈనెల 25న గ్రాండ్‌గా చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా రానుండడం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఫిబ్రవరి 2న ఛలో చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. నాగశౌర్య సరసన రష్మిక మండన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్ - బుజ్జి, ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి), తమ్మిరాజు, సంగీతం- మహతి స్వర సాగర్, సినిమాటోగ్రఫి- సాయి శ్రీరామ్.

చిటారు కొమ్మన మిఠాయి పొట్లం



డార్క్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న కొత్త చిత్రం 'మిఠాయి' రెడ్ యాంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా, క్రాంతిమాధవ్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయ్ దేవరకొండ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ - 'వివేక్ సాగర్ సంగీతం అందిస్తుంటే.. రాహుల్ రామకృష్ణ, కమల్ కామరాజు, ప్రియదర్శి, శ్వేత, గాయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగులో డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న సినిమా ఇది' అన్నారు.

విజయ్ దేవరకొండ మాట్లాడుతూ - 'ఈ సినిమాకు పనిచేస్తున్న యూనిట్‌లో అందరూ నాకు పెళ్ళిచూపులు నుండి పరిచయమే. డార్క్ కామెడీ సినిమా అనగానే చాలా క్యూరియస్‌గా వెయిట్ చేస్తున్నాను' అన్నారు. రాహుల్ రామకృష్ణ మాట్లాడుతూ - 'మంచి కథ. కచ్చితంగా ప్రేక్షకులను ఎంటైర్ చేసేలా వుంటుంది' అన్నారు. వివేక్ సాగర్ మాట్లాడుతూ - 'అందరికీ నచ్చే సినిమా అవుతుందనడంలో సందేహం లేదు. యూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అన్నారు.

దర్శకుడు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ - 'డార్క్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఇక్కడ తక్కువ సినిమాలే వచ్చాయి. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది. మంచి టీంతో చేస్తున్న సినిమా' అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రియదర్శి, భూషణ్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా అనుకుంటున్నారట



నందిని నర్సింగ్ హోమ్ చిత్రంతో కథానాయకుడిగానే కాక ఒక నటుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకొన్న నవీన్ విజయ్ కృష్ణ పుట్టినరోజును పురస్కరించుకొని నవీన్ నటించబోయే మూడో చిత్రాన్ని ఎనౌన్స్ చేశారు. ప్రస్తుతం తండ్రి నరేష్‌తో కలిసి "విఠలాచార్య" చిత్రంలో నటిస్తున్న నవీన్ విజయ్ కృష్ణ నటించబోయే ఈ మూడో చిత్రానికి బాలాజీ సనాల దర్శకత్వం వహించనుండగా.. రోవస్కైర్ ఎంటర్‌టైన్మెంట్స్- యు అండ్ ఐ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై శ్రీహరి మంగళంపల్లి - ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మించనున్నారు. "ఊరంతా అనుకుంటున్నారు" అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జనవరి 22 నుంచి మొదలవుతుండగా.. ఈ చిత్రంలో ఆర్టిస్ట్ కమ్ డైరెక్టర్ అవసరాల శ్రీనివాస్ కీలక పాత్ర పోషించనున్నారు.

నానితోనే నాని యుద్ధం



నేచరల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'కృష్ణార్జున యుద్ధం'. నాని ఈ సినిమాలో రెండు పాత్రలు చేస్తుండటం విశేషం. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రంలోని కృష్ణ పాత్రలో నాని ఎలా ఉండబోతున్నారనే దానికి సంబంధించిన లుక్ విడుదలైంది. పక్కా మాస్ యాంగిల్‌లో ఉన్న నాని లుక్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వస్తోంది. వెంకట్ బోయనపల్లి సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకుడు. ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 12న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతాన్ని అందిస్తుండగా, కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నాని ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ మీర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

వినోద రథం వచ్చేస్తోంది



నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, సంగీత దర్శకుడు అనూప్ భండారి మాట్లాడుతూ "రాజరథం' సినిమాకు దర్శకత్వంతో పాటు సంగీతం కూడా సమకూర్చాను. ఇందులోని ఏడు పాటలకు రామజోగయ్యశాస్త్రి అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఈ పాటలకు తప్పనిసరిగా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌నే వాడాల్సి వుండంతో వాటితోనే పాటల్ని రికార్డ్ చెయ్యడం జరిగింది. ఆడియోపరంగా, విజువల్‌గా పాటలు అందరికీ నచ్చుతాయి" అన్నారు.

నిర్మాతల్లో ఒకరైన అజయ్‌రెడ్డి గొల్లపల్లి మాట్లాడుతూ "రంగితరంగ' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని రూపొందించిన టీమ్ తెలుగులో 'రాజరథం' చిత్రంతో పరిచయమవుతోంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని నిర్మించడం జరిగింది. అనూప్ భండారి ఎక్స్‌ట్రార్డినరీ టేకింగ్‌తో, బ్యూటిఫుల్ మ్యూజిక్‌తో సినిమాని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఫిబ్రవరి 16న 'రాజరథం' చిత్రాన్ని చాలా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం" అన్నారు.

మార్చిలో మంచి లక్షణాలున్న అబ్బాయ్



నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా, నూతన దర్శకుడు ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ 'ఎం.ఎల్.ఏ'. "మంచి లక్షణాలు ఉన్న అబ్బాయ్" అనేది కాప్షన్. ఈ చిత్రంలో అందాల భామ కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

టి.జి. విశ్వప్రసాద్ సమర్పణలోబ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్.ఎల్.పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎల్.ఎల్.పి బ్యానర్ల సంయుక్త నిర్మాణంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే నెలలో జరిగే ఫారిన్ షెడ్యూల్‌లో పాటల చిత్రీకరణతో షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేసుకుంటుంది.

"ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ చిత్రం హీరో కళ్యాణ్ రామ్ కెరీర్‌లో ఒక మంచి చిత్రం అవుతుంది అని నమ్ముతున్నాం. నూతన దర్శకుడు ఉపేంద్ర ఈ చిత్రాన్ని చాలా వినోదభరితంగా మలచారు. మార్చిలో వేసవి సెలవుల సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. ఈ చిత్రం టీజర్‌కి విశేష స్పందన లభించింది" అని నిర్మాతలు తెలిపారు.

"టోటల్ న్యూ లుక్‌లో ఎంతో స్టైలిష్‌గా కళ్యాణ్ రామ్ ఈ సినిమాలో కనపడతారు. నాకు డైరెక్షన్ ఛాన్స్ ఇచ్చిన కళ్యాణ్ గారికి, చిత్ర నిర్మాతలకి కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఎం.ఎల్.ఏ అనే టైటిల్‌కి, కాప్షన్‌కి పూర్తి జస్టిఫికేషన్ ఉంటుంది", అని దర్శకులు ఉపేంద్ర అన్నారు.

రాజకుమారుడు రెడీ అవుతున్నాడు



నవీన్ బాబు, సంజన, అమృత హీరో హీరోయిన్లుగా శ్రీమతి రమాదేవి సమర్పణలో రామ్ సాయి గోకులం క్రియేషన్స్ పతాకంపై షాలిని ఫేమ్ షెరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం అనగనగా ఓ రాజకుమారుడు. పివి రాఘవులు నిర్మాత. కమెడియన్ సుమన్ శెట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సినిమా గోవాలో మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు షెరాజ్ వివరాలు తెలియచేస్తూ .. లవ్ , కామెడీ , అండ్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇప్పటికే మొదటి షెడ్యూల్ గోవా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేశాం. సరికొత్త పాయింట్‌తో తెరకెక్కే ఈ సినిమాలో కథకు సరిపోయేలా హీరో హీరోయిన్స్ బాగా సెట్ అయ్యారు. ప్రేమనేపథ్యంలో తెరకెక్కే ఈ సినిమాలో గోవా నేపథ్యంలో కథ సాగుతుంది. అక్కడ తెరకెక్కించిన సన్నివేశాలు ఆద్యంతం ఆసక్తి కలిగిస్తాయి. కామెడీతో పాటు థ్రిల్లర్ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. రెండో షెడ్యూల్‌ని త్వరలోనే హైద్రాబాద్‌లో మొదలు పెట్టనున్నాం. ఈ షెడ్యూల్‌లోనే పాటలు మిగతా సన్నివేశాలు పూర్తి చేస్తాం అన్నారు.



ఆహో.. ఓహో అనిపిస్తున్న నేహా

రామ్ చరణ్ తేజ్ డెబ్యు మూవీ చిరుతతో హీరోయిన్‌గా పరిచయమైన నేహా శర్మ ఆ తర్వాత వరుణ్ సందేశ్‌తో కుర్రాడు అనే సినిమా చేసి హిందీలో 'క్రూక్ - తేరి మేరి కహాని - యమ్లా పగ్లా దివానా 2 - తుమ్ బిన్ 2 వంటి పలు సినిమాలు చేసింది కానీ ఏదీ సరైన గుర్తింపు ఇవ్వలేదు. ఆ మధ్య అర్జున్ కపూర్ హీరోగా వచ్చిన ముబారకేలో కూడా నటించింది. ఇలియానా అందులో మెయిన్ హీరోయిన్. గ్లామర్ పరంగా ఏనాడూ మొహమాటపడని నేహా శర్మ సోషల్ మీడియాలో ఇన్‌స్టెంట్ పాపులారిటీ ఇస్తున్న ఫోటో షూట్‌కు తెరతీసింది. మరి ఇప్పటికైనా ఈ అమ్మడి సొగసుల సత్తాను అటు బాలీవుడ్‌లో కానీ ఇటు టాలీవుడ్‌లో కానీ గుర్తిస్తారో లేదో చూడాలి!

కనువిందు చేస్తున్న కాజల్ అగర్వాల్

చిరంజీవి సరసన ఖైదీ నంబర్ 150 సినిమా చేసిన కాజల్, ఆ తర్వాత సీనియర్ హీరోలతోనే కనిపించింది. విజయ్, అజిత్ లాంటి వాళ్లతో సినిమాలు చేసింది. కానీ సడెన్‌గా నేనే రాజు నేనే మంత్రి సినిమాలో రానా సరసన మెరిసింది. ప్రస్తుతం కల్యాణ్ రామ్ సరసన ఎమ్మెల్యే సినిమాలో నటిస్తోంది. కాజల్ సరసన నటించే కుర్రహీరోల లిస్ట్‌లోకి ఇప్పుడు శర్వానంద్ కూడా చేరాడు.

సుధీర్ వర్మ దర్శకత్వంలో ఓ మూవీ ప్రారంభించాడు శర్వానంద్. ఈ సినిమాలో హీరోయిన్‌గా నిత్యామీనన్‌ను ఇప్పటికే సెలక్ట్ చేశారు. మెయిన్ హీరోయిన్‌గా కాజల్‌ను తీసుకునే ప్రాసెస్‌లో ఉన్నారు. ఇందులో నటించడానికి కాజల్ దాదాపు అంగీకరించింది. త్వరలోనే అఫీషియల్ ఎనౌన్స్‌మెంట్ రాబోతోంది.

ప్రస్తుతం క్వీన్ తమిళ రీమేక్‌లో నటిస్తోంది కాజల్. ఈ సినిమా ఓ కొలిక్కి వచ్చిన వెంటనే శర్వానంద్-సుధీర్ వర్మ సినిమా సెట్స్ పైకి వస్తుంది. ఈ సినిమాతో పాటు తేజ దర్శకత్వంలో వెంకీ హీరోగా రాబోతున్న సినిమాలో కూడా కాజల్ నటించే అవకాశం ఉంది. ఇలా ఇటు సీనియర్లు, అటు కుర్రహీరోల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్‌ను పరుగులు పెట్టిస్తోంది బ్యూటీఫుల్ కాజల్.



అణు యుద్ధానికి ఒక్క అడుగు దూరంలో ప్రపంచం



వాటికన్ సిటీ: అణ్వాయుధాలతో ప్రపంచ యుద్ధానికి కేవలం ఒక్క అడుగు దూరంలోనే ఉన్నామని క్రైస్తవ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిలీ పర్యటనకు బయలుదేరిన ఆయన, మీడియాతో మాట్లాడుతూ, హవాయిపై అణు దాడి జరగనుందని పొరపాటున జరిగిన ప్రచారాన్ని ప్రస్తావించారు. ఇటువంటి పొరపాట్లు విపరీత పరిణామాలకు దారి తీస్తాయని, వీటిని చూస్తుంటే తనకు చాలా భయంగా ఉందని అన్నారు. ఏ దేశం కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను పెంచుకోరాదని సూచించిన ఆయన, ఏ రెండు దేశాల మధ్యా యుద్ధం సంభవించరాదని అభిలషించారు.

కాగా, వాటికన్ అధికారులు, నాగసాకిపై అమెరికా అణు బాంబు వేసిన తరువాత తీసిన ఓ చిత్రాన్ని బహుకరించగా, దాన్ని చూసి చలించి పోయిన పోప్, అది తన మనసును కలచివేసిందని, దీన్ని కాపీలు తీయించి అందరికీ పంచుతానని తెలిపారు.

రాయబార కార్యాలయంపై రాకెట్ దాడి!

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ లో ఉన్న ఇండియన్ ఎంబసీని రాకెట్ ఢీకొనడం కలకలం రేపింది.

ఈ దాడిలో రాయబార కార్యాలయం పై గోడలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఉద్యోగులంతా క్షేమంగానే బయట పడినప్పటికీ... వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఈ దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేక ఇతర కారణాల వల్ల జరిగిందా? అనేది చెప్పలేమని విదేశాంగ అధికారులు తెలిపారు.

భవనాన్ని రాకెట్ ఢీకొన్న ఫొటోను భారత రాయబార కార్యాలయం ట్విట్టర్ లో పోస్ట్ చేసింది.

సూర్య
హైదరాబాద్
బుధవారం 17
జనవరి 2018

ఇంకా కొనసాగుతున్న సుప్రీం వివాదం

- మాటమార్చిన అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్
- సుప్రీంకోర్టులో పాలనా వ్యవహారాలు గాడి తప్పాయి
- సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశం
- రాజ్యాంగ ధర్మాసనంలో నలుగురు జడ్జిలకు దక్కని చోటు
- కీలక కేసులను విచారించనున్న ధర్మాసనం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సుప్రీంకోర్టు వివాదం ఇంకా ముగిసినట్లు లేదు. సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి, మరో నలుగురు న్యాయమూర్తుల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యాయని నిన్న వెల్లడించిన అటార్నీ జనరల్ కెకె.వేణుగోపాల్ మంగళవారం మాట మార్చారు. సమస్య ఇంకా పరిష్కారమైనట్లు లేదని.. మరో రెండు మూడు రోజుల్లో పూర్తిగా వివాదం సద్దుమణుగుతుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. సుప్రీం సంక్షోభం ముగిసిందని వెల్లడించిన మరుసటి రోజే ఆయన ఈ విధంగా పేర్కొనడం చర్చనీయాంశమైంది. నలుగురు న్యాయమూర్తులతో గానీ, ప్రధాన న్యాయమూర్తితో గానీ సమావేశమయ్యారా అని విలేకరులు ప్రశ్నించగా అలాంటిదేమీ జరగలేదని వేణుగోపాల్ సమాధానమిచ్చారు. సుప్రీం సంక్షోభం ఈ వారాంతానికి ముగిసే అవకాశం ఉందని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ సింగ్ కూడా వెల్లడించారు. సుప్రీంకోర్టులో పాలనా వ్యవహారాలు గాడి తప్పాయని ఆరోపిస్తూ సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్ జనవరి 12న మీడియా ఎదుటకు వచ్చి మాట్లాడిన విషయం తెలిసిందే. భారతదేశ న్యాయవ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశం నిర్వహించడం సంచలనం సృష్టించింది. అయితే సోమవారం అటార్నీ జనరల్ సుప్రీం వివాదం ముగిసిపోయిందని వెల్లడించారు. అనంతరం కీలక కేసులను పరిశీలించడానికి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర అయిదుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బెంచ్‌లో ఈ నలుగురు న్యాయమూర్తులకు చోటు దక్కలేదు. ఆ బెంచ్‌లో దీపక్ మిశ్రతో పాటు న్యాయమూర్తులు ఏకే సిక్రి, ఏఎం ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లు ఉన్నారు. కాగా మంగళవారం ఈ వివాదం ఇంకా ముగియలేదని అటార్నీ జనరల్ వెల్లడించడం గమనార్హం. సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ కు, నలుగురు సీనియర్ జడ్జిలకు మధ్య తలెత్తిన వివాదం సమసిపోయిందనే వార్తలు వచ్చినప్పటికీ... అందులో వాస్తవం లేదని అర్థమవుతోంది. అత్యంత కీలకమైన రాజ్యాంగ ధర్మాసనం నుంచి జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ లను చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా పక్కనబెట్టారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కూడా ఈ విషయాన్ని అంగీకరించారు. సుప్రీంకోర్టు వివాదం ఇంకా సమసిపోలేదని ఆయన అన్నారు. గతవారం నలుగురు జడ్జిలు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కీలక కేసులను విచారించేందుకు బెంచ్ ఏర్పాటు విషయంలో చీఫ్ జస్టిస్ సరైన రీతిలో వ్యవహరించడం లేదని వారు ఆరోపించారు.

సుప్రీంకోర్టును దేశ ప్రజలే కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, నిన్న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని చీఫ్ జస్టిస్ ప్రకటించారు. ఈ బెంచ్ లో చీఫ్ జస్టిస్ తో పాటు జస్టిస్ ఏకే శిక్రీ, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్ లు ఉన్నారు. నిరసన వ్యక్తం చేసిన నలుగురు జడ్జిలకు బెంచ్ లో చోటు లేకపోవడం... ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. సోమవారం ప్రకటించిన రాజ్యాంగ ధర్మాసనం అత్యంత కీలకమైన కేసులను విచా రించనుంది. ఆధార్, హోమో సెక్సువాలిటీపై నిషేధం ఎత్తివేత, శబరిమల గుడి లోకి మహిళల ప్రవేశం తదితర కేసులపై విచారణ చేపట్టబోతోంది. దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన మెడికల్ కాలేజీ స్కాంలో భారత ప్రధాన న్యా యమూర్తి దీపక్ మిశ్రా పాత్ర ఉందని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు అంతర్గత విచారణ జరగాలని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇప్పటికే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పై నలుగు రు సీనియర్ జడ్జిలు



తిరుగుబాటు జెండా ఎగురవేసిన సంగతి తెలిసిందే. మరోవైపు జస్టిస్ చలమేశ్వర్ చేసిన ఆరోపణలకు కూడా ప్రశాంత్ భూషణ్ మద్దతు పలికారు. తాజాగా ఈయన చేసిన ఆరోపణలతో మరింత వేడి రాజుకుంది. జస్టిస్ బీఎం లోయా అనుమానాస్పద మృతికి సంబంధించి జర్న లిస్ట్ బంధురాజ్ శంభాజీ, రాజకీయ ఉద్యమకారుడు తెహసీన్ పూనావాలాలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని రకాల వివరాలను పిటిషనర్లకు తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు వైద్య నివేదికతో పాటు ప్రామాణిక డాక్యుమెంట్ల కాపీలను వారికి అందజేయాలని తెలిపింది. సుప్రీం ఆదేశాలకు మహారాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది హరీశ్ సాల్వే అంగీకరించారు. అన్ని డాక్యుమెంట్లను పిటిషనర్లకు అందజేయడానికి అభ్యంతరం లేదని, అయితే, పిటిషనర్లు ఆ డాక్యుమెంట్లను బహిరంగపరచకూడదని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా అన్ని డాక్యుమెంట్లను సీల్డ్ కవర్లో పెట్టి సుప్రీంకోర్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సమర్పించింది.

గతం గుర్తుకు తెచ్చుకున్న మోడీ, నెతన్యాహు



న్యూఢిల్లీ: వందేళ్లనాటి హైదరాబాద్ అశ్వకదళ పోరాట పటిమను భారత్, ఇజ్రాయెల్ ప్రధానులు మోడీ, బెంజమిన్ నెతన్యాహులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఇజ్రాయెల్ లో మూడో అతి పెద్ద నగరమైన హైఫాను టర్క్ ల కబంధ హస్తాల నుంచి విముక్తి చేసిన గాథను మననం చేసుకున్నారు. 1918 సెప్టెంబర్ 23న బ్రిటీష్ ఇండియాలో భాగమైన హైదరాబాద్, మైసూర్, జోధ్ పూర్ అశ్వకదళాలు హైఫాలో ఉన్న టర్క్ సైన్యంపై విరుచుకుపడ్డాయి. కేవలం కత్తులు, బల్లాలతోనే పోరాడి టర్క్ లను చిత్తుగా ఓడించాయి. ఈ క్రమంలో 44 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విజయానికి గుర్తుగా బ్రిటీష్ ఇండియా సైన్యాధిపతి నివాసానికి ఎదురుగా స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఈ స్మారక చిహ్నం చుట్టూ బల్లాలను చేతపట్టి నిలబడ్డ ముగ్గురు సైనికుల విగ్రహాలను ఉంచారు. ఇవి యుద్ధంలో పాల్గొన్న మూడు ప్రాంతాలను సూచిస్తాయి. ఆ తర్వాత సైన్యాధికారి నివాసాన్ని తీన్ మూర్తి భవన్ గా, ఆ చౌరస్తాను తీన్ మూర్తి చౌక్ గా పిలవడం ప్రారంభించారు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు తీన్ మూర్తి భవన్ లోనే వుండేవారు. భారత పర్యటకు వచ్చిన నెతన్యాహు... మోదీతో కలసి తీన్ మూర్తి చౌక్ కు వచ్చారు. అక్కడ జరిగిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ, సైనికుల త్యాగాలు అనన్య సామాన్యమైనవని చెప్పారు. హైఫా నగరం స్వేచ్ఛా వాయువులను పీల్చుకోవడానికి భారతీయ సైనికుల త్యాగాలే కారణమని తెలిపారు. హైఫా నగరానికి విముక్తి కలిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా తీన్ మూర్తి చౌక్ ను తీన్ మూర్తి-హైఫా చౌక్ గా మార్చారు.

అధ్యక్షుడిగా అమేథికి తొలిసారి రాహుల్



అమేథి: కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రాహుల్‌గాంధీ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న అమేథిలో పర్యటించారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు రాహుల్ ఉత్తరప్రదేశ్‌లో పర్యటిస్తారు. ఇందులో భాగంగానే ఆయన తొలుత లఖ్‌నవూ నుంచి అమేథికి వెళ్లే దారిలో ఉన్న హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించిన తర్వాత తొలిసారిగా రాహుల్ తన సొంత నియోజకవర్గానికి రావడంతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మొదట తన తల్లి సోనియాగాంధీ నియోజకవర్గమైన రాయ్‌బరేలి వెళ్లి అక్కడి నుంచి రాహుల్ అమేథీ వచ్చారు. మకర సంక్రాంతి రోజు ఆయన తన పర్యటన ప్రారంభించారు. 2016 సెప్టెంబరు 9న రాహుల్ ఇదే ఆలయంలో పూజలు నిర్వహించారు. 1992 బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం నెహ్రూ-గాంధీ కుటుంబం నుంచి ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన తొలి వ్యక్తిగా రాహుల్ నిలిచిన విషయం తెలిసిందే.

తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఆ ఇంటికి వచ్చిన మోషే



ముంబై: మోషే హోల్జ్ బర్గ్... ఈ పేరు ఎవరికీ గుర్తుండక పోవచ్చేమోగానీ, బేబీ మోషే... నవంబర్ 26, 2008న పాక్ ముష్కరులు ముంబైపై దాడి చేసి ఎంతో మంది అమాయకులను పొట్టన బెట్టుకున్న వేళ, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి. ఇజ్రాయిల్ కు చెందిన మోషే, తల్లిదండ్రులతో కలసి ముంబైలో ఉంటూ ఉగ్ర దాడిలో హతులు కాగా, ఆయా శాండ్రా సామ్యూల్ తో కలసి ఇజ్రాయిల్ వెళ్లి, అక్కడే పెరిగి ప్రస్తుతం 13 ఏళ్ల వయసుకు వచ్చిన బాలుడు. గత సంవత్సరం నరేంద్ర మోడీ ఇజ్రాయిల్ కు వెళ్లినప్పుడు, మోషేను కలుసుకుని, భారత్ కు రావాలని ఆహ్వానించారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఇండియాలో పర్యటిస్తుండగా, మోతే కూడా తన ఆయమ్మతో కలసి వచ్చాడు. ఈ సందర్భంగా ముంబైలో తల్లిదండ్రులు మరణించిన నారిమన్ హౌస్ కు మోషే వెళ్లాడు. చిన్నప్పుడు మోషేను చూసిన అక్కడి వారు ఆనంద బాష్పాలు రాలుస్తూ స్వాగతం పలికారు. ముంబైపై దాడి తరువాత ఆయమ్మ సహా మోషేను ఇజ్రాయిల్ కు తీసుకెళ్లిన ఆ దేశ అధికారులు, వారికి ఆశ్రయం కల్పించిన సంగతి తెలిసిందే.

మోడీని రావణుడిగా చూపిస్తున్న పోస్టర్లు



లక్నో: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ పర్యటన సందర్భంగా ఆయనను రాముడిగా, ప్రధాని మోదీని పది తలల రావణునిగా చూపిస్తూ తయారుచేసిన పోస్టర్లను ప్రచారం చేయడంపై బీజేపీ నేతలు మండిపడ్డారు. దీన్ని ఖండిస్తూ బీజేపీ నేత సూర్య ప్రకాశ్ తివారీ, కాంగ్రెస్ నేత రామ శంకర్ శుక్లాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోస్టర్లు పెట్టడంపై కాంగ్రెస్కి ఎలాంటి సంబంధం లేదని అమేథీ జిల్లా కాంగ్రెస్ కమిటీ వాదిస్తోంది. కాగా, కాంగ్రెస్తో ఎలాంటి సంబంధం లేని అభయ్ శుక్లా అనే వ్యక్తి వీటిని తయారుచేయించినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీని రాముని అవతారంగా పేర్కొంటూ, ప్రధాని మోదీని రావణుడిగా అభివర్ణిస్తున్న ఈ పోస్టర్లు అమేథీలోని ప్రధాన కూడళ్లలో కనిపించాయి. వీటికి సంబంధించిన ఫొటోలపై బీజేపీ మద్దతుదార్లు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు.

కర్ణాటకపై గోవా మంత్రి పరుష వ్యాఖ్యలు



ముంబై: మహాదయి జల వివాదం తీవ్ర రూపం దాల్చుతోంది. గోవా జల వనరుల మంత్రి వినోద్ పాలియెంకర్ కన్నడిగులపై కఠిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల కన్నడిగులపై అవమానకరంగా మాట్లాడిన ఆయన మంగళవారం ఫేస్‌బుక్ పోస్ట్‌లో మరింత తీవ్రంగా విరుచుకుపడ్డారు. మహాదయి జల వివాదానికి సంబంధించి కర్ణాటక ప్రభుత్వం అలవాటైన అబద్ధాల కోరుగా వ్యవహరిస్తోందని వినోద్ తన ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించలేదని కర్ణాటక చెప్తోందని, తాము ఫొటోలతో కూడిన సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గోవా తన సాక్షులకు ఎన్నడూ డబ్బులివ్వలేదన్నారు. కానీ కర్ణాటక ప్రభుత్వ సాక్షి గోసాయిన్ స్వయంగా ట్రైబ్యునల్‌కు తెలిపిన వివరాలను ప్రస్తావించారు. సాక్షిగా ఉన్నందుకు గోసాయిన్‌కు కర్ణాటక ప్రభుత్వం రోజుకు రూ. 50 వేలు ఇచ్చిందని, రిపోర్టు తయారు చేయడానికి రూ.5 లక్షలు ఇచ్చిందని గోసాయిన్ స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. గోవా, గోవా ప్రజలు, గోవా తత్త్వం అనేవి గోవా అధికార కూటమి నినాదాలని తెలిపారు.


విమానాశ్రయంలో కాల్పుల కలకలం

ట్రిపోలి: లిబియాలోని ట్రిపోలి మిశ్రాటా విమానాశ్రయంలో కలకలం చెలరేగింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని తొమ్మిది మంది మృతి చెందారు. ఈ ఘటనలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరు వర్గాల వ్యక్తులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుతూ విరుచుకుపడ్డారని అక్కడి అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఆ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేసి, విమానాలను ఎయిర్‌పోర్టు నుంచి దారి మళ్లించినట్లు తెలిపారు.

పద్మావత్‌లో మార్పులివే!... పేరు మార్పుతో కొత్త ట్రైలర్

- ప్రదర్శనకు ముందు హెచ్చరిక వేయాలి
- ఘూమర్ పాటలో మార్పు
- ఈ నెల 25న విడుదల కానున్న పద్మావత్
- గుజరాత్, మధ్యప్రదేశ్ బాటలో హర్యానా
- పద్మావత్ చిత్రం విడుదలపై నిషేధం వెల్లడించిన హర్యానా ఆరోగ్య మంత్రి
- ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే కారణం

న్యూఢిల్లీ: రాజపుత్ మహారాణుల గౌరవానికి భంగం కలిగే సన్నివేశాలు ఉన్నాయనే ఆరోపణలతో పద్మావత్ చిత్రం గురించి ఆందోళనలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల కారణంగా సినిమా విడుదలకు అంగీకారం తెలపడం కోసం సీబీఎఫ్సీ చరిత్రకారుల సహాయం కూడా తీసుకుంది. వారి సలహా మేరకు ఓ ఐదు మార్పులను సూచించింది. ఈ సవరణలకు నిర్మాతలు ఒప్పుకుంటేనే సినిమా విడుదలకు అంగీకరించినట్లు సీబీఎఫ్సీ చైర్మన్ ప్రసూన్ జోషి ఇటీవల ప్రకటించారు. పేరులో స్వల్ప మార్పుతో పాటు మరో నాలుగు సవరణలు సీబీఎఫ్సీ సూచించింది. సినిమా ప్రారంభంలో డిస్క్లైమర్ ప్రదర్శించటం, సతి ఆచారాన్ని ప్రోత్సహించేలా ఉండకూడదని, అలాగే ఘూమర్ పాటలో కూడా కొన్ని మార్పులు చేయాలని సూచించింది. ఈ సవరణలతో సినిమా ఇప్పటికే సిద్ధంకాగా, పేరులో మార్పుతో ఉన్న చిత్రం ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న బాలీవుడ్ సినిమా పద్మావత్ ఈ నెల 25న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సినిమా తమ తమ రాష్ట్రాల్లో విడుదలయ్యే అవకాశం లేదని ఇప్పటికే ప్రకటించారు. ఇక యోగి ఆదిత్యనాథ్ సీఎంగా ఉన్న ఉత్తరప్రదేశ్లో ఈ సినిమా విడుదల అవుతుందా? అనే సందేహం అందరిలోనూ ఉంది. ఈ విషయంపై మీడియా అడిగిన ప్రశ్నకు యోగి ఆదిత్యనాథ్ అసహనం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో ఈ సినిమా విడుదల అవుతుందా? లేదా? అని చెప్పడానికి తానేం జ్యోతిష్యుడిని కానని యోగి ఆదిత్యనాథ్ సమాధానం ఇచ్చారు. కాగా, తన సినిమా విడుదల విషయమై ఆయా రాష్ట్రాల



ముఖ్యమంత్రులతో దర్శకుడు భన్సాలీ చర్చించనున్నారు. 'పద్మావత్' చిత్రం విడుదలకు సీబీఎఫ్సీ మార్గం సుగమం చేసినప్పటికీ, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు మాత్రం ఆ చిత్రాన్ని విడుదల చేసేందుకు సుముఖంగా లేవు. ఈ సినిమా విడుదలపై రాజ్పుత్ వర్గాల నుంచి వ్యతిరేకత ఉన్న దృష్ట్యా ఇప్పటికే గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు 'పద్మావత్' చిత్రం విడుదలను నిషేధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇదే బాటలో హర్యానా రాష్ట్రం కూడా పద్మావత్ విడుదలను నిషేధించింది ఈ మేరకు హర్యానా ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్ ఓ ట్వీట్ ద్వారా వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వ్యక్తమవుతున్న నిరసన కారణంగా మనోహర్లాల్ ఖట్టర్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మరో కీలక నిర్ణయం తీసుకున్న కమలహాసన్




చెన్నై: విలక్షణ నటుడు కమలహాసన్ రాజకీయ అరంగేట్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో పార్టీ ప్రకటన కంటే ముందుగానే ఆయన రంగంలోకి దిగిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తున్నట్టు ప్రకటించారు. తమిళనాడులో ప్రస్తుతం అవినీతి పాలన నడుస్తోందని... ప్రస్తుత పరిణామాలను ప్రజలకు వివరిస్తానని చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే తన పర్యటన అని తెలిపారు. జనవరి 26న తన పర్యటన మొదలవుతుందని చెప్పారు. ఆనంద్ వికటన్ తదుపరి సంచికలో పర్యటన వివరాలను వెల్లడిస్తానని అన్నారు. మైయ్యామ్ విజిల్ యాప్ ద్వారా ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు అందాయని చెప్పారు. త్వరలోనే అవినీతి తిమింగలాల బండారాన్ని బయటపెడతానని తెలిపారు.

భారత ఆర్మీ మరో సాహసం

న్యూఢిల్లీ: భారత సైన్యం మరోసారి సాహసం చేసింది. భారత్, పాక్ సరిహద్దుల్లో పదే పదే కాల్పులకు తెగబడుతూ, ఉగ్రవాదులు చొరబడేలా ప్రోత్సహిస్తోన్న పాక్కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. పూంచ్ సెక్టార్ పరిధిలోని వాస్తవాధీన రేఖ ఆవల భారత సైన్యం లక్షిత దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఏడుగురు పాక్ రేంజర్లను భారత సైన్యం హతమార్చింది. అలాగే, చొరబాటుకు ప్రయత్నించిన మరో ఆరుగురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. ఉగ్రవాదులను నియంత్రణ రేఖ వద్దే మట్టుబెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ లక్షిత దాడులపై మరింత సమాచారం అందాల్సి ఉంది.

కారులో యువతిపై సామూహిక అత్యాచారం!

ఫరీదాబాద్: పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్తున్న 22 ఏళ్ల యువతిని కిడ్నాప్ చేసిన నలుగురు యువకులు కారులో ఆమెపై రెండు గంటలపాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో జరిగిందీ దారుణం. శనివారం ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన యువతి ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడుకుంటూ రోడ్డుపై నడుస్తోంది. ఈ క్రమంలో స్కార్పియో కారులో వచ్చిన నలుగురు యువకులు ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించుకున్నారు. అనంతరం ఆమె మొబైల్ ఫోన్‌ను స్విచాఫ్ చేసి నడుస్తున్న కారులోనే ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆమెను బల్లభ్‌గఢ్ ప్రాంతంలో పడేసి వెళ్లిపోయారు. తర్వాత ఎలాగోలా ఓపిక తెచ్చుకున్న ఆమె తన ఫోన్‌ను స్విచాన్ చేసి సోదరుడికి సమాచారం అందించింది. అంతకంటే ముందే ఆమెను గమనించిన కొందరు వాహనదారులు పోలీసు కంట్రోల్ రూముకు ఫోన్ చేసి ఆమె గురించి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనపై మొత్తం నలుగురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు తెలిపింది. కిడ్నాప్ చేసిన వెంటనే నిందితులు తన సెల్ ఫోన్ తీసుకుని స్విచాఫ్ చేశారని, తిరిగి వెళ్లిపోతూ దానిని ఇచ్చారని వివరించింది. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్టు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) హెడ్ పూజా దబ్లా పేర్కొన్నారు.హర్యానాలో గత 24 గంటల్లో జరిగిన నాలుగు అత్యాచారాలు కలకలం



రేపాయి. ఇండియాలోనే క్రైమ్ రేటులో టాప్-3లో ఉన్న హర్యానాలో ప్రభుత్వం తీవ్రంగా విఫలం అవుతోందని, బీజేపీ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం అయ్యాయన్న ఆరోపణలు వస్తున్నాయి. 50 ఏళ్ల వ్యక్తి తన సమీప బంధువైన 10 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆమె రహస్య అవయవాలపై కర్రతో దాడి చేసిన ఘటన కలకలం రేపగా, ఇదే సమయంలో ఇద్దరు దళిత బాలికలను అత్యాచారం చేసి హత్య చేశారన్న వార్త వచ్చింది. మరో ఘటనలో యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ ఘటనల తరువాత ముఖ్యమంత్రి ఖట్టర్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మిగతా కేసుల్లో నిందితుల ఆచూకీ తెలియాల్సి వుంది.

బెనజీర్ భుట్టోను చంపింది తామేనని వెల్లడించిన ఉగ్ర సంస్థ!

- పుస్తకం రాసిన తాలిబాన్ నేత అబూ మన్సూర్ అసిమ్ ముఫ్తీ
- బెనజీర్ ను హత్య చేసిన తెహ్రిక్ తాలిబన్
- గతంలో లాడెన్, ముషారఫ్‌పై ఆరోపణలు
- తాలిబన్ నేతల అకృత్యాలను కళ్లకు కట్టిన పుస్తకం

న్యూఢిల్లీ:పాకిస్థాన్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టోను ఎవరు చంపారు? లాడెన్ చంపించాడని ఒకరు.. మాజీ డిక్టేటర్ ముషారఫ్ హత్య చేయించాడని మరొకరు ఆరోపణలు చేస్తున్నా.. ఇప్పటి వరకు ఈ విషయంలో స్పష్టత లేదు. ముషారఫ్ కంటే లాడెన్‌పైనే ఎక్కువ ఆరోపణలు వచ్చాయి. ఇందుకు బలం చేకూర్చే పలు ఆధారాలు కూడా లభ్యమయ్యాయి. అయితే ఇన్నాళ్లకు బెనజీర్‌ను చంపింది ఎవరన్న విషయాన్ని ఓ పుస్తకం ప్రపంచానికి వెల్లడించింది. తాలిబాన్ నేత అబూ మన్సూర్ అసిమ్ ముఫ్తీ రాసిన ఇంక్విలాబ్ మెహసూద్ సౌత్ వజీరిస్థాన్ అనే పుస్తకంలో బెనజీర్ హత్యకు సంబంధించి ఆసక్తికర విషయాలు రాశారు. ఆమెను చంపింది తెహ్రిక్ తాలిబన్ అనే ఉగ్ర సంస్థ అని పుస్తకంలో పేర్కొన్నారు. గతేడాది నవంబరు 30న ఈ పుస్తకాన్ని ప్రచురించగా తాజాగా ఆదివారం దీనిని విడుదల చేశారు. తాలిబన్ నేతలు చేసిన పలు అకృత్యాలను ఈ పుస్తకంలో వివరించారు. మాజీ ప్రధాని బెనజీర్ ను బిలాల్ అలియాస్ సయీద్, ఇక్రముల్లా అనే ఇద్దరు ఆత్మాహుతి దళ సభ్యులు హత్య చేసినట్టు



పుస్తకంలో పేర్కొన్నారు. తొలుత బిలాల్ మాజీ ప్రధాని మెడపై కాల్చి ఆ వెంటనే తనను తాను పేల్చేసుకున్నాడు. ఇక్రముల్లా తప్పించుకున్నట్టు పుస్తకంలో వివరించారు. దీంతో ఇన్నాళ్లకు బెనజీర్ హత్యపై స్పష్టత వచ్చింది. నిజానికి బెనజీర్ పై హత్యాయత్నం జరగబోతోందంటూ నిఘా వర్గాలు పాక్ హోంశాఖను ముందే హెచ్చరించాయి. బెనజీర్, ముషారఫ్, జమైత్ ఉలేమా-ఇ-ఇస్లాం ఫజల్ చీఫ్ ఫజ్లుర్ రహమాన్‌ను చంపేందుకు లాడెన్ అనుచరులు ప్లాన్ చేస్తున్నట్టు హెచ్చరికలు జారీ చేశాయి.

వీరి హత్యను పర్యవేక్షించేందుకు లాడెన్ ఆఫ్ఘని స్థాన్ వెళ్లినట్టు పేర్కొన్నాయి. లాడెన్ పేరుతో కొరియర్‌లో పేలుడు పదార్థాలు వచ్చాయని అప్రమత్తంగా ఉండాలని, భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని హెచ్చరించాయి. నిఘా వర్గాల హెచ్చరికలను అప్పటి ప్రభుత్వం బేఖాతరు చేసింది. ఫలితంగా జరిగిన బాంబుదాడిలో బెనజీర్ మరణించారు. ఆ తర్వాత ఆమె చనిపోయినట్టు నిర్ధారిస్తూ లాడెన్‌కు రాసిన లేఖను అధికారులు ఆయన ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు బెనజీర్ మరణం మిస్టరీగానే మిగిలిపోయింది. ఎవరు చంపారన్న విషయంలో ఇప్పటికీ మిస్టరీ కొనసాగుతుండగా తాజా పుస్తకం అనుమానాలను పటాపంచలు చేస్తూ బెనజీర్ ను చంపింది తామేనని తెహ్రిక్ తాలిబన్ సంస్థే వెల్లడించింది.

సూర్య
హైదరాబాద్
బుధవారం
17 జనవరి 2018
12

సూర్య స్పోర్ట్స్

యువీ, గేల్‌ను కూడా మరిపిస్తున్నాడు

న్యూఢిల్లీ : సిక్సర్ల హీరో యువరాజ్, వెస్టిండీస్ విధ్వంసకర ఆటగాడు క్రిస్ గేల్ కంటే కూడా ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ బంతిని బలంగా బాదేస్తు న్నాడని అంటున్నాడు ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్. ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య ప్రస్తుతం ఐదు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌కు పీటర్సన్ కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన తొలి వన్డేలో స్టోయినిస్ (60) పరుగులు సాధించాడు. అంతేకాదు ఇటీవల బిగ్‌బాష్ లీగ్‌లోనూ స్టోయినిస్ అదరగొట్టాడు. ఈ సందర్భంగా పీటర్సన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నేను ఎంతో మంది ఆటగాళ్లను చూశాను. గేల్, యువరాజ్, మిచెల్ మార్ష్ వీళ్లందరూ బంతిని బలంగానే కొడతారు. కానీ, స్టోయినిస్‌లా బంతిని బలంగా కొట్టే వాళ్లను నేను చూడలేదు. ఆస్ట్రేలియా తరవున స్టోయినిస్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. భవిష్యత్తులో జట్టులో స్థానం కోసం మిచెల్ మార్ష్‌తో స్టోయినిస్ పోటీ పడకతప్పదు. మైదానంలో సైలెంట్‌గా ఉంటూ పరుగులు తీసే విధానం నాకెంతో నచ్చింది అంటూ స్టోయినిస్‌పై పీటర్సన్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఆసీస్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. సిరీస్‌లో భాగంగా రెండో వన్డే ఈ నెల 19న బ్రిస్బేన్‌లో జరగనుంది.



భారత్‌కు 'మూడి'ందా?

- కీలక సమయంలో కోహ్లీ విఫలం
- రెండో ఇన్నింగ్స్‌లో 26 పరుగులకే నేల కూలిన మూడు వికెట్లు
- నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా స్కోరు 35/3
- కోహ్లీసేన విజయానికి మరో 252 పరుగులు అవసరం
- చేతిలో ఏడు వికెట్లు
- భీకరంగా బౌలింగ్‌తో కంగారెత్తిస్తున్న సౌతాఫ్రికా బౌలర్లు
- నేడే ఆఖరు ఆట ఆఖరురోజు



సెంచూరియన్ : నాలుగోరోజు (మంగళవారం) రెండు సెషన్ల వరకు ఆట సాదాసీదాగా సాగిన భారత్-దక్షిణాఫ్రికా రెండో టెస్టు చివర్లో అనూహ్య మలుపులు తిరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో 287 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ మురళీ విజయ్, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ వికెట్లను టపటపా కోల్పోయింది. కేవలం 26 పరుగుల వ్యవధిలో కీలకమైన ముగ్గురు ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరడంతో టీమిండియా విజయం సందేహాల్లో పడింది. ప్రత్యర్థి సౌతాఫ్రికా బౌలర్ల పట్టుదల చూస్తుంటే... భారత్‌కు విజయం అంత సులువు కాదనిపిస్తుంది. వారి ఆటతీరు... మన బ్యాట్స్‌మెన్ వైఫల్యం నేపథ్యంలో విజయం ఆతిథ్య జట్టువైపే మొగ్గు చూపినట్లుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత్‌ను గెలిపించాలన్నా... డ్రాతో గట్టెక్కించాలన్నా... భారమంతా టీమిండియా నయావాల్ ఛతేశ్వర్ పుజారా పైనే ఉందని చెప్పుకోవాలి. మరో రకంగా చెప్పాలంటే... అద్భుతం జరిగితే తప్ప కోహ్లీసేన ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం సాధ్యం కాదని కూడా చెప్పొచ్చు.

అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 90/2తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికా 258 పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు రోజు అర్ధశతకం సాధించిన ఏబీ డివిలియర్స్ (80; 121 బంతుల్లో 10 ఫోర్లు) మరో 30 పరుగులు జోడించి ఔటయ్యాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపూ భారత బౌలర్లను భయపెట్టాడు. ఓదశలో శతకం కూడా సాధించేలా కనిపించాడు. అతడికి అండగా ఉన్న ఓపెనర్ డీన్ ఎల్గర్ (61; 121 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) మంచి షాట్లతో అలరించాడు. స్కోరు బోర్డును కదిలించాడు. ఐతే మహ్మద్ షమి (4/49) చక్కని బౌలింగ్ చేశాడు. పై ఇద్దరినే కాకుండా డికాక్ (12), రబాడ (4)ను వరుసగా పెవిలియన్‌కు పంపించాడు. ఈ క్రమంలో సారథి డుప్లెసిస్ (48; 141 బంతుల్లో 4 ఫోర్లు) నిలకడగా ఆడాడు. జట్టు స్కోరును 250 దాటించాడు. అర్ధశతకం ముందు అతడిని బుమ్రా బోల్తా కొట్టించాడు. దీంతో ఆ జట్టు 258 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 28 కలుపుకుని భారత్ ముందు 287 పరుగుల లక్ష్యం ఉంచింది. సెంచూరియన్‌లో ఓ జట్టు సాధించిన అత్యధిక ఛేదన 226. అంటే కోహ్లీసేనకు ఈ లక్ష్యం అంత సులవైనదేమీ కాదు. బుమ్రా3, ఇషాంత్ 2 వికెట్లు పడగొట్టారు.

భారత్‌పై సఫారీ బౌలర్ల ఎదురుదాడి

రెండో ఇన్నింగ్స్‌లో భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు దక్షిణాఫ్రికా బౌలింగ్ చతుష్టయం చురకత్తుల్లాంటి బంతులు విసిరింది. కొత్త కుర్రాడు లుంగి ఎంగిడి వెంటవెంటనే రెండు షాకులిచ్చాడు. బంతులు తక్కువ ఎత్తులో రావడంతో ఓపెనర్లు కాస్త ఇబ్బంది పడ్డారు. ఐతే 7 ఓవర్లకు బాగానే ఆడారు. ఈ క్రమంలో రబాడ వేసిన 7.5వ బంతికి మురళీ విజయ్ (9; 25 బంతుల్లో 1 ఫోర్లు) ఇన్‌సైడ్ ఎడ్జ్ రూపంలో పెవిలియన్ చేరాడు. మరో నాలుగు పరుగులకే ఓపెనర్ లోకేశ్ రాహుల్ (4; 29 బంతుల్లో)ను అరంగేట్రం కుర్రాడు ఎంగిడి ఔట్ చేశాడు. ఓ చెత్త షాట్ సెలక్షన్‌తో అతడు మైదానం వీడాడు. ఈ క్రమంలో నయావాల్ ఛతేశ్వర్ పుజారా (11 బ్యాటింగ్; 40 బంతుల్లో 1 ఫోర్లు) అండతో సారథి విరాట్ కోహ్లీ (5; 20 బంతుల్లో 1 ఫోర్) ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించాడు. కానీ ఓ అద్భుతమైన బంతికి కోహ్లీని ఎంగిడి వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. భారత్ సమీక్ష కోరినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికి జట్టు స్కోరు 26. రోహిత్ శర్మ బదులుగా పార్థివ్ పటేల్ (5 బ్యాటింగ్; 24 బంతుల్లో)ను ముందుగా క్రీజులోకి పంపించారు. ఆట ముగిసే సరికి భారత్ మూడు వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది. ఇక భారమంతా నయావాల్‌పైనే! జట్టు గెలవాలంటే చివరి రోజు 252 పరుగులు చేయాలి. లేదా వికెట్లను నిలువుకోవాలి. ఇవి రెండూ కష్టసాధ్యమే! అయినా... భారత్‌ను ఆదుకునే ఏకైక ఆయుధం ఇప్పుడు ఛతేశ్వరే అని చెప్పుకోవాలి.

స్కోరు వివరాలు - దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 335. భారత్ తొలి ఇన్నింగ్స్ : 307
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : 258, భారత్ రెండో ఇన్నింగ్స్ (కొనసాగుతోంది) : 35/3.

భారత్ మరో విజయం

- పసికూన పపువా న్యూగినియాను చిత్తుచేసిన యువసేన
- 10 వికెట్ల తేడాతో ఘన విజయం
- అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ టోర్నీ



మౌంట్ మౌంగానుయ్ : అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో భాగంగా పసికూన పపువా న్యూగినియాపై జరిగిన మ్యాచ్‌లో 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినియా భారత బౌలర్ల దాటికి చేతులెత్తేసింది. పట్టుమని 22 ఓవర్లు కూడా బ్యాట్స్‌మెన్లు ఆడలేకపోయారు. 21.5 ఓవర్లలో 64 పరుగులకు ఆలౌట్ అయ్యారు. భారత బౌలర్లలో సుధాకర్ రాయ్ 5, శివమ్ మావి 2 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించారు. నాగర్‌కోటి, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 65 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన యువభారత్ వికెట్లు నష్టపోకుండా కేవలం 8 ఓవర్లలోనే లాంఛనాన్ని పూర్తిచేశారు. ఓపెనర్లు పృథ్వీషా 57, మన్‌జ్యోత్ కల్రా 9 పరుగులు చేశారు. తొలి మ్యాచ్‌లో పటిష్ఠ ఆస్ట్రేలియాపై భారత్ వంద పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

అశ్విన్ కొ(చె)త్త రికార్డు



సెంచూరియన్ : టీమిండియా స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అశ్విన్ వికెట్ తీయడానికి సంధించిన బంతులు 177 (29.3 ఓవర్లు). తద్వారా విదేశీ పిచ్‌లపై రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ తీయడానికి అశ్విన్ అత్యధిక బంతుల్ని తీసుకున్న అపఖ్రపను సొంతం చేసుకున్నాడు. ఓవరాల్‌గా చూస్తే ఇది అశ్విన్‌కు మూడో చెత్త ప్రదర్శనగా చెప్పొచ్చు. అంతకుముందు 2012లో అహ్మదాబాద్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో అశ్విన్ వికెట్ తీయడానికి 257 బంతులు అవసరం కాగా, 2011లో వెస్టిండీస్‌తో కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో వికెట్ తీయడానికి 215 బంతులు అవసర మయ్యాయి. ఈ మ్యాచ్‌లో 287 పరుగుల లక్ష్యాన్ని భారత్‌కు నిర్దేశించింది. నాల్గో రోజు ఆటలో భాగంగా దక్షిణాఫ్రికా తన రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగుల వద్ద ఆలౌటైంది. 90/2 ఓవర్‌నైట్ స్కోరుతో మంగళవారం ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీలు.. మరో 168 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయారు. దాంతో సఫారీలకు 286 పరుగుల ఆధిక్యం లభించింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో ఎన్‌గిడి చివరి వికెట్‌గా అశ్విన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు.

డివిలియర్స్ మరో ఘనత



సెంచూరియన్ : దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ మరో ఘనతను సొంతం చేసుకున్నాడు. టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్టులో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో ఏబీ డివిలియర్స్ 80 పరుగులు సాధించాడు. ఫలితంగా సెంచూరియన్‌లో అత్యధిక టెస్టు పరుగులు నమోదు చేసిన మూడో క్రికెటర్‌గా గుర్తింపు సాధించాడు. ఈ మైదానంలో ఇప్పటివరకూ డివిలియర్స్ నమోదు చేసిన టెస్టు పరుగులు 1,257. దాంతో హాషీమ్ ఆమ్లా(1285), జాక్వస్ కల్లిస్ (1267) తర్వాత స్థానాన్ని ఏబీ ఆక్రమించాడు. మరొకవైవు ఒక వేదికలో తన అత్యధిక టెస్టు పరుగుల రికార్డును కూడా ఏబీ సవరించుకున్నాడు. ఇప్పటివరకూ కేప్‌టౌన్‌లో 1,217 టెస్టు పరుగుల్ని ఏబీ నమోదు చేయగా, తాజాగా దాన్ని అధిగమించాడు. 90/2 ఓవర్‌నైట్ స్కోరుతో మంగళవారం నాల్గో రోజు ఆట కొనసాగించిన ఏబీ, ఎల్గర్‌లు ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే యత్నం చేశారు. అయితే ఇన్నింగ్స్ 42 ఓవర్ రెండో బంతికి ఏబీని బోల్తా కొట్టించిన షమీ..46వ ఓవర్ ఐదో బంతికి ఎల్గర్‌ను అవుట్ చేశాడు. ఇక 47 ఓవర్ నాల్గో బంతికి డీకాక్‌ను షమీ అవుట్ చేశాడు. దాంతో దక్షిణాఫ్రికా 163 పరుగుల వద్ద ఐదో వికెట్‌ను నష్టపోయింది.

కోహ్లీని మించే వారొస్తారు



న్యూఢిల్లీ : ఐపీఎల్-2018 వేలానికి ముందే కోహ్లీ కోసం బెంగళూరు అత్యధిక ధర చెల్లించిన సంగతి తెలిసిందే. రిటెన్షన్ విధానం ద్వారా కోహ్లీని సొంతం చేసుకున్న ఆర్‌సీబీ రూ.17కోట్లు చెల్లించింది. ఈ నెల 27, 28 తేదీల్లో ఐపీఎల్ కోసం ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నారు. ఈ వేలంలో కోహ్లీ కంటే ఎక్కువ ధరకు అమ్ముడుపోయే ఆటగాళ్లు ఉన్నారని అంటున్నాడు భారత మాజీ క్రికెటర్ సెహ్వాగ్. తాజాగా సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'ఈ ఏడాది ఐపీఎల్ కోసం నిర్వహించే వేలంలో ఇద్దరి నుంచి ముగ్గురు ఆటగాళ్లు కోహ్లీ కంటే ఎక్కువ ధర పలికేవాళ్లు ఉన్నారు. ఏదైనా ఫ్రాంఛైజీ ఒక ఆటగాడిని తామే దక్కించుకోవాలని భావిస్తే అతడి కోసం రూ.20కోట్లైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉంది. గత ఏడాది ముంబయి వద్ద తగినంత డబ్బులేక ఇంగ్లాండ్ ఆటగాడు బెన్ స్టోక్స్‌ను వదిలేసుకుంది. పుణె అత్యధికంగా రూ.14కోట్లు వెచ్చించి అతడ్ని సొంతం చేసుకుంది. ఈ ఏడాది స్టోక్స్... కోహ్లీ కంటే ఎక్కువ ధర పలకొచ్చు' చెప్పలేం అని సెహ్వాగ్ తెలిపాడు.

ఈ నెల 4న నిర్వహించిన ప్లేయర్ రిటన్షన్ ద్వారా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఒకే ఒక్క ఆటగాడు అక్షర్ పటేల్‌కు అత్యధికంగా రూ.6.75కోట్లు చెల్లించింది. దీనిపై ఆయన మాట్లాడుతూ..ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో భారత ఆటగాళ్లకు ఎక్కువ ధర పలుకుతారు. మూడేళ్ల క్రితం అక్షర్ పటేల్‌ను రూ.30లక్షలు వెచ్చించి మేము తీసుకున్నాం. అప్పుడు అతను భారత్‌కు ఆడటం లేదు.

జనంలోకి రాని జనసేనాని..?

- ఔత్సాహిక వేదికలతోనే సరిపుచ్చిన వైనం
- నాయకుల ఎంపిక పూర్తయిన చోట్ల జనంలోకి వెళ్లింది ఎక్కడా...?
- మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు
- కథన రంగంలోకి దిగే రీతిలో జనసేన అడుగులు ఎక్కడా....?
- వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తారా...? ప్రశ్నించేందుకు సిద్ధమవుతారా...?
- ఇంకా ఎంపికలు కాలేదని ఏదో ఒక పార్టీకి జై కొడతరా..!
- వ్యూహంలేని దిశగా జనసేన పార్టీ...?



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ప్రత్యక్ష రాజకీయాలలోకి త్వరలోనే వస్తున్నానని స్పష్టంచేసిన జనసేన పార్టీ ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రత్యేక పద్ధతిలో నాయకత్వ ఎంపికకు శ్రీకారం చుట్టిన జనసేన పార్టీ నాయకత్వం ఇప్పటికే ఎంపికలు పూర్తిచేసినా ఇంకా జనంలోకి వెళ్లని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల నాటికి జనం తరపున జనసేన ప్రశ్నించేందుకు సిద్ధమవుతుందా...? లేక ఇంకా ఎంపికలు పూర్తికాలేదని చెప్పి ఏదో ఒక పార్టీకి జై కొడుతుందా అన్నది సందేహాస్పదంగా మారిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు సాధారణ ఎన్నికలు కేవలం ఏడాది సమయం మాత్రమే ఉంది. ఏడాదిలోపే దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఈ రెండు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమవుతున్నాయి. ఆ దిశగా తమ పార్టీ శ్రేణులను ఇప్పటినుంచే అప్రమత్తం చేస్తున్నాయి. కానీ జనసేన పార్టీ ఆ దిశగా ఇంకా అడుగులు వేయని పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ వర్గాల భావన. ఎందుకంటే ఏ పార్టీ అయిన ప్రజలపక్షాన పోరాడితేనే దానికి ఎన్నికల్లో గుర్తింపు ఉంటుంది. ఇప్పటి వరకు జనసేన పార్టీ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాజధాని రైతుల కోసం, ఉద్ధానం కిడ్నా బాధితుల పక్షాన ఇలా సొంతంగా పోరాటం చేశారు. అయితే స్థానిక సమస్యలతోపాటు రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలపై మాత్రం జనసేన పార్టీ నేతలు పోరాడేందుకు ఇంతవరకు కథన రంగంలోకి దిగలేదు. దీంతో జనసేన వచ్చే ఎన్నికల నాటికి కథనరంగంలోకి దిగుతుదా లేక ఇంకా తాము పూర్తిస్థాయిలో విస్తరించలేదని కారణం చెప్పి ఏదో ఒక పార్టీకి జై కొట్టి సరిపుచ్చుకొంటుందా అన్నది సందేహాస్పదంగా మారిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

జనసేన పార్టీ విధానం ఏమిటీ...?

ఏ పార్టీ అయిన వచ్చే ఎన్నికల నాటికి తలపడేందుకు ఏదో ఒక అజెండా, ప్రణాళికతో జనం ముందుకు వస్తుంది. దానికి అనుగుణంగా ప్రజా సమస్యలతోపాటు తన అజెండా అమలుకు పూనుకొంటోంది. ఈ దిశగానే అధికార పార్టీ టీడీపీ సైతం 2020 అజెండాను ముందు పెట్టుకొని జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. నవరత్నాల పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం వచ్చే ఎన్నికల్లో తలపడేందుకు ఇప్పటికే సిద్ధమైంది. వామపక్షా పార్టీలు సైతం వివిధ ప్రాంతాలలో వివిధ సమస్యలపై ఇప్పటికే పోరాటం చేస్తూ విశాలమైన వేదిక ద్వారా జనంలోకి వెళ్లాలని భావిస్తోంది. ఈ తరుణంలో వచ్చే ఎన్నికల్లో తాము ఏం చేస్తాం...ఏ చేయబో తున్నాం అని చెప్పేందుకు జనసేన పార్టీ ఇంతవరకు ఎలాంటి ప్రణాళికను సిద్ధంచేసుకోకపోవడంతో ఆ పార్టీ సమీపభవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ధీమా కలిగిస్తుందన్న భావనను రాజకీయ వర్గాలు వ్యక్తంచేస్తున్నా యి. కనీ సం జనంలో ఆత్మవిశ్వాసం నింపేందుకు జనసేన పార్టీ తరపున పోరాటాలు చేసేందుకు ఆ పార్టీ నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి. జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో బలపడేందు కు చర్యలు తీసుకొంటూనే ప్రజాసమస్యలపై పోరాడేందుకు వీలుందని రాజ కీయ వర్గాలు పేర్కొంటున్నాయి. స్వతహాగా పవన్ కళ్యాణ్‌కు సినీ హీరోగా మంచి గుర్తింపు ఆదరణ ఉంది. ఆయన స్వతహాగా ఏదైనా ప్రజా సమస్యపై పోరాటానికి పిలుపునిస్తే ఆయన అభిమానులు కూడా రోడ్డెక్కే పరిస్థితి ఉం టుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అనేక సమస్యలు నెలకొన్న నేపథ్యంలో జనసేన పార్టీ ఆ సమస్యలపై పోరాడేందుకు ఒక్క పిలుపునిచ్చినా దాని ఫలి తం వేరుగా ఉం టుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంత బల మున్నా జనసేన పార్టీ పోరాట పంథాను ఎంచుకోకపోవడంపై రాజకీయ విమర్శలు వస్తున్నాయి. గత సాధారణ ఎన్నికలకు ముందు జనసేన పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు తెలిపి ఎన్నికలకు దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల్లో దిగుతామని జనసే నాని ప్రకటించినా అన్ని చోట్ల ఆ పార్టీకి పోటీకి దిగుతుందా....? లేక అసలు ఒంటరిగా ముందుకెళ్తుందా....ఏదో ఒక పార్టీతో జతకడుతుందా...ఒకవేళ అది ఏదో ఒక పార్టీతో జతకడితే ఆ భాగస్వామి టీడీపీ అవుతుందా అన్న అనుమానాలను రాజకీయ వర్గాలు వ్యక్తంచేస్తున్నాయి. ఈ తరుణంలో ప్రజా ల పక్షాన వస్తున్నానని జనసేనాని చేసిన ప్రకటనకు స్పష్టత రావాలంటే ఈ అనుమానాలను తెరదించుతూ సొంత పోరాట పంథాను ఆయన అనుసరిం చాల్సిన అవసరముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మూడు రాజ్యసభ స్థానాల్ని దక్కించుకోనున్న టీఆర్ఎస్



- త్వరలోనే ఖాళీ కానున్న రెండు స్థానాలు
- పాల్వాయి మృతితో ఇప్పటికే ఒక స్థానం ఖాళీ
- ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనున్న సభ్యులు
- ఎన్నిక అనివార్యమైతే మార్చిలో పోలింగ్
- ఒక స్థానం యాదవులకు కేటాయిస్తానన్న సీఎం
- మరొకటి కేసీఆర్ కుటుంబ సన్నిహితులకు?
- ఇంకో స్థానం కోసం సీనియర్ల మధ్య తీవ్ర పోటీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో త్వరలోనే ఖాళీ కానున్న రెండు, ఇప్పటికే రాజ్యసభ సభ్యుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మృతితో ఖాళీ అయిన మూడు స్థానాలు టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లనున్నాయి. శాసనసభలో పార్టీల ప్రస్తుత బలాబలాల పరిశీలిస్తే, మూడింటికి మూడు స్థానాలను అధికార టీఆర్ఎస్ సునాయాసంగా గెలుచుకునే వీలుంది. అసెంబ్లీ గణాంకాల ప్రకారం సభలో ఒక నామినేటెడ్ సభ్యుడు సహా 120 మంది సభ్యులు ఉన్నారు. అందులో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 82 మంది ఉన్నారు. సాంకేతికంగా కాంగ్రెస్‌లో 19 మంది ఉన్నట్లు అసెంబ్లీ లెక్కలు చెబుతున్నప్పటికీ, ఆపార్టీకి చెందిన ఆరు మంది సభ్యులు కారెక్కిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 13కే పరిమితమవుతుంది. ఎంఐఎం 7, బీజేపీ 5 మంది సభ్యులు కలిగి ఉన్నారు. టీడీపీకి ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒకరు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఇక స్వతంత్ర ఎమ్మెల్యే ఒకరు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సహా మిగిలిన పార్టీలేవీ రాజ్యసభ స్థానాలను దక్కించుకునే అవకాశాలు లేవు.

ఒక స్థానం యాదవులకు

ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండు స్థానాలు ఖాళీ కానున్నాయి. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి ఆకస్మిక మరణంలో ఇప్పటికే ఒక స్థానం ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానాన్ని యాదవులకు కేటాయిస్తానని ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇక రెండు స్థానాల కోసం పార్టీలోని సీనియర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒకటి కేసీఆర్ కుటుంబ సన్నిహితులకు దక్కే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత నూతనంగా ఏర్పడ్డ తెలంగాణకు ఏడుగురు రాజ్యసభ సభ్యుల ప్రాతినిధ్యం లభించింది. ఇందులో టీడీపీకి చెందిన సీఎం రమేష్, కాంగ్రెస్‌కు చెందిన రాపోలు ఆనందభాస్కర్‌లను తెలంగాణకు కేటాయించారు. వారిద్దరి పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. గత ఏడాది జూన్ తొమ్మిదవతేదీన పాల్వాయి అకాల మరణం చెందారు. దాంతో 3 స్థానాలకు అనివార్యమైతే మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. నిబంధనల ప్రకారం రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యేనాటి కన్నా 30 నుంచి 45 రోజుల ముందే కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఈఏడాది ఫిబ్రవరిలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి.

6కు చేరనున్న టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల సంఖ్య

మూడు రాజ్యసభ స్థానాల భర్తీతో టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల సంఖ్య ఆరుకు చేరనుంది. ప్రస్తుతం ఆపార్టీ తరుపున ముగ్గురు రాజ్యసభ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాలు టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లడం ఖాయమని స్పష్టమవడంతో, రాజ్యసభలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 6కు చేరుతుంది.

మరో ఇద్దరు తెలంగాణ రాజ్యసభ సభ్యుల పదవీ విరమణ

ఉమ్మడి ఏపీ నుంచి రాజ్యసభకు 18 మంది ఉండగా, రాష్ట్ర విభజన తరువాత ఏడు, ఏపీకి 11 దక్కాయి. అయితే సభ్యుల విభజన లాటరీ పద్ధతిలో జరగడంతో ఇక్కడివారు కొందరు అక్కడికి, అక్కడివారు కొందరు ఇక్కడికి కేటాయించబడ్డారు. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన సీఎం రమేష్, కేవీపీ రామచంద్రరావు తెలంగాణకు, తెలంగాణకు చెందిన కె.కేశవరావు (టీఆర్ఎస్), ఎం.ఎ.ఖాన్ (కాంగ్రెస్), రేణుకాచౌదరి (కాంగ్రెస్), టి.దేవేందర్ గౌడ్ (టీడీపీ) ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో దేవేందర్‌గౌడ్, రేణుకాచౌదరి కూడా ఏప్రిల్ 2న పదవీ విరమణ చేయనున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUD-HA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.